అనుదినం... జనస్వరం

www.navatelangana.com

బుధవారం 29-01-2025

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 340 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

రూపాయి దిగాలు..

మరో 25 పైసలు పతనమై రూ. 86.56కి..



ముంబయి : అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ ఆందోళనకరంగా రోజు రోజుకు పడిపోతోంది. మంగళవారం డాలర్‌తో రూపాయి విలువ 25 పైసలు పతనమై 86.56 స్థాయికి దిగజారింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వాణిజ్య టారిఫ్ భయాలు రూపాయిపై ఒత్తిడిని కొనసాగిస్తున్నాయి. ఇంటర్ ...11లో



సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా

జాన్‌వెస్లీ

15 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం

60 మందితో రాష్ట్ర కమిటీ

కొత్తగా ఏడుగురికి చోటు

ఆహ్వానితులుగా ఏడుగురు

ప్రత్యేక ఆహ్వానితులుగా ఐదుగురు

సంగారెడ్డి నుంచి అచ్చిన ప్రశాంత్


సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ పార్టీ నూతన రాష్ట్ర కమిటీ 60 మందితో ఏర్పడింది. అందులో 15 మంది రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్రకమిటీకి ఆహ్వానితులుగా ఏడుగురు, ప్రత్యేక ఆహ్వానితులుగా ఐదుగురిని ఎన్నుకున్నారు. సంగారెడ్డి ...12లో

సమరశీల పోరాటాలతో ప్రజలకు చేరువకండి

నివాస ప్రాంతాల్లో కృషిని పెంచండి | ప్రపంచ ఆర్థిక మాంద్యాన్ని వివరించండి

సరళీకరణను ఉపేక్షించొద్దు : సీపీఐ(ఎం) శ్రేణులకు పొలిట్ బ్యూరో సభ్యులు రాఘవులు పిలుపు

సంగారెడ్డి నుంచి బీవీఎన్ పద్మరాజు



దేశంలోని వ్యవసాయం, పరిశ్రమలతో పాటు అనేక ఇతర రంగాల్లో పలు కొత్త రకాల పరిస్థితులు నెలకొంటున్నాయనీ, వాటిని అర్థం చేసుకుని ఆందోళనలకు శ్రీకారం చుట్టాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు ఆ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సరళీకృత, ఆర్థిక విధానాలపై సమరశీల పోరాటాలను సాధించడం ద్వారా ప్రజలకు చేరువ కావాలని సూచించారు. ముఖ్యంగా పట్టణాలు, గ్రామాల్లోని నివాస ప్రాంతాల్లో ప్రజా సమస్యలపై మన కృషి పెరగాలని ఆయన సూచించారు. ఇలాంటి ఆయుధాలన్నింటికీ పదును పెట్టడం ద్వారా రానున్న మూడేండ్లలో సీపీఐ(ఎం)ను ఒక ప్రభావిత శక్తిగా రూపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో మంగళవారం ముగిసిన సీపీఐ(ఎం) నాలుగో రాష్ట్ర మహాసభలో ప్రతినిధులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. హిందూత్వ, మతోన్మాద వ్యతిరేక పోరాటంలో సైద్ధాంతిక పోరాటాలను మిళితం చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. సామాజిక రంగంలో వైవిధ్యంగా కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం వివిధ ...3లో

ముగిసిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభ

వివరాలు 3లో



11లో..

అమెరికాకు హాని కలిగిస్తే చర్యలే

మన ప్రజలపై కన్నా బయటి వారిపై పన్నులు వేయాలి : ట్రంప్ వ్యాఖ్యలు

చైనా, భారత్, బ్రెజిల్ సహా పలు దేశాల్లో సుంకాలు ఎక్కువ అంటూ విమర్శలు

30న అఖిలపక్ష సమావేశం

31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ భేటీ

తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం 11లో..

ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

డిస్కంల రెవెన్యూ లోటు రూ.20,151 కోట్లు

ఐనా కరెంటు చార్జీల పెంపు లేదు : టీజీఈఆర్సీకి 2025-26 ఏఆర్ఆర్‌ల సమర్పణ 3లో..

పెట్టుబడులన్నీ పారదర్శకమే..

ఆయా సంస్థల నుంచే వివరాలు తెప్పించుకోవచ్చు

వరల్డ్ ఎకనామిక్ ఫోరం ద్వారా రూ.1.80 లక్షల కోట్లు సాధించాం

1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం :

సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం ద్వారా వచ్చిన పెట్టుబడులు అన్నీ పారదర్శకమే అని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఒప్పందాలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని పబ్లిక్ డొమైన్‌లో పెడతామనీ, ఎవరికైనా ఏవైనా సందేహాలు ఉంటే ఆయా సంస్థల నుంచే వివరాలు తెప్పించుకోవచ్చని తేల్చిచెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంపై విశ్వాసం ఉంచి పెట్టుబడులు పెట్టిన సంస్థలన్నింటికీ ధన్యవాదాలు తెలిపారు. పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల సృష్టే తమ తొలి ప్రాధాన్యత అని చెప్పారు. మంగళవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు తదితరులతో కలిసి వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీయాలని కొందరు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారనీ, దాన్ని ప్రపంచ పారిశ్రామికవేత్తలు పటాపంచలు చేశారని అన్నారు. ఈ పెట్టుబడులు ఆషామాషీగా ...11లో

టెంపుల్, హెల్త్ ఏకో టూరిజానికి ప్రాధాన్యత 3లో..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఎక్స్‌పీరియమ్ ప్రారంభోత్సవంలో మంత్రి జూపల్లి

సినీ నటులు చిరంజీవి, పద్మశ్రీ వనజీవి రామయ్య

ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

ఇసుక మాఫియాపై ఉక్కుపాదం

ఇందిరమ్మ ఇండ్లకు సరఫరాపై అధ్యయనం : సీఎం 11లో..

బీజేపీ ఆదాయం ఫుల్లు



ఈబీల ద్వారా కాషాయ పార్టీకే అధిక విరాళాలు

రెండో స్థానంలో కాంగ్రెస్

బీఆర్ఎస్, తృణమూల్‌కూ భారీగానే డొనేషన్లు

కేంద్రంలోని అధికార బీజేపీ వార్షిక ఆదాయం రోజురోజుకూ పెరిగిపోతోంది. 2022-23లో రూ.2,360.8 కోట్లుగా ఉన్న ఆ పార్టీ ఆదాయం మరుసటి సంవత్సరానికి ఏకంగా 83 శాతం పెరిగి రూ.4,340.5 కోట్లకు చేరింది. ఇందులో రూ.1,685.6 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో వచ్చినవేనని ఎన్నికల కమిషన్‌కు బీజేపీ సమర్పించిన తాజా వార్షిక ఆడిట్ నివేదిక చెబుతోంది. ఏ ఇతర పార్టీ కూడా బాండ్ల రూపంలో ఇంత భారీగా వార్షిక ఆదాయం పొందలేదు. ఇదే కాలంలో కాంగ్రెస్ ఆదాయం కూడా రూ.452.4 కోట్ల నుండి రూ.1,225 కోట్లకు....అంటే 170 శాతం పెరిగింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ఎన్నికల బాండ్ల రూపంలో తన ఆదాయాన్ని 384 శాతం మేర పెంచుకుంది. 2022-23లో కాంగ్రెస్‌కు ఎన్నికల బాండ్ల ద్వారా రూ.171 కోట్ల ఆదాయం లభిస్తే 2023-24లో రూ.828.4 కోట్లు వచ్చింది. బాండ్లకు సంబంధించినంత వరకూ బీజేపీ తర్వాత కాంగ్రెస్‌కే ఎక్కువ ఆదాయం లభించింది.

న్యూఢిల్లీ : 2023-24లో బాండ్ల రూపంలో బీఆర్ఎస్‌కు రూ.685.5 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.612.4 కోట్ల ఆదాయం సమకూరింది. ఇక ఖర్చుల విషయానికి వస్తే గత ఆర్థిక సంవత్సరంలో బీజేపీ 2,211.7 కోట్లు ఖర్చు చేసింది. 2022-23లో పెట్టిన ఖర్చుతో పోలిస్తే ఇది 62 శాతం అధికం. ఇందులో ఎన్నికలు, సాధారణ ప్రచారంపై ఆ పార్టీ రూ.1,754 కోట్లు ఖర్చు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్ వార్షిక వ్యయం రూ.1,025.20 కోట్లు. రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర కోసం ఆ పార్టీ రూ.49.6 కోట్లు ఖర్చు చేసింది. తొలి విడత భారత్ జోడో యాత్రకు రూ.71.8 కోట్లు ఖర్చయ్యాయి. 2023-24 ఆడిట్ నివేదికలో బీజేపీ ప్రకటించిన స్వచ్ఛంద విరాళాలు ...11లో

కేసీఆర్ ఆనవాళ్లు చెరిపే కుట్ర



రైతులను నిలువునా మోసం చేశారు

కోమటిరెడ్డికి దమ్ముంటే ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి

నల్లగొండ బీఆర్ఎస్ రైతు మహాధర్నాలో కేటీఆర్

నవ తెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో రైతులకు సాగు నీరు, పెట్టుబడి సహాయం అందజేసి వ్యవసాయాన్ని పండుగగా మార్చిన కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేందుకు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుబంధుపై కుట్ర చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రెండు లక్షల రుణమాఫీ, పంటకు పెట్టుబడి సహాయంగా ఏడాదికి రూ.15000 ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందంటూ.. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతు మహాధర్నాలో ఆయన మాట్లాడారు. ధాన్యం దిగుబడుల్లో తెలంగాణను దేశంలో మొదటి స్థానంలో నిలబెట్టింది కేసీఆర్ అని చెప్పారు. పంట పెట్టుబడి కోసం రైతుబంధు పథకాన్ని అమలు చేసి ఏడాదికి రూ.10000 చొప్పున అందజేసిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. రేవంత్‌రెడ్డి మాత్రం రైతు భరోసాపై మాట తప్పారు.. రైతులను నిలువునా మోసం చేశారు అని ...11లో

నాగోబాకు మహాజలాభిషేకం

గోదావరి జలాలతో మెస్రం వంశీయుల పూజలు

హాజరైన కలెక్టర్, ఐటీడీఏ పీఓ, ఎస్పీ, ఎమ్మెల్యే

దర్బార్‌కు హాజరుకానున్న రాష్ట్ర మంత్రులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలో సమ్మక్క సారలమ్మ జాతర తర్వాత రెండో అతి పెద్ద జాతరైన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లోని నాగోబా జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. దీనికి ముందు మంగళవారం అర్ధరాత్రి మెస్రం వంశీయులు గంగాజలంతో జలాభిషేకం చేశారు. తర్వాత మహా జాతర ప్రారంభమవుతుంది. ఈ జాతరకు మెస్రం వంశీయులు పక్షం రోజుల ముందు నుంచే శ్రీకారం చుట్టారు. మంచిర్యాల జిల్లాలోని హస్తిన మడుగు నుంచి గంగాజలాన్ని తీసుకొచ్చారు. గంగాజలంతో నాగోబాకు జలాభిషేకం చేయడం ఆనవాయితీ. మంగళవారం రాత్రి 9గంటల నుంచి 11గంటల వరకు మెస్రం వంశం ఆచార సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలకు మెస్రం వంశీయుల ఖటోడ(పూజారులు) దేవ్‌రావ్, హన్మంతు, కోసేరావ్, పీఠాధిపతి మెస్రం వెంకట్ రావ్, ఆలయ కమిటీ చైర్మెన్ మెస్రం ఆనంద్‌రావ్ ఆధ్వర్యంలో ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం కోలికోమ్, పెప్రే, తూమ్, డోలు ...11లో

హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ ప్రధాన ప్రభుత్వాస్పత్రుల విస్తరణ పనుల పరిస్థితి ఆగుతూ..! సాగుతూ..! అన్న చందంగా తయారైంది. మెరుగైన వైద్య సేవలు అందించడం, రోగుల సంఖ్యకనుగుణంగా సౌకర్యాల కల్పన కోసం చేపట్టిన భవన నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. రెండు, మూడేండ్లుగా పనులు జరుగుతున్నా.. నిధులు సకాలంలో విడుదల కాక భవన నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. అటు సర్కార్ పట్టించుకోక.. ఇటు సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేక పనుల్లో స్తబ్ధత నెలకొంది. దీంతో పంజాగుట్ట నిమ్స్, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి, ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్‌లో రోగులతోపాటు సహాయకులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిలోఫర్‌లో పనులు పూర్తయినా భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు.

ఆగుతూ.. సాగుతూ..!

నత్తనడకన ఆస్పత్రుల నిర్మాణ పనులు

ఏండ్లు గడుస్తున్నా అందుబాటులోకి రాని భవనాలు

నిధుల విడుదలలో జాప్యం.. రోగులకు అవస్థలు

నిమ్స్, ఎర్రగడ్డ, ఫీవర్ ఆస్పత్రులు సహా అన్నింటా అదే పరిస్థితి

నిర్మాణం పూర్తయినా ప్రారంభం కాని నీలోఫర్ భవనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వాస్పత్రులకు నిత్యం వచ్చే రోగుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. వర్షాకాలం సీజనల్ వ్యాధులతో ప్రభుత్వాస్పత్రుల్లోని ఓపీ, ఐపీ బ్లాకులు రోగులతో కిటకిటలాడుతాయి. పడకలు సైతం సరిపోని పరిస్థితి ఉంటుంది. నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రులకు నగరం నుంచే కాకుండా ఆయా జిల్లాల నుంచి కూడా భారీ సంఖ్యలో రోగులు వస్తుండటంతో పడకలు దొరకడం కష్టతరంగా మారింది. రోగుల సంఖ్యకనుగుణంగా సదుపాయాలను పెంచడంలో విపరీతమైన జాప్యం జరుగుతోంది. మరోవైపు రోగుల సంఖ్యకు అనుగుణంగా ఓపీ బ్లాక్‌లు, ల్యాబ్‌లు, రోగి సహాయకులకు బ్లాక్‌లు, ఐపీ రోగులకు వార్డులు ఇలా నిర్మాణాలు మూడు, నాలుగేండ్లుగా నిర్మాణ దశలోనే ఉన్నాయి. నల్లకుంట పీవర్ ఆస్పత్రిలో నిధుల్లేక దాదాపు రెండేండ్ల నుంచి పనులు ముందుకు సాగడం లేదు. ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ బిల్డింగ్ పనులు నత్తనడకనను తలపిస్తున్నాయి. నిమ్స్‌లో మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్‌సీ) నిర్మాణ పనులు ఆపసోపాలు పడుతున్నాయి. నిలోఫర్‌లో భవన నిర్మాణం పూర్తయినా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

పునాదిలోనే పురిటి నొప్పులు..!

నిమ్స్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఎంసీహెచ్‌సీ భవన సముదాయ నిర్మాణ పనుల ఆరంభం అట్టహాసంగా జరిగినప్పటికీ కొంత కాలంగా అసంపూర్తి దశలోనే దర్శనమిస్తున్నాయి. 200 పడకల సామర్థ్యంతో జీ-7 భవన సముదాయాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. నిమ్స్ విస్తరణ పనులకు ఎర్ర మంజిల్‌లో 33 ఎకరాల్లోని ప్రభుత్వ భూమిలో ఐదెకరాలను ప్రభుత్వం కేటాయించింది. రూ.490 కోట్ల అంచనాతో కూడిన భవన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. పూర్తిగా ప్రభుత్వ నిధులతో ...11లో



మూడేండ్లయినా ముహూర్తం కుదర్లే

రోగి సహాయకుల అవసరాలను తీర్చేందుకు నిలోఫర్ ఆస్పత్రిలో అటెండర్స్ బ్లాక్‌ను జీహెచ్ఎంసీ ఎమ్మెల్యే నిధులతో చేపట్టారు. గ్రౌండ్ ఫ్లోర్ మూడంతస్తులతో దీని నిర్మాణం పూర్తయి మూడేండ్లు కావస్తున్నా ఇంకా అందుబాటులోకి రాలేదు. ఏండ్లు గడుస్తున్నా జీహెచ్ఎంసీ నీలోఫర్‌కు భవనాన్ని అప్పగించకపోవడంతో అటెండర్స్ బ్లాక్ ప్రారంభానికి నోచుకోలేదు. ఈ బ్లాక్ అందుబాటులోకి రాక జీ-3 భవనం నిరుపయోగంగా మారింది.



పల్లి రైతుల ఆందోళన

- ధర భారీగా తగ్గించడంపై నిరసన
- దళారులు, వ్యాపారులు కుమ్మక్కయ్యారని ఆగ్రహం
- మొన్న అచ్చంపేట.. నిన్న మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డులో..

నవతెలంగాణ - మహబూబ్‌నగర్

రైతుల కష్టంతో సంబంధం లేని దళారులు, వ్యాపారులు కుమ్మక్కై మార్కెట్‌కు ఎక్కువ ధాన్యం వచ్చినప్పుడు ధరలో భారీగా తగ్గిస్తున్నారని పల్లి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అచ్చంపేట మార్కెట్‌లో ఇదే పరిస్థితి ఏర్పడగా, తాజాగా మంగళవారం మహబూబ్‌నగర్ మార్కెట్‌లోనూ ధర తగ్గింపుపై రైతులు ఆందోళనకు దిగారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డుకు భారీ మొత్తంలో వేరుశెనగ పంట వచ్చింది. ఇదే అదునుగా చేసుకొని వ్యాపారులు, మధ్య దళారులు కుమ్మక్కై ఒక్కసారిగా ధర తగ్గించారు. కార్యాలయం ముందు బోర్డులో ఉన్న ధర కన్నా రూ.1500 నుంచి 2000 వరకు తగ్గించి ధర నిర్ణయించడం అన్యాయం అంటూ రైతులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.6,100 ఉండగా 3500 నుంచి 4 వేలకు మించి ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వ్యవసాయ మార్కెట్‌కు ప్రతిరోజూ 30 వేల నుంచి 50 వేల క్వింటాళ్ల వేరుశనగ పంట వస్తోందని రైతులు తెలిపారు. అధికారులు, చైర్మెన్ కూడా రైతులకు సపోర్ట్‌గా నిలబడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పల్లి తూకం అయిన తర్వాత రైతులు ఆందోళనకు దిగడంతో జిల్లా ఉన్నతాధికారులు, మార్కెట్ కమిటీ చైర్మెన్ బి.అనిత, కార్యదర్శి భాస్కర్ వ్యాపారులతో చర్చలు జరిపారు. రైతులకు పూర్తిస్థాయి మద్దతు ధర ఇచ్చేందుకు కృషి చేస్తానని చైర్మెన్ బెకరీ అనిత మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రూ.200నుంచి 300 వరకూ పెంచారని తెలిపారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

'యూపీఎస్' ఉద్యోగి భవిష్యత్తుకు ఉరి

- మార్చి 2న చలో హైదరాబాద్ : టీఎస్‌సీపీఎస్‌ఈయూ అధ్యక్షులు స్థితప్రజ్ఞ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయబోతున్న ఏకీకృత పెన్షన్ పథకం (యూపీఎస్) ఉద్యోగుల భవిష్యత్తుకు ఉరిలాంటిదని టీఎస్‌సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ విమర్శించారు. ఈనెల 24న కేంద్ర ఆర్థిక శాఖ తెచ్చిన యూపీఎస్ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. అందులో భాగంగా హైదరాబాద్‌లోని అబిడ్స్ బీమా భవన్‌లోని సీపీఎస్ రాష్ట్ర నోడల్ కార్యాలయం ముందు యూపీఎస్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానంలో ఉద్యోగి తన జీపీఎఫ్‌లో దాచుకున్న సొమ్మును ఉద్యోగ విరమణ చెందిన తర్వాత తిరిగి వంద శాతాన్ని తిరిగి పొందుతారని చెప్పారు. సీపీఎస్ విధానంలో 60 శాతం తిరిగి ఇస్తారని వివరించారు. కానీ కొత్తగా తీసుకురాబోతున్న యూపీఎస్‌లో మొత్తం సొమ్మును ప్రభుత్వమే తీసుకుంటుందని అన్నారు. ప్రతినెలా మూలవేతనం, డీఏలో పది శాతం చొప్పున ఉద్యోగి సర్వీసు కాలం 30 నుంచి 40 ఏండ్లు ఉద్యోగి దాచుకున్న మొత్తాన్ని ప్రభుత్వం ఎన్‌పీఎస్ ట్రస్ట్‌కు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సర్వీస్ పెన్షన్ నిర్ణయం జరగకపోవడం అత్యంత దారుణమని విమర్శించారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని దేశవ్యాప్తంగా నిరసనలు చేస్తుంటే, ఈ యూపీఎస్ విధానాన్ని తీసుకురావడం అప్రజాస్వామికమని అన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం యూపీఎస్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ వచ్చేనెల ఏడో తేదీన బెంగళూరు ఫ్రీడమ్ పార్క్‌లో ధర్నా చేపడుతున్నామని అన్నారు. మార్చి 2న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామనీ, ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్‌లో నిరసన కార్యక్రమం ఉంటుందని వివరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్ ఈయూ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్‌గౌడ్, రాష్ట్ర సహాధ్యక్షులు కోటకొండ పవన్, నటరాజ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్‌రావు, కార్యదర్శి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రావు, శ్యాంసుందర్, అంజిరెడ్డి, శంకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరాంఘర్ ఫ్లైఓవర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

- డివైడర్‌ను ఢీకొట్టిన బైక్
- ముగ్గురు మైనర్లు మృతి

నవతెలంగాణ-రాజేంద్రనగర్

రంగారెడ్డి జిల్లాలో నూతనంగా ప్రారంభించిన ఆరాంఘర్ మన్మోహన్ సింగ్ ఫ్లై ఓవర్ పై బైక్‌పై వెళుతున్న ముగ్గురు మైనర్లు అతివేగంతో డివైడర్‌ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండ ఫతే దర్వాజాకు చెందిన మాజ్(15), అహ్మద్(14), తలాబ్‌కట్టకు చెందిన సయ్యద్ ఇమాన్(15) ముగ్గురు కలిసి బైక్‌పై త్రిబుల్ రైడింగ్ చేస్తూ బహదూర్‌పూర్ నుంచి ఆరాంఘర్‌కు వెళ్తున్నారు. అయితే అతివేగంతో శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడమీ వద్దకు రాగానే అతివేగంతో వెళ్తున్న బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. దాంతో బైక్‌పై ఉన్న ముగ్గురు ప్రమాదస్థలంలోనే మృతిచెందారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి అతివేగమే కారణమని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆజంజాహీ మిల్లు కార్మిక భవన్ కూల్చివేతపై ఆగ్రహం

- కాసం ఓం నమశ్శివాయను అరెస్ట్ చేయాలి : వరంగల్ చౌరస్తాలో కార్మికుల నిరసన



నవతెలంగాణ-కాశిబుగ్గ

ఆజంజాహీ మిల్లు కార్మిక భవన్‌ను కూల్చివేసిన కాసం ఓం నమశ్శివాయను అరెస్టు చేయాలని కోరుతూ మంగళవారం ఆజంజాహీ మిల్లు కార్మికులు వరంగల్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కాసం ఓం నమశ్శివాయ కార్మిక భవన్‌ను దౌర్జన్యంగా కూల్చి, అందులోని వస్తువులు, బీరువాలు, బెంచీలు, యూనియన్ పత్రాలు, ఆర్థిక సంబంధమైన డాక్యుమెంట్స్‌ను ఎత్తుకెళ్లారని తెలిపారు. తప్పుడు పత్రాలతో కార్మిక భవన్ ఆక్రమణకు ప్రయత్నించిన కాసం ఓం నమశ్శివాయను అరెస్ట్ చేయాలని, ఆజంజాహీ మిల్లు కార్మికులకు న్యాయం జరిగే వరకూ జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు కార్మికులకు అండగా ఉండాలని డిమాండ్ చేశారు. కార్మికుల ధర్నాకు ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, సీటీవో ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలియజేశారు. ఆజంజాహీ మిల్లు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇనుముల శ్రీనివాస్, ఆరెల్లి కృష్ణ నాయకులు కాశీం, నర్ర ప్రతాప్, నున్న అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మానుకోటకు పొంచి ఉన్న 'కరువు' ?

- చెరువులు, చెక్ డ్యామ్‌లకు మరమ్మతులు శూన్యం
- యాసంగికి తప్పని సాగునీటి పాట్లు
- జనవరి 26తో వరి నాట్లకు చెల్లు.. తగ్గుతున్న భూగర్భ జలాలు
- ఆందోళనలో అన్నదాతలు

నవతెలంగాణ-మహబూబాబాద్



కరువు ముంచుకొస్తోంది. సాగునీటి ఎద్దడి వెంటాడుతోంది. వాగులు ఎండిపోతున్నాయి. కట్టలు తెగిన చెరువులో చుక్కనీరు లేదు. యాసంగి సాగు కడగండ్ల పాలైంది. వరి సాగు పెరగనంటోంది. పచ్చని పొలాలు ఎడారులుగా మారుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఇదంతా నాణేనికి ఒకవైపు.. మరోవైపు ఆకేరు, మున్నేరు, పాలేరు వాగుల్లో ఇసుక తోడేస్తున్నారు.. ఫలితంగా చలిమెలు ఎండిపోతున్నాయి. ఫలితంగా వరి పొలాలు బీటలు వారే పరిస్థితి రాగా అన్నదాత ఆశలు ఆవిరవుతున్నాయి. ఇదీ మహబూబాబాద్ జిల్లా రైతుల దీనస్థితి.

జిల్లావ్యాప్తంగా 18 మండలాలు, 487 గ్రామాలు, 4 మున్సిపాలిటీల పరిధిల్లో యాసంగి వరి సాగు గత వేసవితో పోలిస్తే ఈసారి గణనీయంగా తగ్గింది. 2023-24 యాసంగిలో 1,28,978 ఎకరాల్లో వరి సాగవగా, 2024-25 యాసంగిలో 1,49,353 ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. జనవరి 27 నాటికి కేవలం 90,239 ఎకరాల వరి మాత్రమే సాగైంది. అధికారుల అంచనా ప్రకారం ఇప్పటికే 60,000 ఎకరాల వరి సాగు మైనస్‌లో ఉంది. మరో వారం రోజుల్లో 15వేల నుంచి 20వేల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశాలున్నప్పటికీ గతేడాదితో పోలిస్తే 20వేల ఎకరాల్లో వరి సాగు తగ్గే పరిస్థితి నెలకొంది. ఇతర పంటలు గతేడాదిలో జిల్లావ్యాప్తంగా జొన్న మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు, మినుములు, పెసలు, ఉలవలు, బొబ్బర్లు మొత్తం కలిసి 1,82,072.57 ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది యాసంగిలో వ్యవసాయ అధికారులు 2,04,018 ఎకరాల్లో అన్ని పంటల సాగు వస్తుందని అంచనా వేశారు. కానీ, 1,30,467 ఎకరాల సాగు మాత్రమే వచ్చింది. గతేడాదితో పోలిస్తే సుమారు 50వేల ఎకరాల్లో అన్ని పంటల సాగు తగ్గింది. ప్రధానంగా సాగునీటి ఎద్దడితో పాటు, వాతావరణ పరిస్థితులు, విద్యుత్, పెట్టుబడి సమస్యలు కారణంగా కనిపిస్తున్నాయి.

నెలలు గడుస్తున్నా మరమ్మతులు కరువు

జిల్లావ్యాప్తంగా 1590 చెరువులు ఉన్నాయి. కాగా ఈ వానాకాలం సీజన్‌లో 147 చెరువులకు గండ్లు పడ్డాయి. అందులో 47 చెరువులకు పూర్తిగా గండ్లు పడి చుక్కనీరు లేకుండా పోయింది. మహబూబాబాద్ డివిజన్‌లో అయోధ్య, మహబూబాబాద్, రజాలిపేట, రామసముద్రం, దామర చెరువు, వీఎస్ లక్ష్మీపురం, ఆలేరు, వావిలాల, బీచ్‌రాజుపల్లి, ఉగ్గంపల్లి, ఎల్లంపేట, చిన్నగూడూరు తొర్రూరుతోపాటు భారీగా చెరువులకు గండ్లు పడి చుక్క నీరు లేదు. చెరువులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కరించలేదు. దాంతో యాసంగిలో సాగునీటి కరువు వెంటాడుతోంది.

అధ్వానంగా చెక్‌డ్యామ్‌లు

మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా ఆకేరు, మున్నేరు, పాలేరు వాగులపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు వర్షాకాలంలో భారీ వర్షాలకు కొట్టుకుపోయాయి. పాలేరువాగుపై మరిపెడ మండలం తానుచర్ల వద్ద చెక్‌డ్యామ్ నీటి మట్టం తగ్గిపోవడంతో 1000 ఎకరాల పంట సాగుకు ఆటంకం ఏర్పడింది. ఆకేరువాగుపై తొర్రూరు మండలం నాంచారిమడూరు వద్ద చిన్నగూడూరు మండలం చిన్నగూడూరు విస్సంపల్లి వద్ద, నరసింహుల పేట మండలం జయపురం, మరిపెడ మండలం ఉగ్గంపల్లి, బీచ్‌రాజ్‌పెల్లి పురుషోత్తమాయగూడెం వద్ద, కొరవి మండలం ములకలపల్లి వద్ద చెక్ డ్యామ్‌లు కొట్టుకుపోయాయి. సుమారు 10వేల ఎకరాల్లో వరి సాగుకు ఆటంకం ఏర్పడింది. అలాగే మున్నేరు వాగుపై రెడ్యాల కట్టు కాలువ, ఈదుల పూసపెల్లి కట్టు కాల్వ పెనుగొండ కట్టు కాల్వ, జమాస్తపెల్లి కట్టు వద్ద, కొరవి గుండ్రాతి మడుగు వద్ద కట్టు కాలువలకు, చెక్‌డ్యామ్‌లకు గండి పడి నష్టం జరిగింది. ఇక్కడ సుమారు 3వేల ఎకరాల్లో వరి సాగుకు ఆటంకం ఏర్పడింది. మొత్తం చెక్ డ్యామ్‌ల పరిధిలో సుమారు 10వేల ఎకరాల వరి సాగుకు ఆటంకం ఏర్పడింది.

మరమ్మతులు చేయాలి

జిల్లావ్యాప్తంగా వర్షాకాలంలో వచ్చిన వరదలకు కొట్టుకుపోయిన చెక్ డ్యామ్‌లకు తక్షణ మరమ్మతు చేయాలి. అవసరమైతే వచ్చే వానాకాలం నాటికి కొత్తవి నిర్మించాలి. అలాగే ఈ వేసవిలోనే చెరువుల్లో నీళ్లు లేనందున గండ్లు పడిన చెరువులను మరమ్మత్తు చేయాలి. కట్టలు తెగిన చెరువుల కింద సాగు చేయని భూములకు పరిహారం ఇవ్వాలి.



సాదుల శ్రీనివాస్, సీపీఐ(ఎం) మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి

ఎర్రజెండా పేరు చెబితే భూస్వాముల గుండెల్లో దడ

- గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాల్సిందే : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- ఎరుపుమయమైన చేవెళ్ల గడ్డ

నవతెలంగాణ-చేవెళ్ల



ఎర్రజెండాను చూస్తే నిరుపేదలు హత్తుకుంటారు.. అదే ఎర్రజెండాను చూస్తే భూస్వాములు, దోపిడిదారులు బెదురుకుంటారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కె.రామస్వామి అధ్యక్షతన జరిగిన చేవెళ్ల నియోజకవర్గం సీపీఐ జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. భారత గడ్డపై 99 ఏండ్లు పూర్తి చేసుకుని 100 వసంతాల్లోకి అడుగుపెడుతున్న ఏకైక జెండా ఎర్రజెండా కమ్యూనిస్టు పార్టీ అని తెలిపారు.

కమ్యూనిస్టులకు అధికారం లేకపోయినా, పదవులు లేకపోయినా ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రజల కోసం ప్రాణ త్యాగాలు చేసిన గొప్ప సిద్ధాంతం కమ్యూనిజమని అన్నారు. కమ్యూనిజం సిద్ధాంతంతో అనేక దేశాల్లో సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడ్డాయని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, పేదల విముక్తికై నిజాం రాజుకు వ్యతిరేకంగా, బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా నిలిచి పోరాడిన ఎర్రజెండా ఏనాడు ప్రభుత్వాలకు రాజీ పడలేని అన్నారు. ప్రజల సమస్యలను సమగ్రంగా చర్చించి పరిష్కరిం చడంలో గత ప్రభుత్వం విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వమైన పేదల సమస్యలు పరిష్కరించడానికి చొరవ చూపాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోతు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభు లింగం, సామిడి శేఖర్‌రెడ్డి, టి.రామకృష్ణ, చేవెళ్ల సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌బాబును సత్కరించిన పొంగులేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లో మంగళవారం శాలువాతో సత్కరించారు. దావోస్ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి రూ. 1.73 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడంలో ప్రముఖ పాత్ర వహించారని ఈ సందర్భంగా తెలిపారు.

గీతంలో కంటెంట్ రైటింగ్ వర్క్‌షాప్ ప్రారంభం

- నాలుగు రోజుల పాటు కొనసాగనున్న కార్యశాల
- నైపుణ్యాలను పెంపొందించనున్న పరిశ్రమ నిపుణులు



నవతెలంగాణ-పటాన్‌చెరు

కంటెంట్ సృష్టి, వేగంగా అభివృద్ధి చెందుతున్న కమ్యూనికేషన్ రంగంతో కంటెంట్‌ను సృష్టించేలా విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలతో సన్నద్ధం చేయడమే లక్ష్యంగా గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్‌ఎస్) క్యాంపస్‌లో నాలుగు రోజుల పాటు 'కంటెంట్ రైటింగ్ వర్క్‌షాప్'ను నిర్వహించారు. మీడియా స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో జీఎస్ హెచ్‌ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ గోస్మాన్ జోస్ ఈ వర్క్‌షాప్‌ను మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధిని పెంపొందించడమే ఈ వర్క్‌షాప్ లక్ష్యమని తెలిపారు. సాంకేతికత పరిజ్ఞానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కంటెంట్ రైటింగ్ వృత్తిపై కృత్రిమ మేధస్సు ప్రభావాన్ని స్వీకరించడం ప్రాముఖ్యతను వివరించారు. ఈ వర్క్‌షాప్.. క్యాంపస్ నియామకాలకు సిద్ధం కావడం గురించి మాత్రమే కాదని, కాలానుగుణంగా విద్యార్థులు అభివృద్ధి చెందేలా రూపొందించామని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాణించాలని విద్యార్థులకు సూచించారు. కెరీర్ గైడెన్స్ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ మమతారెడ్డి మాట్లాడుతూ.. మిమ్మల్ని ప్రత్యేకంగా నిలబెట్టే ఒక ప్రత్యేక ఆలోచనా విధానాన్ని విద్యార్థులు అభివృద్ధి చేసుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. ఈ వర్క్‌షాప్ నిరంతర అభ్యాస సంస్కృతిని పెంపొందిం చడంలో నిర్వాహకుల దూరదృష్టికి నిదర్శనంగా అభివర్ణిం చారు.

మొదటి సెషన్ రిసోర్స్ పర్సన్‌గా జియో మారియా పాల్గొని, కంటెంట్ రైటింగ్ ప్రాథమిక అంశాలు, కంటెంట్ రకాలు, ఎస్‌ఈవో టెక్నిక్ వంటి కీలక అంశాలను విద్యార్థులకు పరి చయం చేశారు.

రెండో సెషన్‌లో కంటెంట్ కమ్యూ నికేషన్, వ్యక్తిగత బ్రాం డింగ్ వంటి వాటిని వివరిం చారు. మూడు రోజులు కొనసాగే ఈ కార్య క్రమంలో పరిశ్రమ నిపుణు లు పాల్గొని ఆయా అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమం లో ఆంగ్ల విభాగాధి పతి డాక్టర్ సయంతన్ మండల్, మీడియా స్టడీస్ విభాగాధిపతి ఎస్ఆర్ సంజీవ్ కుమార్, దాదాపు 40 మంది యూజీ, పీజీ విద్యార్థులు పాల్గొంటున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు విద్యార్థులు మృతి

- లారీ ఢీకొట్టడంతో బాలిక.. టిప్పర్ ఢీకొని బాలుడు

నవతెలంగాణ - బంజారా హిల్స్/బోడుప్పల్


(ఫైల్)

హైదరాబాద్‌లో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మంగళవారం ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. షేక్‌పేటలో బైక్‌ను లారీ ఢీకొట్టడంతో బాలిక, మేడిపల్లిలో ట్యూషన్‌కు వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తుండగా టిప్పర్ ఢీకొట్టడంతో పదో తరగతి విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటనలపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

ఉదయం గడ్డం హేమసుందర్ ఐదో తరగతి చదువుతున్న కుమార్తె(10)ను స్కూల్‌లో వదిలేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఫిలింనగర్ వద్ద వేగంగా దూసుకొచ్చిన లారీ ముందున్న వారి బైక్‌ను ఢీకొట్టింది. దాంతో కింద పడిన బాలికపై లారీ వెనుక టైర్లు ఎక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. గాయపడిన తండ్రిని ఫిల్మ్‌నగర్ పోలీసులు ఆస్పత్రికి తరలించారు. అతడు ఓ ప్రముఖ న్యూస్ ఛానల్ డిజిటల్ హెడ్‌గా పనిచేస్తున్నారని తెలిసింది. బాలిక మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్టు తెలిసింది.

టిప్పర్ ఢీకొని..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పీఎస్ పరిధిలో పదో తరగతి విద్యార్థి ట్యూషన్‌కు వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచవాణిసింగారం గ్రామానికి చెందిన మోతిరాం కుమారుడు తేజేష్ చౌదరి(15) ఉదయం స్థానికంగా ప్రయివేటు ట్యూషన్ కోసం వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. స్వాంజీల కాలనీ వద్ద టిప్పర్ ఢీకొనడంతో బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు దర్యాప్తులో ఉంది.

టెంపుల్, హెల్త్ ఏకో టూరిజానికి ప్రాధాన్యత



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
ఎక్స్‌పీరియమ్ ప్రారంభోత్సవంలో
మంత్రి జూపల్లి కృష్ణారావు
సినీ నటులు చిరంజీవి, పద్మశ్రీ వనజీవి రామయ్య, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-శంకర్‌పల్లి

రాష్ట్రంలో టెంపుల్, హెల్త్, ఏకో టూరిజాలను తీసుకొస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని 150 ఎకరాల్లో ఉన్న ఎక్స్‌పీరియమ్‌ను మంగళవారం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సినీనటులు చిరంజీవి, ఎక్స్ పీరియమ్ చైర్మెన్ రామడుగు రాందేవ్‌రావు, పద్మశ్రీ వనజీవి రామయ్య, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అనిల్ కుమార్, సీఎం రమేష్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాల యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, 70 ఎకరాల అడవిని సృష్టించిన దుశర్ల సత్యనారాయణ, రైటర్ విజయేంద్ర ప్రసాద్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐటీ, ఫార్మా రంగాల్లో రాణించిందని, మౌలిక సదుపాయాల్లో దేశ, విదేశాల్లోని ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నాయని తెలిపారు. అయితే తెలంగాణలో టెంపుల్, హెల్త్, ఏకో టూరిజం రావాలన్నారు. వీటి వల్ల రాష్ట్రానికి గుర్తింపు, గౌరవం, ఆదాయం లభిస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే టూరిజం పాలసీపై చర్చిస్తుందని, త్వరలో విధివిధానాలు తీసుకొస్తుందని తెలిపారు. ప్రస్తుతం శు భాకార్యాలు చేయాలంటే ఇతర దేశాలు, ప్రాంతాలకు వెళ్లి చేసుకుంటున్నారని, మంది రాలు దర్శించాలంటే తమిళనాడు, ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారని, ప్రకృతిని ఆస్వాదిం చాలంటే మధ్యప్రదేశ్‌కు వెళ్తున్నారని అన్నారు. కాగా, భవిష్యత్తులో ఇవన్నీ ఇక్కడే చేసుకునేలా టూరిజం పాలసీని రూపొందిస్తామని తెలిపారు. ప్రముఖులు ఇల్లు కట్టుకుంటే గోదావరి జిల్లాల నుంచి మొక్కలు తెప్పించుకునే పరిస్థితి నుంచి నేడు ఎక్స్‌పీరియమ్ నుంచి మొక్కలు తెచ్చుకునేటట్టు చేశారని అన్నారు.

తెలంగాణలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మందిరాలు, ప్రకృతి వనరులు ఉన్నాయని అన్నారు. నల్లమల టైగర్ ఫారెస్ట్, కృష్ణానది జలాలు పారిస్తున్న ప్రాంతం మల్లెల తీర్థం వంటివి ఉన్నాయని, వీటికి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల ఏకో టూరిజం వెనుక పడుతుందని చెప్పారు. వికారాబాద్‌లో సాధారణంగా చుట్టుపక్కల ప్రాంతాల కంటే రెండు డిగ్రీల ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, అందుకే ఇక్కడ టీవీ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. అందుకే వికారాబాద్ ప్రాంతాన్ని ఏకో టూరిజంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నారని చెప్పారు. భవిష్యత్తులో ఏకో టూరిజానికి ఎక్స్‌పీరియమ్ ఒక ప్రతిపాదిక అవుతుందన్నారు. దీనికి రామడుగు రాందేవ్ రావును మనస్ఫూర్తిగా అభినంది స్తున్నట్టు చెప్పారు. ఈ ఎక్స్‌పీరియమ్ కేవలం ఒక వ్యాపార కేంద్రంగానే కాకుండా పర్యాటక క్షేత్రంగా అవతరిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. మన రైతులు కేవలం వరి పండించడమే కాదని, ఇలాంటి మొక్కలు కూడా పెంచేలా చేయాలనుకుంటున్నామని తెలిపారు. రెండూ మూడు సంవత్సరాలు నిండే వరకు మొక్కలు పెంచితే వాటిని తీసుకెళ్లి నాటితే ఎక్కువగా బతుకుతాయని, వాటిని ఒక సీజన్ కాపాడితే సరిపోతుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ విధివిధానాలను చర్చించి సవరించి ప్రకృతి పరిరక్షణ కోసం పాటుపడతామని హామీ ఇచ్చారు. వనజీవి రామయ్యకు భారత ప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చిందని, మొక్కలు నాటడంలో రాణించి నందుకు ఆయనకు ఈ గుర్తింపు వరించిందని అన్నారు. రామయ్య లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. 85 దేశాల నుంచి మొక్కలు తెచ్చి ఎక్స్‌పీరియమ్‌ను ఆహ్లాదకరంగా చేస్తున్నం దుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆసియాలోని అతిపెద్ద హంపి థియేటర్ వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఎక్స్‌పీరియం గురించి సోషల్ పోస్ట్ డిజిటల్ మీడియా రూపొందించిన ఆడియో విజువల్‌ను సీఎం లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీవో చంద్రకళ, శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్, ఎంపీడీవో వెంకయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధ నీడలో 'ఎన్టీపీసీ' ప్రజాభిప్రాయ సేకరణ



భారీగా పోలీస్ బలగాల మోహరింపు
రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-గోదావరిఖని

పెద్దపల్లి జిల్లా రామగుండం వద్ద ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్ట్ రెండో దశ పనులకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ పోలీసు బందోబస్తు మధ్య సాగింది. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆధ్వర్యంలో మంగళవారం ఎన్టీపీసీ జ్యోతినగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా.. పోలీస్ బలగాలు భారీగా మోహరించాయి. సుమారు 3వేల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు రాతపూర్వకంగా దరఖాస్తులు తీసుకురాగా లోపలికి పంపించకుండా అడ్డుకున్నారని, పోలీసుల చర్యలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక చిన్న కాగితం పట్టుకుపోతే లోపలికి పోనివ్వడం లేదని, ఇదేం ప్రజాభిప్రాయ సేకరణంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వేదిక వద్దకు వచ్చే క్రమంలో గేటు వద్దనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేయగా, బీజేపీ నాయకులు లావణ్య పునరావాసం, ఆరోగ్య సేవలు అందించాలని అభిప్రాయపడ్డారు. కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రజల సూచనలు నమోదు చేసి సంబంధిత శాఖకు పంపుతున్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టు రెండో దశ పూర్తయ్యాక రామగుండం దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ప్లాంట్‌గా అవతరించనుందని చెప్పారు. రాజకీయ, ప్రజా సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నాంసాని శంకర్, ఇతర నాయకులను జైపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జర్నలిస్టులను అడ్డుకోవడం పట్ల వారు నిరసన వ్యక్తం చేయగా, డీసీపీ జోక్యం చేసుకుని పరిష్కరించారు.



పదోన్నతుల్లో వివక్ష చూపొద్దు



టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ
వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం వద్ద
ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖలో పదోన్నతుల్లో వివక్షను చూపొద్దని టీజీవో ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదోన్నతుల్లో వివక్షను నిరసిస్తూ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు తమ సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. పదోన్నతుల విషయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వాణిజ్య పన్నుల శాఖ ... చెప్పారు. ... శ్యామ్ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీలు ఐక్యంగా ఉంటే ఆటలు సాగబోవని కొందరు భావించి విభేదాలు సృష్టిస్తున్నారని అన్నారు. సభ్యులంతా ఐక్యంగా ఉండాలని కోరారు. పోరాటాల ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. అధ్యక్షత వహించిన సంఘం అధ్యక్షుడు కె భిక్యా మాట్లాడుతూ ఉద్యోగ విరమణ సమయానికి చేరుకున్న ఉద్యోగులు తమకు రావాల్సిన పదోన్నతులను అనవసరమైన ఆలస్యం ఎదుర్కొంటున్నారని అన్నారు. అనేక దశాబ్దాలుగా సేవలందించినప్పటికీ ఉద్యోగులు పదోన్నతులను పొందడం లేదన్నారు. అందుకోసం లాబీయింగ్ చేయాల్సిన పరిస్థితి రావడం విచారకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కె నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

డిస్కంల రెవెన్యూ లోటు రూ.20,151 కోట్లు

ఐనా కరెంటు చార్జీల పెంపు లేదు :
టీజీఈఆర్సీకి 2025-26 ఏఆర్ఆర్‌ల సమర్పణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాల విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) 2025-26 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ గ్యాప్ రూ.20,151 కోట్లు ఉంటుందని అంచనా వేశాయి. పై ఏడాదికి ఆదాయ అవసరాల ఆవశ్యకత (ఏఆర్ఆర్)ను రూ.65,849 కోట్లుగా నిర్ధారించారు. కానీ వచ్చే ఆదాయం రూ.45,698 కోట్లుగా లెక్కించారు. ప్రస్తుత టారిఫ్ ద్వారా రూ.45,641 కోట్లు, ఇతర మార్గాల ద్వారా మరో రూ.56.71 కోట్లు వస్తుందనీ, మొత్తం ఆదాయం రూ.45,698 ఉంటుందని పేర్కొన్నారు. పై ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఏఆర్ఆర్‌లను డిస్కంలు మంగళవారం తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)కి సమర్పించాయి. వాస్తవానికి ఏఆర్ఆర్‌లను గత ఏడాది నవంబర్‌లోనే ఈఆర్సీకి సమర్పించాల్సి ఉంది. వివిధ కారణాలతో వాయిదా పడుతూ వస్తుంది. ఇటీవల సీఎంతో పాటు విద్యుత్‌శాఖ మంత్రి కూడా కరెంటు చార్జీల పెంపు ఉండదని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డిస్కంలు ఏఆర్ఆర్‌లలో ఆదాయ పెంపును ప్రతిపాదించలేదు. ఆదాయలోటును భర్తీ చేయడం కోసం ఈఆర్సీ ప్రభుత్వానికి లేఖ రాయాల్సి ఉంటుంది. దీనిపై ప్రభుత్వం ఇచ్చే హామీని బట్టి ఈఆర్సీ నిర్ణయం తీసుకుంటుంది

రెండు డిస్కంల పరిధిలో ప్రస్తుత టారిఫ్ ప్రకారం రెవెన్యూగ్యాప్ 30.60 శాతం ఉంటుందని అంచనా వేశారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో 21.9 శాతం, ఎన్పీడీసీఎల్ పరిధిలో 52.4 శాతం ఆదాయ వ్యత్యాసం ఉంటుందని తెలిపారు. ఆదాయ ఆవశ్యకత టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో ప్రస్తుత టారిఫ్ ప్రకారం రూ.36,220 కోట్లు, టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో రూ.9,421 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. ఏఆర్ఆర్‌లపై ఈఆర్సీ ప్రజాభిప్రాయసేకరణ జరిపి, ఈ ఏడాది మార్చి నెలాఖరునాటికి ప్రకటన చేయాల్సి ఉంటుంది.

ఆప్ పార్టీకి మద్దతుగా ఎస్‌పీ

- ప్రచారం చేయనున్న అఖిలేశ్ యాదవ్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మరికొద్ది రోజుల్లో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికల పోలింగ్ జరగనున్నది. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని ఉధృతం చేశాయి. అధికార ఆమాద్మీ పార్టీ (ఆప్)కి మద్దతుగా సమాజవాదీ పార్టీ(ఎస్‌పీ) అధినేత, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్‌తోపాటు ఆ పార్టీ ఎంపీలు ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం వెల్లడించారు. జనవరి 30న తాను రితాలలో రోడ్ షో నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ రోడ్ షోలో ఎస్‌పీ అధినేత అఖిలేశ్ యాదవ్ పాల్గొంటారని చెప్పారు. అలాగే ఆ పార్టీకి చెందిన పలువురు ఎంపీలు.. ఈ ఎన్నికల్లో ఆప్‌నకు మద్దతుగా ప్రచారం చేస్తారని వివరించారు. ఆప్ ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా టీఎంసీ ఎంపీ, ప్రముఖ నటుడు శత్రుఘ్న సిన్హా ఫిబ్రవరి 1, 2వ తేదీల్లో ప్రచారం నిర్వహించనున్నారు. 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనున్నది. ఈ ఎన్నికల ఫలితాలు ఫిబ్రవరి 8న వెల్లడవుతాయి.


సమరశీల పోరాటాలతో ప్రజలకు చేరువకండి

(మొదటిపేజీ తరువాయి)

దేశాల్లో ఆర్థిక మాంద్యం, ఆర్థిక సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ఆ ప్రభావం భారతదేశంపై ఎలా ఉండబోతున్నదనే అంశాన్ని ప్రజలకర్థమయ్యే రీతిలో విడమర్చి చెప్పాలని మార్గదర్శనం చేశారు. ఐటీ, ఇంజినీరింగ్ రంగాల్లో వస్తున్న మార్పులను సైతం అధ్యయనం చేయాలని సూచించారు. ఇలాంటి కృషి చేయడం ద్వారా తెలంగాణలో రాబోయే రోజుల్లో పార్టీ ప్రజా పునాదిని బలోపేతం చేయాలని రాఘవులు పిలుపునిచ్చారు.

ఉద్యోగాల వేటలో ఎంబీఏలు

టాప్ స్కూల్స్‌లో చదివినా వెంటాడుతున్న నిరుద్యోగం



నైపుణ్యం ఉంటేనే జాబ్ అంటున్న కంపెనీలు

న్యూఢిల్లీ : అంతర్జాతీయంగా పేరెన్నికగన్న బిజినెస్ స్కూల్స్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న ఎంబీఏ పట్టభద్రులు ఇప్పుడు ఉద్యోగాల వేటలో పడ్డారు. మూడు నెలల గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న తర్వాత కూడా హార్వర్డ్ బిజినెస్ స్కూల్ నుండి వచ్చిన ఎంబీఏ పట్టభద్రుల్లో 23 శాతం మంది ఇంకా నిరుద్యోగులుగానే మిగిలిపోయారు. స్టాన్‌ఫర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్, వార్టన్ స్కూలులో విద్యాభ్యాసం చేసిన ఎంబీఏ పట్టభద్రులదీ అదే పరిస్థితి. టెక్నాలజీ, కన్సల్టింగ్ రంగాల్లో ఎంబీఏల నియామకం తగ్గిపోవడం ఈ పరిస్థితికి ఓ ప్రధాన కారణం. అనేక కంపెనీలు, సంస్థలు డిగ్రీలు చదివిన వారి కంటే నైపుణ్యం చూపుతున్న వారికే ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నాయి.

భారత్‌లో నైపుణ్యాభివృద్ధి సమస్య చాలా కాలం నుంచీ ఉన్నదే. అయితే ఈ సమస్య మన దేశానికి మాత్రమే పరిమితమై లేదు. అమెరికాలో సైతం ఎంబీఏ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగాలు దొరకడం లేదు. హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్, వార్టన్ వంటి ఐవీ లీగ్ కళాశాలల నుండి ఎంబీఏ డిగ్రీలు పుచ్చుకున్న వారికే ఉద్యోగాలు లభించడం లేదంటే ఇక సాధారణ సంస్థల్లో చదివిన వారి గురించి చెప్పేదేముంది?

నిరుద్యోగం పెరుగుతోంది

హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో (హెచ్‌బీఎస్) గత ఏడాది ఎంబీఏ పూర్తి చేసుకున్న వారిలో 23 శాతం మందికి మూడు నెలల గ్రాడ్యుయేషన్ తర్వాత కూడా ఉద్యోగాలు రాలేదు. 2022లో నిరుద్యోగ రేటు 10 శాతంగా, 2023లో 20 శాతంగా ఉంది.

అంటే నిరుద్యోగుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోందన్న మాట. ఐఐటీ పట్టభద్రులు సైతం ఇటీవలి కాలంలో ఇలాంటి సమస్యనే ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ తాజా నివేదిక ప్రకారం 2023లో యువకుల్లో 13 శాతం మంది నిరుద్యోగులుగా ఉండిపోయారు. అంటే 64.9 మిలియన్ల మందికి ఉద్యోగాలు రాలేదన్న మాట. 2020లో ప్రపంచ ఆర్థిక ఫోరం ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రతి నలుగురు మేనేజ్‌మెంట్ నిపుణుల్లో ఒకరు మాత్రమే ఉద్యోగాన్ని సంపాదించగలిగారు. అప్పటి నుండి పరిస్థితిలో పెద్దగా మెరుగుదల కన్పించలేదు.

ఏ సంస్థ చూసినా...

హార్వర్డ్ యూనివర్సిటీతో పాటు వార్టన్ (20 శాతం), స్టాన్‌ఫర్డ్ (22 శాతం) వంటి ప్రముఖ టయర్-బీ స్కూల్స్, న్యూయార్క్ యూనివర్సిటీకి చెందిన స్టెర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్ కూడా ఇదే సమస్యతో ఇబ్బంది పడుతున్నాయి. అక్కడ కొత్తగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగాలు లభించడం కష్టంగా మారింది. ప్రపంచంలో పేరు ప్రఖ్యాతలు కలిగిన, ఖరీదైన సంస్థల విద్యార్థులు కూడా ఆర్థిక మాంద్యాన్ని, వైట్ కాలర్ జాబ్ పరిశ్రమను వెంటాడుతున్న సమస్యలను తప్పించుకోలేకపోవడం గమనార్హం. అమెరికాలోని ఇతర ప్రతిష్టాత్మక సంస్థల్లో ఎంబీఏ చదివిన వారికి కూడా ఉద్యోగాలు దొరకడం లేదు. యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన బూత్ స్కూల్, నార్త్‌వెస్ట్రన్ యూనివర్సిటీకి చెందిన కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో నిరుద్యోగ గ్రాడ్యుయేట్ల సంఖ్య మూడింతలు పెరిగింది.

ఉద్యోగాల్లో కోత

గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి ప్రముఖ టెక్ కంపెనీలు, మెకిన్సే, బీసీజీ వంటి పేరున్న కన్సల్టింగ్ సంస్థలు ఎంబీఏ గ్రాడ్యుయేట్లను ఉద్యోగాల్లోకి తీసుకోవడాన్ని తగ్గించాయి. 2023లో చాలా ఉద్యోగాలకు కోత పడింది. ముఖ్యంగా కోవిడ్ తర్వాత అనేక కంపెనీల్లో పని పద్ధతులు మారిపోయాయి. అవి చిన్న మరింత సమర్థవంతమైన టీమ్స్ కోసం అన్వేషిస్తున్నాయి. ఏఐ, ఆటోమేషన్‌కు ప్రాధాన్యత పెరగడం కూడా సమస్యగా మారింది. బిజినెస్ నాలెడ్జ్‌తో పాటు టెక్నికల్ స్కిల్స్ ఉన్న ఎంబీఏ పట్టభద్రులకే కొద్దో గొప్పో ఉద్యోగాలు లభిస్తున్నాయి.

ముగిసిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభ

పోరాటాలకు పదును పెడుతూ.. స్ఫూర్తిదాయకంగా దిశానిర్దేశం





సంగారెడ్డి నుంచి బి.వి.యన్.పద్మరాజు

సంగారెడ్డి పట్టణంలో సీతారాం ఏచూరి నగర్‌లోని మల్లు స్వరాజ్యం ప్రాంగణంలో ఈ నెల 25 నుంచి నాలుగు రోజుల పాటు కొనసాగిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలు మంగళవారం అత్యంత జయప్రదంగా ముగిశాయి. ప్రారంభం నుంచి ముగింపు వరకు మహాసభకు హాజరైన ప్రతినిధులు అత్యంత క్రమశిక్షణతో చర్చలు, కార్యకలాపాల్లో పాల్గొన్నారు. మొత్తం 49 అంశాలపై తీర్మానాలను ప్రతిపాదించి ఆమోదించారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై అగ్రనేతలు విశ్లేషణలు చేశారు. ముంచుకొస్తున్న మతోన్మాద ప్రమాదం, ప్రజలపై తీవ్రమైన భారాలు మోపుతున్న సరళీకృత, ఆర్థిక విధానాలు, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో శరవేగంగా దూసుకెళ్తున్న ప్రస్తుత తరుణంలోనూ రాష్ట్రంలో కొనసాగుతున్న కులవివక్ష, సామాజిక అణిచివేతపై మహాసభ అత్యంత ఆందోళన వ్యక్తం చేసింది.

వాటన్నింటినీ సమగ్ర అధ్యయనం చేయడం ద్వారా ప్రజలను సమీకరించి సమరశీల పోరాటాలకు రూపకల్పన చేయాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్, విజయరాఘవన్, రాఘవులు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మారిన రాజకీయ పరిస్థితులు, ఆ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటి అమలులో వైఫల్యాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పేరిట కాలయాపన, తదితర అంశాలను మాజీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోదాహరణంగా వివరించారు.

మూడు రోజుల పాటు వివిధ రంగాల వారీగా చర్చలు జరిపిన ప్రతినిధులు జిల్లాల్లో ఉన్న వాస్తవ, క్షేత్రస్థాయి అంశాలను మహాసభ దృష్టికి తీసుకొచ్చారు. పోడుభూముల పోరాటం, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలు, అసంఘటిత కార్మికుల ఇక్కట్లు, కనీస మద్దతు ధరలు, కనీస వేతనాలు, మహిళలపై వివక్ష, అణిచివేత, దళితులు, గిరిజనుల పట్ల కొనసాగుతున్న దాడులు, మైనార్టీలపై అఘాయిత్యాలు, గురుకులాల్లోని సమస్యలు, జర్నలిస్టులపై దాడులు తదితర అంశాలను మహాసభ కూలంకుషంగా చర్చించింది. వాటిని లోతుగా అధ్యయనం చేయడం ద్వారా భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేయాలని నేతలు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

మరోవైపు పూర్తిగా శ్రామిక వర్గం ఇచ్చిన విరాళాల ఆధారంగానే అత్యంత జయప్రదంగా ముగిసిన సంగారెడ్డి మహాసభ భవిష్యత్తు కార్యక్రమాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ ఇచ్చిన సూచనలు, సలహాల ఆధారంగా పూర్తిగా కార్మికుల నుంచే విరాళాలు, చందాలు స్వీకరించి ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించడం అబ్బురపరిచింది. ప్రధానద్వారం వద్ద నుంచి చివరనున్న ప్రతినిధుల సభ వేదిక వరకూ అలంకరించిన తీరు ఆకట్టుకుంది. మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, మావో, స్టాలిన్, చేగువేరా, హ్యూగోచావెజ్, కాస్ట్రో, తదితర అంతర్జాతీయ నేతల వ్యాఖ్యలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రతినిధుల్లో చైతన్యాన్ని నింపాయి. ప్రధానద్వారం వద్ద తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల చిత్రాలతో కూడిన హోర్డింగ్‌లు ఆ పోరాట స్ఫూర్తిని రగిలించాయి. వివిధ కమిటీలు ఎప్పటికప్పుడు సమావేశమై ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రణాళికలు రూపొందించి అమలు చేశాయి. మూడు రోజుల పాటు ప్రతినిధులకు, అతిథులకు స్వయంగా కార్మికులే వాలంటీర్లుగా మారి పలు రకాల సేవలందించడం అభినందనీయం. వారిని వెనుక ఉండి నడిపించిన ఆహ్వాన సంఘం చైర్మెన్ చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి జయరాజు.. ప్రతినిధుల ముగింపు సభ సందర్భంగా ఈ అంశాలను గుర్తుచేశారు. మహాసభల నిర్వహణకు ఆర్థిక, హార్దికంగా అండదండలుగా నిలిచిన ఆయా కంపెనీల కార్మికులకు వారు పేరుపేరునా విప్లవాభినందనలు తెలిపారు. శ్రామిక వర్గం ఇచ్చిన అండతో భవిష్యత్తులో ఎలాంటి కార్యకలాపాలనైనా నిర్వహించగలమనే ధైర్యం తమకు వచ్చిందని చెప్పారు. సంగారెడ్డిలో మహాసభలు నిర్వహించేందుకు అనుమతించిన కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలకు ధన్యవాదాలు తెలిపారు. సహకరించిన మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు చెప్పారు. ఇదే సమయంలో మహాసభలను అత్యంత జయప్రదంగా నిర్వహించిన ఆహ్వానసంఘాన్ని, ఉమ్మడి మెదక్ జిల్లా పార్టీ శ్రేణులను ఎ.విజయరాఘవన్, రాఘవులు, తమ్మినేని అభినందించారు. మొత్తంమీద రానున్న మూడేండ్ల పాటు నిర్వహించాల్సిన కర్తవ్యాలు, చేయాల్సిన పోరాటాల ప్రణాళికను భుజాన వేసుకుని ప్రతీ ప్రతినిధి అత్యంత స్ఫూర్తిదాయకంగా తమతమ ప్రాంతాలకు బయలుదేరి వెళ్లారు.

నవతెలంగాణ

పేదలకు సరైన తిండి తిప్పలు సమకూర్చినపుడే
నిజమైన నాగరికత ఉన్నట్టు లెక్క - శామ్యూల్ జాన్సన్

బుధవారం 29 జనవరి 2025
www.navatelangana.com

సంపాదకీయం

డోనాల్డ్ ట్రంప్ దుష్టాలోచన !



కుదిరిన ఒప్పందాన్ని ఏదో ఒక సాకుతో ఉల్లంఘించేందుకు, ఆ పేరుతో పాలస్తీనియన్లను అన్నివిధాలా ఇబ్బందులకు గురిచేసేందుకు ఇజ్రాయెల్ చూస్తున్నది. హమాస్, ఇతర సంస్థల వద్ద బందీలుగా ఉన్న తమవారిని విడిపించుకొనేంతవరకు చూసి తరువాత గాజాలోనే తిష్టవేసినా ఆశ్చర్యం లేదనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇప్పటి వరకు అది సాగించిన మారణకాండలో వేలాది ప్రాణాలు పోగా గాజా సర్వనాశనమైంది. ఆ ప్రాంతాన్ని "శుభ్రం చేసే" పేరుతో మిగిలి ఉన్న లక్షలాది మందిని అక్కడి నుంచి బయటకు పంపే దుష్ట ఆలోచనను డోనాల్డ్ ట్రంప్ ముందుకు తెచ్చాడు. ఏనాడూ అక్కడ జరిగిన దుర్మార్గాన్ని తప్పు పట్టని ఆ పెద్దమనిషి నోటి నుంచి ఇలాంటి ప్రతిపాదన వచ్చిందంటే

> ఒప్పందం ప్రకారం గాజాలో పాలస్తీనా ఖైదీలను వదలి పెడుతున్నప్పటికీ మరో ప్రాంతమైన పశ్చిమగట్టులో దాడులు జరిపి అంతకంటే ఎక్కువ సంఖ్యలో అరెస్టులు చేసి జైళ్లలో పెడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇవన్నీ రెచ్చగొట్టే చర్యలు తప్ప మరొకటి కాదు. వీటిని సహించలేక ఎక్కడైనా ప్రతిదాడులకు దిగితే వాటిని సాకుగా చూపి ఒప్పందాన్ని నీరుగార్చే దుర్మార్గం వీటి వెనుక దాగుంది.

కచ్చితంగా అనుమానించాల్సిందే. అమెరికా నేతల మాటలకు అర్థాలే వేరులే అని వేరే చెప్పనవసరం లేదు. మాతృభూమి కోసం దశాబ్దాలుగా ప్రాణాలను తృణ ప్రాయంగా పరిగణిస్తున్న పాలస్తీనియన్లు సహజంగానే ఈ ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. శుభ్రం అంటే మొత్తంగా వారిని ఆ ప్రాంతం నుంచి తొలగించటం తప్ప వేరు కాదు. పక్కనే ఉన్న ఈజిప్టు, జోర్డాన్‌కు జనాన్ని శాశ్వతంగా పంపివేయాలన్న దుష్ట ఆలోచన దీని వెనుక ఉంది. తరువాత ఏదో ఒక సాకుతో ఆ ప్రాంతాన్ని ఇజ్రాయెల్‌లో విలీనం చేయాలన్న ఎత్తుగడ ఉందని వేరే చెప్పనవసరం లేదు. గాజాలో జనవరి 18వ తేదీ అర్ధరాత్రి నుంచి కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది, దాని ప్రకారం రెండు దఫాలుగా బందీలు-ఖైదీల విడుదల జరిగింది. అయినప్పటికీ ఉత్తర గాజాలో తమ నివాస ప్రాంతాలకు తిరిగి వచ్చేందుకు పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ మిలిటరీ జనవరి 27వ తేదీ వరకు అనుమతించలేదు. ఒక బందీని విడుదల చేయలేదంటూ సాకు చెప్పింది. నిజానికి ఆ బందీ హమాస్ వద్దలేడు, వేరే సంస్థ అధీనంలో ఉన్నాడు. తమకు సరైన సంకేతాలు అందని కారణంగా వదలి పెట్టలేదని వారు చెప్పారు. తరువాత వదలివేశారు. దాంతో విధిలేని స్థితిలో గేట్లు తెరవటంతో బుధవారం నాటికి మూడులక్షల మంది తిరిగి వచ్చారు. వారికి అక్కడ శిధిలాలు తప్ప మరొకటి కనిపించలేదు. ఒప్పందం ప్రకారం గాజాలో పాలస్తీనా ఖైదీలను వదలి పెడుతున్నప్పటికీ మరో ప్రాంతమైన పశ్చిమగట్టులో దాడులు జరిపి అంతకంటే ఎక్కువ సంఖ్యలో అరెస్టులు చేసి జైళ్లలో పెడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇవన్నీ రెచ్చగొట్టే చర్యలు తప్ప మరొకటి కాదు. వీటిని సహించలేక ఎక్కడైనా ప్రతిదాడులకు దిగితే వాటిని సాకుగా చూపి ఒప్పందాన్ని నీరుగార్చే దుర్మార్గం వీటి వెనుక దాగుంది.

ఒప్పందం అమల్లోకి వచ్చిన తరువాత కూడా మరణించిన వారిని కలుపుకొంటే 47,317 మందిని ఇజ్రాయెల్ మిలిటరీ చంపివేసింది, 1,11,494 మందిని గాయపరచింది. మా జనం ఎట్టి పరిస్థితుల్లోనూ మా ప్రాంతాలను లేదా పవిత్ర స్థలాలను వదలి పెట్టరు. గతంలో జరిగిన ఘోరాలను పునరావృతం కానివ్వం అని పాలస్తీనా అధారిటీ వ్యాఖ్యానించింది. ఒప్పందం ప్రకారం ఇజ్రాయెల్ మిలిటరీని గాజా నుంచి ఖాళీ చేయించాలని ట్రంప్‌ను డిమాండ్ చేసింది. ఇజ్రాయెల్ పథకాలు, కుట్రలకు అనుగుణంగా చేసిన ఈ ప్రతిపాదనను అమెరికా వెనక్కు తీసుకోవాలని, మారణకాండనే ప్రతిఘటించిన తాము బలవంతంగా ఇరుగు పొరుగుదేశాలకు తరలిస్తామంటే ఎలా సహిస్తామని గాజాలో అధికారంలో ఉన్న హమాస్ స్పందించింది. హమాస్‌తో పాటు సాయుధ పోరాటం చేస్తున్న పాలస్తీనియన్ ఇస్లామిక్ జీహాద్ సంస్థ కూడా ట్రంప్ ప్రతిపాదనను ఖండించింది. యుద్ధ నేరాలను సమర్ధించటం తప్ప వేరు కాదని పేర్కొన్నది. గాజన్లను వారి ప్రాంతాల నుంచి తొలగించకూడదన్న తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని, సర్వసత్తాక పాలస్తీనా ఏర్పాటు దిశగా ట్రంప్ యంత్రాంగంతో కలసి తాము పని చేస్తామని జోర్డాన్ ప్రకటించింది. ట్రంప్ ప్రతిపాదన ఏ మాత్రం ఆచరణ సాధ్యం కాదని, అరబ్ దేశాలు తిరస్కరిస్తాయని రిపబ్లికన్‌పార్టీ సెనెటర్ లిండ్సే గ్రాహమ్ అన్నాడు. ఎన్ని ప్రాణాలు తీసినా, ఎంత విధ్వంసం జరిపినా తమ మాతృభూమిలోనే తమ బతుకు, ఉన్నదే తింటాం, ఇళ్లు లేకపోతే గుడారాల్లోనే పడుంటాం తప్ప మరొక మాటలేదంటూ తిరిగి వచ్చిన వారు చెబుతున్నారు. పరాయి పంచలకు పోయి ప్రాణాలు కాపాడుకోవాలి, బతుకీడ్వాలంటే ఎప్పుడో వెళ్లిపోయి ఉండేవారం.. అలాంటి బతుకు మాకు వద్దు అంటున్నారంటే కనీవినీ ఎరుగని మారణకాండ జరిగినా అదరలేదు, బెదరలేదు, వారి స్థైర్యం చెక్కుచెదరలేదంటే వారికి వందనాలు చెప్పాల్సిందే !

సొంత నేలను
ముద్దాడటం
ఎవరికైనా
అన్నం ముద్ద
తినడం వంటిదే

గాలిలో దీపంలా
గాజులో శాంతిక్షణాలు

జన్మభూమికి జనవాహిని
తరంగాల్లా తరలి రావడం
మన కాలపు గొప్ప దృశ్యం

కోవిడ్‌లో చూశాం
మరల ఇప్పుడు..

పొట్ట చేతపట్టుకుని
ప్రవాసాలకు పోవడం ..
ప్రాణాలు గుప్పెట పట్టుకుని
సొంతగూటికి రావడం..

అదెంత జీవన సత్యమో
ఇదంత మౌలిక సత్యం

నవీన శ్రామికుడు



ఆ ఆకలికి
ఈ భయానికి
వారధి కడుతున్నాడు
నవీన శ్రామికుడి

అంక్షలు పెట్టేవాడు
కరుడుకట్టిన కారోరేటే
గోతికాడ నక్కలే
యుద్ధ ఊళలు విప్పిస్తుంటాయి
ఇక వెతుకులాట దేనికి ?

ఎటునుంచి ఏదైనా
మానవాళి జీవనయానం
అనంతం, అసిధారావ్రతం
అజరామరం.

కె .శాంతారావు
9959745723

అమెరికాకు ఇరాన్ అణుబాంబు భయం!



ఎం కోటేశ్వరరావు
8331013288

తనకు లొంగని దేశాలను కొండచిలువ మాదిరి అమాంతం మింగివేయాలని అమెరికా చూస్తుంది. అయితే దానికి సాధ్యం కావటం లేదు. అందుకే శతవిధాలుగా దెబ్బతీసేందుకు చేయని యత్నం ఉండదు. ఇరాన్ అణుకేంద్రాలపై దాడులు చేద్దామని ఇజ్రాయెల్ ప్రతిపాదిస్తే.. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ వద్దని వారించినట్లు వార్తలు వచ్చాయి. ఎందుకు అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. నిజానికి గతంలోనే అలాంటి ప్రయత్నం జరిగింది. నాటంజ్ అణుకేంద్రంలో 2021లో సంభవించిన పేలుడు-విధ్వంసం వెనుక ఇజ్రాయెల్ హస్తం వుందన్నది బహిరంగ రహస్యం. అయితే ఏ మేరకు నష్టం జరిగిందన్నది ఇప్పటికీ వెల్లడి కాలేదు. అణుబాంబు తయారీ నుంచి ఇరాన్ వెనక్కు తగ్గాలంటూ 2015లో ఒక ఒప్పందం కుదిరింది. డోనాల్డ్ ట్రంప్ తొలిసారి అధికారానికి వచ్చిన తరువాత 2018 మే నెలలో దాన్నుంచి అమెరికా ఏకపక్షంగా తప్పుకుంది. దాంతో ఇరాన్ తన కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించింది. ఎంత వేగంగా అణ్వాయుధాన్ని చేయగలదు, దానికి ఉన్న అవకాశాలు, అవరోధాలు ఏమిటని ఆ రంగ నిపుణులు తర్జన భర్జన పడుతున్నారు. అణుపరీక్ష జరిపితే అధికారికంగా గుర్తింపు పొందిన అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్సు, బ్రిటన్ దేశాలుగాక అణ్వాయుధాలు ఉన్నట్టు ప్రకటించిన భారత్, పాకిస్థాన్, ఇజ్రాయెల్, ఉత్తర కొరియా, సరసన అణ్వాయుధాలున్న పదవ దేశంగా ఇరాన్ అవతరిస్తుంది. ట్రంపు ఆ దిశగా నెట్టేట్లు కనిపిస్తున్నాడు.

కొందరి అంచనా ప్రకారం అణ్వాయుధ రూపకల్పనలో కీలకమైనది బాగా శుద్ధి చేసిన యురేనియం. దాన్ని సమకూర్చుకున్న తరువాత కొన్ని నెలలు లేదా గరిష్ఠంగా ఒక ఏడాది కాలంలో ఆయుధం అందుబాటులోకి వస్తుందని కొందరు చెబుతున్నారు. అయితే చైనా అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటే కేవలం మూడు నుంచి ఐదు వారాల్లోనే సిద్ధం చేయవచ్చన్నది ఒక అభిప్రాయం. ఏడాదైనా-ఐదు వారాలైనా ఇరాన్ అణ్వాయుధం తయారు చేయగలదన్నదే అమెరికాకు పట్టుకున్న భయం. అందుకే 2024లో అణుకేంద్రాలపై దాడి చేసేందుకు జో బైడెన్ సంశయించటం లేదా వద్దని వారించటం వెనుక ఉన్న అసలు కారణం అని చెప్పవచ్చు. ఆయుధ తయారీలో ఒకటి అణు సంబంధిత పదార్థాలు, రెండవది అణేతర పరికరాలు కావాలి. ముందు అణు పదార్థాలు సమకూరిన తరువాతే ఇతర పరికరాలకు రూపకల్పన చేయటం అమెరికా, ఇతర దేశాల అనుభవం. అదే చైనా విషయానికి వస్తే రెండింటి తయారీ సమాంతరంగా ఏకకాలంలోనే ప్రారంభించి తక్కువ వ్యవధిలో రూపొందించి పరీక్ష చేయటం మరో ప్రక్రియ. ఇప్పుడు ఇరాన్ దీన్నే అనుసరిస్తోందని భావిస్తున్నారు. సమయ అవసరం ఉండదు.

అమెరికా, దానితో జతకట్టిన ఇతర దేశాల బెదిరింపుల పూర్వరంగంలో చైనా తనదైన శైలిలో అణ్వాయుధ రూపకల్పన చేసింది. బహిర్గతమైన సమాచారం ప్రకారం అణుబాంబు తయారీకి అవసరమైన యురేనియం 1964 జనవరి నాటికి సిద్ధమైంది. రెండు బాంబులు తయారు చేసేందుకు సమకూర్చుకుంది. దాన్ని ఆయుధంగా రూపొందించ టానికి అవసరమైన ఇతర పరికరాల తయారీ ప్రక్రియను 1963నాటికే సిద్ధం చేశారు. దీంతో 1964 మే ఒకటవ తేదీ నాటికి తొలి బాంబు తయారీకి అవసరమైన ఏర్పాట్లను శాస్త్రవేత్తలు-ఇంజనీర్లు సంయుక్తంగా రూపొందించారు. తరువాత అవసరమైన తనిఖీలు, తుది మెరుగులు దిద్ది ఆగస్టు 20 నాటికి రెండు బాంబుల రూపకల్పనకు రంగం సిద్ధం చేశారు. క్వింగ్‌హై అణ్వాయుధ కేంద్రంలో మొదటి బాంబును కేవలం మూడు రోజుల్లోనే తయారు చేశారు. తొలి ప్రయోగాల తరువాత దాన్ని విడదీశారు. చైనా తొలి అణుపరీక్ష కేంద్రానికి వాటిని తరలించిన తరువాత కేవలం పది గంటల్లోనే తిరిగి అమర్చి బాంబును తయారు చేశారు. బాంబు తయారీకి అవసరమైన విధంగా యురేనియంలో మార్పులు, ఇతర పరికరాల తయారీ, వాటిని ఒకదగ్గర చేర్చి బాంబుగా మార్చేందుకు మొత్తం పట్టిన సమయం మూడు నుంచి ఐదు వారాలు మాత్రమే. ఆరు దశాబ్దాల క్రితం చైనా వద్ద అవసరమైన ఆధునిక పరికరాలు లేనప్పటికీ స్వయం కృషితో వారాపని చేశారు. ఇప్పుడు ఇరాన్ లేదా మరొక దేశం ఏదైనా బాంబుల తయారీకి పూనుకుంటే అన్ని ఆటంకాలను ఎదుర్కోవాల్సిన అవసరం లేదు. చైనా తయారీ శాంతి కాలంలో జరిగింది. అదే ఇరాన్ ఇప్పుడు ఎదుర్కొంటున్న బెదిరింపుల వంటి పూర్వరంగంలో తలచుకుంటే మూడు వారాల్లోనే తయారు చేయవచ్చని చెబుతున్నారు.



> తమ పౌర అణుకార్యక్రమం గురించి ట్రంప్ ఈసారి మరింత ఆచరణాత్మక, వాస్తవ ప్రాతిపదికన వ్యవహరిస్తారని, తమతో సంప్రదింపులు ప్రారంభించాలని ఇరాన్ ఉపాధ్యక్షుడు, వ్యూహాత్మక వ్యవహారాలను చూసే నిపుణుడు మహమ్మద్ జావేద్ జరిఫ్ జనవరి మూడవ వారంలో బహిరంగా కోరాడు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో ఈ మాటలు చెప్పాడు. గతంలో తప్పుదారి పట్టించి మాజీ విదేశాంగ మంత్రి మైక్ పాంపియో, జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్‌లను దూరం పెట్టారని కూడా గుర్తు చేశాడు. అమెరికా వైదొలిగిన కారణంగానే తమ కార్యక్రమం మరింత వేగం పుంజుకుందని కూడా చెప్పాడు. తాము అణ్వాయుధాల నిర్మాణం చేయాలనుకోవటం లేదని, అలా అనుకొని ఉంటే ఎప్పుడో చేసి ఉండేవారమన్నాడు. ఇరాన్ వైపు నుంచి వచ్చిన ఈ అవకాశాన్ని డోనాల్డ్ ట్రంప్ వినియోగించుకుంటాడా? తలబిరుసుతనంతో మరింతగా రెచ్చగొట్టి మరో అణ్వాయుధ దేశాన్ని రంగంలోకి తెస్తాడా, బంతి ట్రంప్ కోర్టులో ఉంది.

గతంలో ఇజ్రాయెల్ సంపాదించినట్టు చెబుతున్న సమాచారం ప్రకారం 1999 నుంచి 2003వరకు అమద్ ప్లాన్ పేరుతో ఇరాన్ యురేనియం శుద్ధితో సమాంతరంగా బాంబుల తయారీకి అవసరమైన ఇతర ఆయుధ భాగాల రూపకల్పన చేపట్టింది. ఐదు అణ్వాయుధాలను తయారు చేయాలని, వాటిలో మూడింటిని సాహెబ్-3 ఖండాంతర క్షిపణులకు అమర్చాలని, ఒకదానితో భూగర్భంలో పరీక్ష జరపాలన్నది ఇరాన్ కార్యక్రమంలో ఉన్నట్టు చెప్పారు. ఇదే వాస్తవమైతే చైనా తొలి బాంబుల మాదిరే ఇరాన్ కార్యక్రమం కూడా ఉందని చెబుతున్నారు. పశ్చిమ దేశాల నిపుణుల విశ్లేషణల ప్రకారం అమెరికా 1945లో జపాన్‌లోని నాగసాకి పట్టణంపై వేసిన ఫాట్ మాన్ బాంబు మాదిరే చైనా తన తొలి బాంబుకు రూపకల్పన చేసినట్టు, ఇప్పుడు ఇరాన్ కూడా అదే మాదిరి పథకాలతో ఉందని భావిస్తున్నారు. అయితే చైనా తొలి రూపకల్పనకు, ఫాట్‌మాన్‌కు చాలా తేడా ఉందని కొందరు విబేధిస్తున్నారు. సాంకేతికపరమైన అంశాలు పాఠకులలో అత్యధికులకు అంతగా ఒక పట్టాన ఎక్కేవి కాదు గనుక వాటి జోలికి పోవటం లేదు. ఏ దేశం రూపొందించినా బాంబు బాంబే, దాన్ని ఎక్కడ ప్రయోగించినా అపారనష్టం కలిగిస్తుంది. అమెరికా తన దగ్గర ఎంతటి విధ్వంసక ఆయుధం ఉందో చూడండి అంటూ ప్రపంచాన్ని భయపెట్టేందుకు జపాన్ నగరాల మీద వేసింది తప్ప నిజానికి అవసరం లేదు. ఆ సమయానికి జపాన్ చేతులెత్తేసి లొంగుబాటలో ఉంది, యుద్ధం చివరి దశలో ఉంది. ఆ తరువాత అణుకార్యక్రమం చేపట్టిన దేశాలన్నీ కూడా మా ఇల్లు మీకెంత దూరమో మీ ఇల్లు కూడా మాకు అంతేదూరం కబడ్దార్ అమెరికా అని హెచ్చరించేందుకు బాంబులకు రూపకల్పన చేశాయి. ఆధిపత్యం కోసం అమెరికాచేస్తే, ఆత్మరక్షణకు మిగతా దేశాలు పూనుకున్నాయి. అందుకే ప్రతి దేశానికీ అణ్వాయుధం రూపొందించుకొనే హక్కు ఉందని, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధ ఒప్పందం వివక్షతో కూడుకున్నదని అనేక దేశాలు భావిస్తున్నాయి. వాటిలో మనదేశం కూడా ఉన్నందున ఆ ఒప్పందం మీద సంతకం పెట్టేందుకు నిరాకరించింది.

ఇరాన్ బాంబుల రూపకల్పన గురించి ప్రపంచానికి అంతగా తెలియదు. ఎంతో రహస్యంగా జరుపుతున్నది. అణు పరిజ్ఞానం కూడా అంతర్జాతీయ బ్లాక్ మార్కెట్లో దొరుకుతున్నది. పాకిస్థాన్ అణుకార్యక్రమ పితామహుడిగా పరిగణించే అబ్దుల్ ఖాదిర్ ఖాన్ చైనా అణ్వాయుధం 548 నమూనాను లిబియాకు అందచేశాడన్న ఆరోపణ ఉంది.చైనా బాంబుల మాదిరే ఇరాన్ రూపకల్పన కూడా ఉందని కొందరు పోల్చుతున్నారు. అయితే ఇరాన్ కూడా అలా పొందిందా లేదా అన్నది తెలియదు. అణు విద్యుత్ కేంద్రాలున్న ప్రతి దేశమూ అణ్వాయుధాల తయారీకి అవసరమైన యురేనియం శుద్ధి చేపట్టే సామర్థ్యం కలిగి ఉంటుందన్నది ఒక అభిప్రాయం. అందుకే అనేక దేశాల వద్ద అణుబాంబులు ఉన్నాయని చెబుతారు. ఏవిధంగా చూసినప్పటికీ ఇరాన్ వద్ద కావాల్సిన పరిజ్ఞానం ఇప్పటికే ఉన్నదని, ఏ క్షణంలోనైనా బాంబులను రూపొందించగలదని భావిస్తున్నారు. అమెరికా జాతీయ గూఢచార కార్యాలయ అంచనా ప్రకారం 2015 అణు ఒప్పందం జరగటానికి ముందు ఇరాన్ వద్ద అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంలేదని అయితే 2024 జూలై నాటికి చూస్తే అణ్వాయుధ తయారీకి అవసరమైన పరిజ్ఞానంలో మెరుగైన స్థానంలో ఉందని, తలచుకొంటే ఆ పని చేస్తుందని పేర్కొన్నట్లు వార్తలు.అయితే బాంబులను తయారు చేసేదీ లేనిదీ ఇంతవరకు బహిరంగంగా ఇరాన్ సూచన ప్రాయంగా కూడా చెప్పలేదు. గత ఏడాది ఇజ్రాయెల్ చర్యలను, అమెరికా తీరుతెన్నులను చూసిన తరువాత, ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ మరోసారి అధికారానికి వచ్చిన పూర్వరంగంలో ఆ కార్యక్రమాన్ని వేగవంతం చేయనుందని భావిస్తున్నారు. వివరాలతో నిమిత్తం లేకుండా 2022 నుంచి ఇరాన్ అధికారులు తమ అణుకార్యక్రమం గురించి బహిరంగంగా మాట్లాడటాన్ని పెంచారు.

> ఇరాన్ బాంబుల రూపకల్పన గురించి ప్రపంచానికి అంతగా తెలియదు. ఎంతో రహస్యంగా జరుపుతున్నది. అణు పరిజ్ఞానం కూడా అంతర్జాతీయ బ్లాక్ మార్కెట్లో దొరుకుతున్నది. పాకిస్థాన్ అణుకార్యక్రమ పితామహుడిగా పరిగణించే అబ్దుల్ ఖాదిర్ ఖాన్ చైనా అణ్వాయుధం 548 నమూనాను లిబియాకు అందచేశాడన్న ఆరోపణ ఉంది.చైనా బాంబుల మాదిరే ఇరాన్ రూపకల్పన కూడా ఉందని కొందరు పోల్చుతున్నారు. అయితే ఇరాన్ కూడా అలా పొందిందా లేదా అన్నది తెలియదు. అణు విద్యుత్ కేంద్రాలున్న ప్రతి దేశమూ అణ్వాయుధాల తయారీకి అవసరమైన యురేనియం శుద్ధి చేపట్టే సామర్థ్యం కలిగి ఉంటుందన్నది ఒక అభిప్రాయం. అందుకే అనేక దేశాల వద్ద అణుబాంబులు ఉన్నాయని చెబుతారు. ఏవిధంగా చూసినప్పటికీ ఇరాన్ వద్ద కావాల్సిన పరిజ్ఞానం ఇప్పటికే ఉన్నదని, ఏ క్షణంలోనైనా బాంబులను రూపొందించగలదని భావిస్తున్నారు.

కొన్ని నివేదికల ప్రకారం 70శాతం మంది ఇరాన్ పౌరులు అణ్వాయుధాలు కలిగి ఉండాలని భావిస్తున్నట్లు తేలింది.

తొలిసారిగా ఫాసిస్టు లక్షణాలు గలిగిన డోనాల్డ్ ట్రంప్‌ను అమెరికన్లు గతంలో ఒకసారి, ఇప్పుడు రెండవసారి ఎన్నుకున్నారు. ఇరాన్‌తో అణు ఒప్పందం నుంచి ఏకపక్షంగా వైదొలిగిన డోనాల్డ్ ట్రంప్ ఇప్పుడేం చేస్తారన్న చర్చ ప్రారంభమైంది. తిరిగి ఇరాన్‌తో అవగాహనకు వస్తాడా లేక బెదిరింపులతో నిరోధించేందుకు చూస్తాడా? అణుకేంద్రాల మీద దాడులు చేస్తే ఆ కార్యక్రమం నుంచి వైదొలుగుతుందని ఎవరూ భావించటం లేదు. అక్కడ ఉన్న పాలకులను మార్చి తొత్తులను గద్దెనెక్కించటం లేదా ఇరాన్‌ను భౌతికంగా ఆక్రమించుకోవటం తప్ప మరొక మార్గం లేదని కొందరు సూచిస్తున్నారు. అయితే ఇప్పుడున్న పరిస్థితిలో దీన్లో ఏదీ జరిగేది కాదు. ట్రంప్ వదరుబోతుతనం, ఉన్మాద చర్యలకు పాల్పడితే ఇరాన్ అణుకార్యక్రమం మరింత వేగం అందుకుంటుంది. ప్రచ్ఛన్న యుద్ధంలో తామే గెలిచామని అమెరికా చెప్పుకున్నప్పటి నుంచి అణ్వాయుధాలను మరింతగా పెంచుకుంటూ పోతున్నది. ట్రంప్ ఏలుబడిలో ఇంకా పెరిగి ఏటా రెండులక్షల కోట్ల డాలర్ల మేర ఖర్చు ఉండవచ్చని భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో అమెరికా అనుకుంటున్నది ఒకటి జరుగుతున్నది మరొకటి అన్నట్లుగా పరిణామాలు ఉన్నాయి. అణు ఒప్పందం నుంచి వైదొలిగితే ఇరాన్‌లో ఉన్న పాలకులు అధికారాన్ని కోల్పోయి కొత్తవారు వస్తారనే తప్పుడు సలహాను ట్రంప్ బుర్రలోకి సలహాదారులు ఎక్కించిన కారణంగానే 2018లో వైదొలిగినట్లు ఒక అభిప్రాయం. అయితే దానికి భిన్నంగా అణుకార్యక్రమం మరింత వేగవంతమైంది, పట్టుదల పెరిగింది. తమ పౌర అణుకార్యక్రమం గురించి ట్రంప్ ఈసారి మరింత ఆచరణాత్మక, వాస్తవ ప్రాతిపదికన వ్యవహరిస్తారని, తమతో సంప్రదింపులు ప్రారంభించాలని ఇరాన్ ఉపాధ్యక్షుడు, వ్యూహాత్మక వ్యవహారాలను చూసే నిపుణుడు మహమ్మద్ జావేద్ జరిఫ్ జనవరి మూడవ వారంలో బహిరంగా కోరాడు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో ఈ మాటలు చెప్పాడు. గతంలో తప్పుదారి పట్టించి మాజీ విదేశాంగ మంత్రి మైక్ పాంపియో, జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్‌లను దూరం పెట్టారని కూడా గుర్తు చేశాడు. అమెరికా వైదొలిగిన కారణంగానే తమ కార్యక్రమం మరింత వేగం పుంజుకుందని కూడా చెప్పాడు. తాము అణ్వాయుధాల నిర్మాణం చేయాలనుకోవటం లేదని, అలా అనుకొని ఉంటే ఎప్పుడో చేసి ఉండేవారమన్నాడు. ఇరాన్ వైపు నుంచి వచ్చిన ఈ అవకాశాన్ని డోనాల్డ్ ట్రంప్ వినియోగించుకుంటాడా? తలబిరుసుతనంతో మరింతగా రెచ్చగొట్టి మరో అణ్వాయుధ దేశాన్ని రంగంలోకి తెస్తాడా, బంతి ట్రంప్ కోర్టులో ఉంది.

భారత దేశం మూడవ ఆర్థిక వ్యవస్థగా రూపు దిద్దుకుంటుందా?




సారంపల్లి మల్లారెడ్డి
9490098

బీజేపీ నాయకత్వాన అధికారానికి వచ్చిన ప్రధాని మోడీ 2018 నుండి "ప్రపంచలో భారతదేశాన్ని మూడవ ఆర్థిక వ్యవస్థగా" చేస్తానని పదేపదే ప్రకటించారు. అంతే కాక రైతుల ఆదాయాన్ని 2022 వరకు రెట్టింపు చెస్తానని అప్పుడే ప్రకటించాడు. ఈ రెండు ప్రకటనల అమలును విశ్లేషిస్తే ఇవి అమలుకావడం అసాధ్యంగా గోచరిస్తున్నది. ప్రజలను నమ్మించ దానికి చేసే ప్రయత్నం తప్ప మరొకటి కాదు. మేధావులు, ఆర్థికవేత్తలు, సాధారణ ప్రజలు ఇలాంటి ప్రచారాలను ఎంతకాలం నమ్ముతారు. గ్లోబల్ స్థూల ఉత్పత్తి 2024లో 3.2శాతం గ్రోత్ ఉండగా 2025లో 3.3శాతానికి పెరిగినట్లు అంచనా వేశారు. వాస్తవంగా దేశంలో జరుగుతున్న ఆర్థిక పరిస్థితిని పరిశీలించాలి. భారతదేశంలో 2023-24లో మొదటి క్వార్టర్ గ్రోత్ రేటు 8.2శాతం కాగా 4వ క్వార్టర్‌లో 7.8 శాతానికి తగ్గింది. 2024-25లో మొదటి క్వార్టర్ 6.4 శాతంగా 4వ క్వార్టర్‌లో 5.8 శాతానికి తగ్గింది. పై గణాంకాలు గమనిస్తే మన దేశ జిడిపి గ్రోత్‌రేటు తగ్గుతున్నది. ఉత్పత్తి రంగాలైన వ్యవసాయ రంగం గ్రోత్ రేటు 1.4శాతం మాత్రమే కానీ, దేశ స్థూల ఉత్పత్తికి 17.7శాతం సహకరిస్తున్నది. గత దశాబ్ద కాలంగా సగటు వ్యవసాయ రుద్ధిరేటు 4.18 శాతంగా నిర్ధారించారు. పారిశ్రామిక రంగం గ్రోత్ రేటు 6శాతం నుండి 2024 నవంబర్‌లో 5.2శాతానికి తగ్గింది. దేశ స్థూల ఉత్పత్తికి 27.60 శాతం మాత్రమే సహకరిస్తున్నది. సేవా రంగం స్థూల ఉత్పత్తికి 54.7శాతం సహకరించడం వల్ల కొంత నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతున్నది. కానీ, సేవా రంగ అభివృద్ధి నీటి బుడగ లాంటిది ఉత్పత్తి రంగాలైన వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు, స్థిర ఆర్థిక విధానం ఉండటంచే అవి అభివృద్ధిలో ఉండాలి. పారిశ్రామిక రంగం దేశ స్థూల ఉత్పత్తికి 60 శాతం కంట్రిబ్యూట్ చేయాలి. కానీ, అందులో 50శాతమే సహకరిస్తున్నది. చాలా వరకు సన్న మధ్య తరహా పరిశ్రమలే కాక భారీ పరిశ్రమలు కూడా మూతపడుతున్నాయి. దిగుమతులు యేటా పెరుగుతున్నాయి. ఎగుమతి - దిగుమతుల లోటు 15లక్షల కోట్లకు చేరుకుంది. విదేశీ మారక ద్రవ్యం లోటు కూడా పెరుగుతున్నది. వీటి ప్రభావంతో షేర్ మార్కెట్ పడిపోవడం, అందులో పొదుపు చేసుకున్న వారు లక్షల కోట్లలో దివాలా తీస్తున్నారు.

భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలు

1. ఐటి - ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ
2. ఇంధన రంగం - పునరుత్పాదకశక్తి
3. ఈకామర్స్-ఆన్‌లైన్ రీటేల్-డిజిటల్ చెల్లింపులు
4. ఆరోగ్యసంరక్షణ-బయోటెక్నాలజీ టెక్నాలజి.
5. టెలికమ్యూనికేషన్
6. ఆర్థిక సేవలు - ఫిన్‌టెక్

పై రంగాల పెరుగుదల వల్ల 20శాతం మేర నిరుద్యోగ సమస్య పరిష్కరించబడినప్పటికీ ఇంకా 8శాతం నిరుద్యోగం కొనసాగుతూనేవుంది. ప్రధానీ మోడీ దేశాన్ని 3వ ఆర్థిక దేశంగా 2025నాటికి చేస్తానని అనేక సందర్భాలలో చెప్పాడు. ప్రస్తుతం ప్రపంచంలో అమెరికా 29 ట్రిలియన్ డాలర్లతో మొదటి స్థానంలో ఉండగా 18.80 ట్రిలియన్ డాలర్లతో చైనా రెండోస్థానంలో ఉంది. జపాన్ 4.25 ట్రిలియన్ డాలర్లు, జర్మనీ 3.85 ట్రిలియన్ డాలర్లు, భారత్ 3.41 ట్రిలియన్ డాలర్లతో ఐదవ స్థానంలో ఉంది. 3వ స్థానానికి చేరడానికి ప్రస్తుతం ఉన్న దేశ స్థూల ఉత్పత్తికి మరో 2ట్రిలియన్ డాలర్ల ఉత్పత్తి పెరగాలి. 2025 ముగింపు నాటికి ఇది సాధ్యమేనా? గత అనుభవాన్ని బట్టి చూస్తే 1947 నుండి 2010 వరకు 63 సంవత్సరాలు దేశం ఒక ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. 2010 నుండి 2017వరకు రెండు ట్రిలియన్ డాలర్లకు, 2018నుండి 2020 వరకు మూడు ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. రానున్న ప్రతి 1.5 సంవత్సరాలకు ఒక ట్రిలియన్ డాలర్లకు పెరుగుతున్నది. ఈ లెక్కన 2 ట్రిలియన్ డాలర్లు పెరగాలంటే మరో 3 సంవత్సరాలు వేచి చూడాలి. అప్పటికీ 3వ, 4వ స్థానంలో ఉన్న జపాన్, జర్మనీ దేశాలు ఆర్థికంగా మరింత దూసుకుపోతాయి. మనదేశంలో ప్రస్తుతం పెరుగుతున్న ఎగుమతి - దిగుమతి లోటును తగ్గించకపోతే దేశ స్థూల ఉత్పత్తి పెరగదు. మన బడ్జెట్‌లో 25శాతం రుణ వడ్డీ చెల్లింపులకు వ్యయం చేస్తున్నాం. 2023 - 24లో రూ.173.82 లక్షల కోట్లు దేశ, విదేశీ



అప్పులుండగా 2024-25 నాటికి 184.88 కోట్లకు చేరుకుంటుంది. నేటికి భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ రంగమే వెన్నెముకగా ఉంది. పారిశ్రామిక ఉత్పత్తి పెరగనంత వరకు దేశ స్థూల ఉత్పత్తి పెరగదు. పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందడమంటే ఉత్పత్తి పెరుగుదలతో పాటు నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. పరిశ్రమలు ఉత్పత్తి చేయాలంటే వాటి వ్యాపారం పెరగాలి. అనగా ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. అన్నింటికి మూలం ప్రజల కొనుగోలు శక్తి పెరిగినప్పుడే, దేశీయ వినియోగం పెరుగుతుంది. ప్రస్తుత 143 కోట్ల జనాభాలో 23.58శాతం మాత్రమే కొనుగోలు శక్తిని పెంచుకోగలుగుతున్నారు. దేశంలో శాశ్విత ఉద్యోగుల సంఖ్య 18.16 కోట్లు మాత్రమే. 15-64 సంవత్సరాల మధ్య వయస్సు గలిగినవారి ఉద్యోగితలో 60 దేశాల సర్వేలో మన దేశం 56వ దేశంగా ఉన్నట్లు ప్రపంచ బ్యాంక్ గణాంకాలు చెబుతున్నాయి.

వ్యవసాయ రంగంలో క్రమంగా మానవ శ్రమ తగ్గి యాంత్రికీకరణ పెరగాలి. అమెరికాలో 95శాతం, బ్రెజిల్ 75శాతం, చైనా 57శాతం, భారత్ 40.45శాతం (ఏప్రిల్ 2023 నాటికి) ఉంది. యాంత్రీకరణ పెరగాలంటే సన్న చిన్న కారు రైతులకు ఉపయోగపడే యంత్రాలను జపాన్ తరహాలో తయారు చేసుకోవాలి. ప్రస్తుతం గ్రామాల నుండి పట్టణాలకు 20కోట్ల మంది వలసలు వెళ్లినట్లు కరోనా ద్వారా బహిర్గతమైంది. కరోన సందర్భంగా పట్టణాల నుండి తిరిగి గ్రామాలకు వెళ్లిన వారిలో 5కోట్ల మంది తిరిగి పట్టణాలకు వెళ్లినట్లు సర్వేలు చెపుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ అంచనా ప్రకారం 6.52కోట్ల కుటుంబాలు (32కోట్ల మంది) దారిద్ర్య రేఖకు దిగువనున్న వారిగా గుర్తించి వారికి రేషన్ ఇవ్వడం జరుగుతున్నది. ఇందులో 2.44 కుటుంబాలకు అన్నదాత అంత్యోదయ యోజన పథకం ద్వారా బియ్యం ఉచితంగా ఇస్తున్నారు. గత దశాబ్ద కాలంలో 20కోట్ల మంది ప్రజలు దారిద్ర్యరేఖ నుండి ఎగువకు చేరినట్లు ప్రధాని మోడీ ఒక వైపున ప్రకటిస్తూ మరోవైపున 80కోట్ల మందికి రానున్న 5సంవత్సరాలు (2029 వరకు) ప్రతి మనిషికి 5కిలోల బియ్యం ఉచితంగా ఇస్తానని ప్రకటించారు. దారిద్ర్య రేఖకు ఎగువకు చేరినపుడు కేంద్రం ఉచిత బియ్యం పథకాన్ని ఎందుకు అమలు జరుపుతున్నట్లు?

బడ్జెట్‌లను పరిశీలిస్తే ప్రభుత్వ ప్రకటనల్లోని లోపాలను గమనించవచ్చు. 2022-23లో వాస్తవ వ్యయం బడ్జెట్ ప్రకారం రూ.41,93,157 కోట్లు కాగా 2024-25 బడ్జెటు రూ.48,20,512 కోట్లకు పెరిగింది. బడ్జెట్‌తో పాటు దళిత గిరిజనులకు సబ్‌ప్లాన్ ప్రకారం రూ.3లక్షల కోట్లకు పెంచారు. ఈ నిధులను 102 ప్రభుత్వ శాఖలో వ్యయం చేస్తారు. దీనివల్ల ఆ వర్గాలకు ఒరిగే లాభం ఏమిలేదు. ఈ వర్గాలకే అంబరిల్లా పథకం కింద మరో 13,500 కోట్ల అంబరిల్లా పథకానికి కూడా కేటాయించారు. 2021-22 నుండి మైనార్టీలకు అమ్మరిల్లా పథకం కింద రూ.1,428కోట్లు కాగా 2024-25 నాటికి రూ.2,500ల కోట్లకు పెంచారు. అయినా ఈ వర్గాలు అభివృద్ధి కావడంలేదు. మైనార్టీలు, బీసీలు, దళితులు, గిరిజనుల కొనుగోలు శక్తి పెరగనందున "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నచందంగా ఉంది. ఆకలిలో భారతదేశం ప్రపంచదేశాల్లో 113వ స్థానంలో ఉంది. మనకన్న చిన్న దేశాలు ఎంతో అభివృద్ధిలో ఉన్నాయి. ఇంత వెనకబాటుతనమున్న దేశంలో బడ్జెట్‌లో ఉత్పత్తి రంగానికి కేటాయింపులు చేయకపోవడం వల్ల, ప్రణాళికా బద్ధమైన ఉత్పత్తి లేకపోవడంతో పెరుగుదలలో లోటు కనబడుతున్నది. కానీ, అదే సందర్భంలో కార్పొరేట్ సంస్థలు ఎలాంటి ఆటంకం లేకుండా తమ లాభాలను పెంచుకుంటున్నారు. అంతేకాక ప్రధాని మోడీ కార్పొరేట్లకు గత 10 సంవత్సరాలల్లో 15లక్షల కోట్ల లాభాలను కట్టబెట్టాడు. లాభాలలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను బుక్‌వ్యాల్యుకన్న తక్కువ ధరలకు కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు.

బ్లాక్ మనిని పట్టుకొని ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు బ్యాంక్‌లో వేస్తానని చెప్పడం వెనక మోసాన్ని ప్రజలు గుర్తిస్తున్నారు. ప్రపంచంలో కార్పొరేట్లపై 30-35 శాతం పన్ను విధిస్తుండగా మనదేశంలో 20శాతం లోపే పన్ను విధిస్తున్నారు. దీనిని బట్టి దేశ స్థూల ఉత్పత్తి ఏ మేరకు పెరుగుతుంది అన్నది ఆర్థికవేత్తలు ఆలోచించాలి. కొందరు కుహనా ఆర్థిక వేత్తలు దేశ ఆర్థిక ప్రగతి పెద్ద అంగలతో దూసుకుపోతున్నట్లు ప్రచారం చేస్తున్నారు. తలసరి ఆదాయం, సగటు ఆదాయం పెరిగినట్లు గణాంకాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. కార్పొరేట్లు-పేదల ఆస్తులను కలిపి తలసరి ఆదాయం పెరిగినట్లు చెబుతున్నారు. గతంలో మిలియనీర్లుగా ఉన్నవారు నేడు బిలియనీర్లు అయ్యారు. త్వరలో ట్రిలియనీర్లుగా పెరగబోతున్నారు. ఆ విధంగా కార్పొరేట్ల ఆస్తుల పెరుగుదలను దేశ స్థూల ఉత్పత్తి పెరుగుదలలో గణించినప్పటికీ మరోవైపు దారిద్ర్యం, నిరుద్యోగం పెరుగుతూనే ఉంది. అందువల్ల ఫిబ్రవరి 4న ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో ఉత్పత్తి రంగానికి, పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజల కొనుగోలు శక్తి పెరగడానికి పథకాలు రూపొందించాలి. భారతదేశంలో ఉన్న మౌలిక వసతులను వినియోగించుకొని అన్ని రంగాలల్లో ఉత్పత్తిని పెంచాలి. జి-7 దేశాల ఆదేశాలకు లొంగి ఉత్పత్తిని పెంచకుండా దిగుమతుల బాండాగారం చేసే విధానాలకు స్వస్తి పలకాలి. ప్రస్తుత అభివృద్ధిని శాస్త్రీయంగా పరిశీలించి తగు నిర్ణయాలు తీసుకోవాలి. ప్రస్తుతమున్న 5వ స్థానాన్నైనా కాపాడుకోవాలి.



ఏదులాపురం మున్సిపాలిటీకి అధికారుల నియామకం

- నేడు బాధ్యతలు చేపట్టే అవకాశం....?

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఏదులాపురం నూతన మున్సిపాలిటిలో పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం అధికారికంగా ఐదుగురు అధికారులను మంగళవారం నియమించింది. ఏదులాపురం మున్సిపల్ కమిషనర్‌గా ప్రస్తుతం ఖమ్మం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న అహ్మద్ షఫీ ఉల్లా, ప్రత్యేకాధికారిగా కార్పొరేషన్ కమిషనర్‌గా ఉన్న అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా యాకూబ్ అలీ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఆర్.సంతోష్, సీనియర్ అకౌంటెంట్‌గా సతీష్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ 12 గ్రామ పంచాయతీలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను మున్సిపల్ అధికారులు ఒకటి రెండు రోజుల్లో ఆయా పంచాయతీ కార్యదర్శుల నుండి స్వాధీనం చేసుకోనున్నారు. ప్రభుత్వం నియమించిన అధికారులు బుధవారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది.



సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్‌కు సత్కారం

నవతెలంగాణ - బోనకల్

గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌చే ప్రశంసాపత్రం అందుకున్న బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మాసంగులపాటి వెంకట పద్మావతిని టీఎస్ యుటిఎఫ్ బోనకల్ మండలం కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గురుకుల పాఠశాలలో ఘనంగా శాలువాతో సన్మానించారు. గతంలో కూసుమంచి మండలంలో సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించి పదవ తరగతిలో 100 శాతం ఫలితాలను, 10 జీపీఏను సాధించి ఇంటర్ రిజల్ట్‌లో కూడా 100 శాతం ఫలితాలు సాధించినందుకు వెంకట పద్మావతిని ఉత్తమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఎంపిక చేశారు. కృషి చేసినందుకు, బోనకల్ సోషల్ వెల్ఫేర్ పాఠశాలను మంచి వాతావరణ పరిస్థితులలో ఉంచడంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నందుకుగాను ప్రిన్సిపల్‌ని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, జిల్లా నాయకులు సద్దా బాబు, మండల అధ్యక్షులు గార్లపాటి చిన్న రంగారావు, మండల ఉపాధ్యక్షులు పి.గోపాలరావు, మండల ఆడిటర్ పి.నరసింహారావు, మండల కార్యదర్శి జి.నిర్మల, పి.రాణి, శశికళ, టీఎస్ యుటిఎఫ్ సీనియర్ నాయకులు కే.లక్ష్మణరావు, ఏ.అంజయ్య, సోషల్ మీడియా ఇంచార్జ్ నరేంద్ర సింహం, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చెడు వ్యసనాలకు దూరంగా...! విజ్ఞానానికి దగ్గరగా...!!

- విద్యార్థులతో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దయానంద్
- జేవీఆర్ కళాశాలలో విజయవంతంగా నాలెడ్జ్ ఎక్స్‌పో

నవతెలంగాణ-సత్తుపల్లి

చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉంటూ విజ్ఞానానికి దగ్గరగా అడుగులు వేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన సత్తుపల్లి. అశ్వారావుపేట నియోజకవర్గాల స్థాయి ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల విద్యార్థులతో ఏర్పాటు చేసిన నాలెడ్జ్ ఎక్స్‌పో కార్యక్రమంలో డాక్టర్ దయానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దయానంద్ మాట్లాడారు. కొందరు యువత మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను ఛిద్రం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెడు వ్యసనాలను త్యజించి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. విద్యతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలన్నారు. జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన నాలెడ్జ్ ఎక్స్ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల విజేతలకు డాక్టర్ దయానంద్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారు. జేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ దోమ ఆనంద్‌బాబు, కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, వివిధ కళాశాల యాజమాన్య బాధ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ఐడీబీఐ జనరల్ మేనేజర్ వెంకటేష్
- ఐడీబీఐ ఆధ్వర్యంలో కంప్యూటర్లు పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ) జనరల్ మేనేజర్ వెంకటేష్ అన్నారు. మండలంలోని ఏదులాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఐడీబీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం 8 కంప్యూటర్లు, ఇన్వర్టర్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వెంకటేష్ మాట్లాడారు. విద్యార్థి దశ అనేది ఎంతో ముఖ్యమైనదని క్రమశిక్షణతో కూడిన జీవితం కొనసాగించాలని తెలిపారు. జీవితంలో క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. ఉన్నత శిఖరాలు అధిరోహించి గ్రామానికి, తల్లితండ్రులకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శివకుమారి, గొల్లగూడెం ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు జలందర్, ఐడీబీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రేపాకుల వెంకట్రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు



నవతెలంగాణ-ఎర్రుపాలెం

లక్ష్మీపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలోకి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో చేరారు. వారికి మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాస్‌రెడ్డి, అనుమోల వెంకటకృష్ణారావు, తలపురెడ్డి నాగిరెడ్డి, శీలం నారాయణరెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వనజీవి రామయ్య దంపతులను సన్మానించిన సీఎం



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

వనజీవి రామయ్య, జానమ్మ దంపతులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సన్మానించారు. రంగారెడ్డి జిల్లా పొద్దుటూరు గ్రామంలో ఎక్స్పిరియం పార్కు ప్రారంభోత్సవానికి హాజరైన వనజీవి రామయ్యను ప్రత్యేకంగా గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డి వనజీవి దంపతులను వేదికపైకి పిలిచి వారిని సన్మానించారు. రైతు కుటుంబం నుంచి వచ్చి పర్యావరణం కోసం నిత్యం కృషి చేస్తున్న వనజీవి రామయ్య కృషిని అభినందించారు. వనజీవి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లపుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వనజీవి రామయ్యను ఆదర్శంగా తీసుకొని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఎం కోరారు. కార్యక్రమంలో సీఎం వెంట మంత్రి జూపల్లి కృష్ణారావు, సినీనటుడు చిరంజీవి, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి ఉన్నారు.

మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా బండారు నరసింహారావు

- వైస్ ఛైర్మెన్‌గా ఐలూరి సత్యనారాయణరెడ్డి
- నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ జీవో జారీ

నవతెలంగాణ-ఎర్రుపాలెం/బోనకల్

మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మూడు మండలాల పరిధిలో విస్తరించి ఉన్న మధిర మార్కెట్ కమిటీకి ఛైర్మన్ పదవి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారు నరసింహారావును వరించింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రతిపాదనతో ఈ పీఠాన్ని ఆయన అధిష్టించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎర్రుపాలెం మండలం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, రాజులదేవరపాడు గ్రామానికి చెందిన బండారు నరసింహారావును ఛైర్మెన్‌గా, మధిర మండలం వంగవీడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఐలూరి సత్యనారాయణరెడ్డిని వైస్ ఛైర్మెన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


మధిర మార్కెట్ కమిటీ ఛైర్మెన్ బరిలో 'బండారు'

బండారు నరసింహారావు బీసీ సామాజిక వర్గానికి చెందిన బలమైన కాంగ్రెస్ నాయకుడు. ఎన్నికల సమయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎర్రుపాలెం మండలానికి ఇస్తామని హామీ ఇచ్చారని, అందులో భాగంగానే ప్రస్తుతం బండారు నరసింహారావుకి ఈ పదవి దక్కిందని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.

ఆదేవిధంగా మధిర మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న ఎర్రుపాలెం, మధిర, బోనకల్ మండలాల నుంచి 12 మందిని డైరెక్టర్లగా నియమించారు. మధిర మండలం నుంచి ఐదుగురిని డైరెక్టర్లుగా నియమించారు. వారిలో అద్దంకి రవికుమార్, వేల్పుల చెంచయ్య, బాణావత్ వెంకటరమణ, షేక్ షన్ను, తూములూరి నాగేశ్వరరావు (రాజా)లో ఉన్నారు. బోనకల్ మండలం నుంచి నలుగురిని నియమించారు. వారిలో వంగాల రామారావు, వట్టికొండ రామకృష్ణ, బొంతు నారాయణ గౌడ్, అనుమోలు వెంకటేష్ ఉన్నారు. ఎర్రుపాలెం మండలం నుంచి ముగ్గురిని నియమించారు. వారిలో గుడేటి బాబురావు, యన్నం పిచ్చిరెడ్డి, వేమిరెడ్డి అనురాధ ఉన్నారు. ఇది ఇలా ఉండగా మధిర మార్కెట్ కమిటీ ఛైర్మెన్‌గా బండారు నియామకం కానున్నట్లు నవతెలంగాణ సంచికలో నవంబర్ 21, 2024న ప్రచురితం అయిన విషయం పాఠకులకు విదితమే.



సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి

ఎర్రుపాలెం మండల పరిధిలోని మామునూరు గ్రామానికి చెందిన బండారు నరసింహారావు లక్ష్మీపురం, మామునూరు, రాజులదేవరపాడు మూడు గ్రామాల పరిధిలో మామునూరు ఉమ్మడి గ్రామ పంచాయతీగా కలిసి ఉండటంతో గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేసి విజయం సాధించారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. సామాన్య రైతు కుటుంబానికి చెందిన బండారు కాంగ్రెస్ పార్టీలో అంచలంచలుగా ఎదుగుతూ వచ్చారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుగా ప్రస్తుతం మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నారు.

ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా...

భట్టి విక్రమార్క గెలుపు కోసం అహర్నిశలు శ్రమపడి గెలుపులో తన వంతు పాత్రను బండారు పోషించారు. మండలంలో భట్టికి నమ్మకస్తులన్న ముద్ర కలిగిన నాయకులలో ముఖ్య అనుచరులలో ఒకడిగా పార్టీలో తన ప్రత్యేకతను చాటుకుంటూ ముఖ్య భూమికను పోషిస్తున్నాడు. గతంలో మండలంలో వైఎస్ఆర్ పార్టీలోకి వలసలు పోతున్నా చెక్కుచెదరక కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని పనిచేశారు.

బీసీ కోటాలో బండారుకు పదవి

గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఐదు విడతలకు సంబంధించి రిజర్వేషన్లు ప్రకటించారు. తొలి విడతలో జనరల్‌కు కేటాయించగా రెండవ, మూడవ, నాలుగవ విడతలలో బీసీ అభ్యర్థులకు కేటాయించగా ఐదవ విడతలో జనరల్ మహిళకు కేటాయింపులు చేశారు. గత ప్రభుత్వంలో మార్కెట్ కమిటీకి రెండు పర్యాయాలు పాలక వర్గ కమిటీలు పనిచేశారు. మూడవ విడతలో పాలకవర్గం పని చేస్తుండగా అధికారం కోల్పోవటంతో రద్దయింది. ఆనాడు తీసిన రిజర్వేషన్ల కోటాలో నాలుగవ సారి బిసి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రిజర్వేషన్ చేసి ఉండటం వలన బండారు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో అవకాశం కల్పించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీల రిజర్వేషన్లను యథావిధిగా అమలు పరచడంతో ఎంతో మంది ఆశావహులు తమ ముమ్మర ప్రయత్నాలు చేశారు. భట్టి విక్రమార్క ఈదఫా తప్పక ఎర్రుపాలెం మండలానికి ఇవ్వాలని నిర్ణయించడంతో బండారుకు మార్గం తేలిక అయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఏనాడూ ఎర్రుపాలెం మండలానికి మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ రాకపోవడంతో ఈసారి తప్పక ఎరుపాలెం మండలానికి కేటాయించారు.


సత్యనారాయణరెడ్డి


రామకృష్ణ


వెంకటేష్

మధిర ఆత్మ కమిటీ ఛైర్మన్‌గా కర్నాటి రామకోటేశ్వరరావు



నవతెలంగాణ-బోనకల్

మధిర నియోజకవర్గ ఆత్మ కమిటీ ఛైర్మన్‌గా బోనకల్ మండల పరిధిలోని రాయన్నపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కలకోట సొసైటీ అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరరావును నియమిస్తూ అధికారులు మంగళవారం నియామక ఉత్తర్వులను విడుదల చేసినట్లు కర్నాటి రామకోటేశ్వరరావు తెలిపారు. రాయన్నపేట గ్రామానికి చెందిన కర్నాటి రామకోటేశ్వరరావు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ప్రధాన అనుచరుడు. బోనకల్ మండలంలో కాంగ్రెస్ అభివృద్ధికి సుదీర్ఘకాలం నుంచి కృషి చేస్తున్నాడు. 10 ఏళ్ల పాటు కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా కాంగ్రెస్‌ను అంటిపెట్టుకొని పనిచేస్తూ వచ్చాడు. మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో ప్రభుత్వ చీఫ్ విప్‌గా ఉన్న సమయంలో రాయన్నపేట గ్రామ సమీపంలో రైతుల కోసం వైరా నదిపై ఎత్తిపోతల పథకాన్ని నిర్మించడంలో విశేషమైన కృషి కర్నాటి రామకోటేశ్వరరావు చేశాడు. ప్రస్తుతం ఆ ఎత్తిపోతల పథకం రాయన్నపేట గ్రామ రైతులకు వరంగా మారింది. రాయన్నపేట గ్రామాన్ని అభివృద్ధి చేయటంలో కర్నాటి రామకోటేశ్వరరావు తన శక్తి మేరకు కషి చేస్తున్నాడు. ఎన్ని ఆటంకాలు ఎదురైన తట్టుకుంటూ కాంగ్రెస్ అభివద్ధి కోసం పాటుపడుతూ వచ్చాడు. ఏ పదవి లేకపోయినా కాంగ్రెస్‌లోనే సుదీర్ఘ కాలం నుంచి కొనసాగుతూ వచ్చాడు. 2019లో కలకోట సొసైటీకి జరిగిన ఎన్నికలలో కర్నాటి రామకోటేశ్వరరావు రెండవసారి పోటీ చేయగా, ఆయన భార్య స్వాతి తొలిసారిగా పోటీ చేశారు. వీరిపై ఆనాడు బీఆర్ఎస్ నాయకులు, భార్యాభర్తలు జంగా రవికుమార్ ఆయన భార్య జంగా సరళ పోటీ చేశారు. కర్నాటి రామకోటేశ్వరరావు, దంపతులు విజయం సాధించగా, జంగా రవికుమార్, దంపతులు ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నిక ఆనాడు మండలం మొత్తాన్ని ఆకర్షించింది. అనంతరం కలకోట సొసైటీ అధ్యక్షుడిగా కర్నాటి రామకోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. కలకోట సొసైటీ అభివద్ధికి తన శక్తి మేరకు కృషి చేస్తూ రైతులకు అండదండలుగా ఉంటూ వస్తున్నాడు. మండలంలో కాంగ్రెస్‌కు ప్రధాన నాయకుడిగా ఉంటూ వస్తున్నాడు. మృదుస్వభావిగా రామకోటేశ్వరరావుకి పేరు ఉంది. సుదీర్ఘకాలం నుంచి కాంగ్రెస్‌కు చేస్తున్న సేవలకు ఎట్టకేలకు ప్రభుత్వము నుంచి నామినేటెడ్ పదవి దక్కింది. తనకు పదవి దక్కటం పట్ల రామకోటేశ్వరరావు, స్వాతి దంపతులు ఆనందం, హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ మధిర నియోజకవర్గ పరిధిలోని ఎర్రుపాలెం, మధిర, బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాల పరిధిలోగల రైతులకు తన శక్తి మేరకు సేవలు అందిస్తానని తెలిపారు. మధిర నియోజకవర్గ ఆత్మ కమిటీ ఛైర్మన్‌గా నియమించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు రామకోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, మాజీ జెడ్పిటిసి మోదుగు సుధీర్ బాబు, కాంగ్రెస్ యువ నాయకులు భుక్య బద్రు నాయక్, రాయన్నపేట మాజీ సర్పంచ్ రామకోటేశ్వరరావు, ప్రధాన అనుచరుడు మారుపల్లి ప్రేమకుమార్, పలువురు కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామకోటేశ్వరరావుకు అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్‌ని విమర్శించే నైతిక అర్హత కమల్‌రాజుకు లేదు



నవతెలంగాణ - బోనకల్

కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక అర్హత బీఆర్ఎస్‌కు, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజుకు లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేబ్రోలు వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంపినోడే సంతాప సభ పెట్టినట్లుగా కమల్ రాజు వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే ఎన్నో సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ ఏడాది జనవరి 26న రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు జారీ ప్రక్రియ చేపట్టిందన్నారు. ప్రతి సంక్షేమ పథకం నిరంతర ప్రక్రియ గా కొనసాగుతుందన్నారు. ఓవైపు బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అప్పులు తిరిగి చెల్లిస్తూ సంక్షేమ పథకాలకు నిధులు సమకూరుస్తూ ఆర్థిక శాఖ మంత్రిగా, రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా అహర్నిశలు పాటుపడుతున్న మల్లు భట్టి విక్రమార్కని విమర్శించే అర్హత, స్థాయి కమల్ రాజుకు లేదన్నారు. గత పది సంవత్సరాలలో పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వని బిఆర్ఎస్, బీఆర్ఎస్‌లో మనుగడ ప్రశ్నార్థకం కావడంతో దిక్కుతోచని స్థితిలో ఇలా మాట్లాడుతున్నారన్నారని ఎద్దేవా చేశారు. ఓవైపు మధిర నియోజకవర్గంతో పాటు రాష్ట్రమంతా అభివద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతుంటే ఓర్వలేకనే బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలకు తెర లేపారని విమర్శించారు. భట్టి విక్రమార్కపై ఆరోపణలు చేస్తున్న కమల్ రాజుకు దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

బిఎస్ఎన్ఎల్ టెలికామ్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణకు సన్మానం

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన ఉమ్మనేని కృష్ణ బిఎస్ఎన్ఎల్ టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం ముష్టికుంట్లలో ఘనంగా సన్మానించారు. ఉమ్మనేని కృష్ణను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సంస్థలో మండలానికి చెందిన ఉమ్మనేని కృష్ణకు అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా పదవి దక్కటం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కృష్ణను సన్మానించిన వారిలో ముష్టికుంట సొసైటీ అధ్యక్షుడు బోయినపల్లి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, బోయినపల్లి మురళి, షేక్ షాజహాన్ తదితరులు ఉన్నారు.



చిన్న బీరవల్లి పెద్ద వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరు

- డిప్యూటీ సీఎంకు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని చిన్న బీరవల్లి-రాపల్లి క్రాస్ రోడ్డు మధ్యగల పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి గాను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రూ.4.50 కోట్లు మంజూరు చేసినట్లు చిన్న బీరవల్లి కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాసరావు తెలిపారు. పెద్దవాగుపై గతంలో నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో వచ్చిన వర్షాలకు వర్షపు, వరద నీటితో ఈ బ్రిడ్జి చాలా వరకు దెబ్బతిన్నది. ఈ బ్రిడ్జి ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. ఈ బ్రిడ్జిపై చిన్నబీరవల్లి, తదితర గ్రామాల ప్రజలు భయంతోనే రాకపోకలు సాగిస్తున్నారు. పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించాలని చిన్నబీరవల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అనేకసార్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు డిప్యూటీ సీఎం స్పందించి పెద్దవాగుపై నూతనంగా బ్రిడ్జి నిర్మించేందుకు రూ.4.50 కోట్లు మంజూరు చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రధానంగా చిన్నబీరవల్లి గ్రామ రైతుల, ప్రజల కష్టాలు తీరనున్నాయి. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సీఎంకు కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, కాంగ్రెస్ నాయకులు సంద్ర శ్రీనివాసరావు, మెట్టెల నరసింహారావు, పిల్లి రాములు, కటారి నాగేశ్వరరావు, పేరబత్తిని వినయ్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

గార్లపాడు - నాగలవంచ రోడ్డుకు మహర్దశ

- రోడ్డు విస్తరణ పనులకు రూ.2.23 కోట్లు మంజూరు

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని గార్లపాడు నుంచి చింతకాని మండలం నాగలవంచ వరకు రోడ్డు విస్తరణ పనులకు గాను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రూ 2.23 కోట్లు మంజూరు చేశారు. గార్లపాడు నుంచి నాగలవంచ రోడ్డులోని నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు ఈ నిధులతో చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రామాపురం నుంచి నాగులవంచ రైల్వే స్టేషన్ వరకు ఈ రహదారి పెద్ద పెద్ద గుంతల పడి ప్రమాదకరంగా మారింది. కొన్నిచోట్ల పెద్దపెద్ద గుంతలో ఏర్పడటంతో ద్విచక్ర వాహనాలు తరుసు రాత్రి సమయంలో ప్రమాదాలకు గురవుతున్నాయి. గోవిందాపురం ఎల్, గార్లపాడు, రామాపురం గ్రామాలకు చెందిన ప్రజలు ఖమ్మం వెళ్లాలంటే ఈ రహదారి నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి. రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, మాజీ జెడ్పిటిసి మోదుగు సుధీర్ బాబు, రామాపురం కాంగ్రెస్ నాయకుడు నల్లమోతు సత్యనారాయణ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా రావినూతల బీటీ రోడ్డు నుంచి గోవిందాపురం ఎల్ వయా పెద్దబీరవల్లి రోడ్డుకు రూ.2.80 కోట్లు మంజూరయ్యాయి.

పథకాల పేరుతో మోసం ఎంతో కాలం సాగదు

- ప్రజల నిలదీస్తారనే భయంతోనే డిప్యూటీ సీఎం దుమ్మా
- జెడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజు

నవతెలంగాణ - బోనకల్



అబద్ధాలు చెప్పటంలో కాంగ్రెస్ నాయకులకు సాటి ఎవరూ రారని, పథకాల పేరుతో ప్రజలను ఎంతో కాలం మోసం చేయలేరని, మధిర నియోజకవర్గంలో 131 గ్రామపంచాయతీలు ఉంటే కేవలం ఐదు గ్రామపంచాయతీలలోనే 4 పథకాలను అమలు చేశారని జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజు విమర్శించారు. మండల పరిధిలోని రావినూతల గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు ఇంట్లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 13 నెలలు అవుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత డిసెంబర్ నెలలో 6 గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారని, ఆ డిసెంబర్ పోయి మరల డిసెంబర్ కూడా వచ్చింది అన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నాలుగు పథకాల ప్రారంభ కార్యక్రమంలో తన సొంత నియోజకవర్గంలో పాల్గొనటానికి ముఖం లేకనే వైరా నియోజకవర్గంలో పాల్గొన్నాడని ఎద్దేవా చేశారు. 26 జనవరి నుంచి నాలుగు పథకాలను అమలు చేస్తామని ఎంతో అర్భాటంగా ప్రకటించారన్నారు. కానీ చివరకు మండలంలో ఒక్క గ్రామంలో మాత్రమే ఈ పథకాలను అమలు చేశారన్నారు. ఆ గ్రామంలో కూడా అరకొరగానే పథకాలను లబ్ధిదారులకు అందజేశారని విమర్శించారు. జనాన్ని మభ్యపెడుతూ ఎంతో కాలం అధికారంలో ఉండలేరని ఆయన అన్నారు. మధిర నియోజకవర్గంలో ఐదు గ్రామాలకు సంబంధించి 1321 కుటుంబాలు ఉన్నాయన్నారు. ఈ ఐదు గ్రామాలలో 4 పథకాలకు సంబంధించి 4,175 మందికి రైతు భరోసా, 201 మందికి ఇందిరామ ఆత్మీయ భరోసా, 131 రేషన్ కార్డులు, 187 ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారన్నారు. ఆనాడు కెసిఆర్ ప్రభుత్వంలో మధిర నియోజకవర్గంలో 79,012 మంది రైతులకు రైతుబంధు అమలు చేశామని తెలిపారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గ వ్యాప్తంగా కేవలం 4,175 మందికి మాత్రమే రైతు భరోసా అమలు చేసిందన్నారు. మిగిలిన రైతుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. మధిర నియోజకవర్గంలో ఎంపిక చేసిన ఐదు గ్రామాలను కూడ చిన్న చిన్న గ్రామాలను మాత్రమే ఎంపిక చేశారన్నారు. ముదిగొండ మండలంలో ఖానాపురం గ్రామం ఎంపిక చేశారని తెలిపారు. ఈ గ్రామంలో 181 కుటుంబాలు ఉండగా 144 మందికి రైతు భరోసా, 51 ఇందిరామ ఆత్మీయ భరోసా, 27 ఇందిరమ్మ ఇల్లు, 8 మందికి రేషన్ కార్డులు మంజూరు చేశారన్నారు. చింతకాని మండలంలో రేపల్లెవాడను ఎంపిక చేశారని, ఈ గ్రామంలో 226 కుటుంబాలు ఉంటే కేవలం 425 మందికి మాత్రమే రైతు భరోసా, 43 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 25 మందికి కొత్త రేషన్ కార్డులు 32 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారని తెలిపారు. బోనకల్ మండలంలో గార్లపాడు గ్రామాన్ని ఎంపిక చేశారన్నారు. ఈ గ్రామంలో 227 కుటుంబాలు ఉండగా 609 మందికి రైతు భరోసా, 27 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 16 మందికి రేషన్ కార్డులు, 20 మందికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారన్నారు. మధిర మండలంలో చిలుకూరు గ్రామాన్ని ఎంపిక చేస్తారని ఈ గ్రామంలో 365 కుటుంబాలు ఉండగా 809 మందికి రైతు భరోసా, 47 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 44 మందికి ఇందిరమ్మ ఇల్లు, 42 మందికి రేషన్ కార్డులు మంజూరు చేశారన్నారు. ఎర్రుపాలెం మండలంలో రాజు దేవరపాడు గ్రామాన్ని ఎంపిక చేశారని ఈ గ్రామంలో 33 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 44 మందికి రేషన్ కార్డులు, 64 ఇల్లు మంజూరు చేశారన్నారు. మధిర నియోజకవర్గంలో 131 గ్రామపంచాయతీలు ఉంటే కేవలం 5 గ్రామపంచాయతీలను ఎంపిక చేశారన్నారు. మిగిలిన 126 గ్రామ పంచాయతీల ప్రజల సంగతి ఏమిటని ఆయన డిప్యూటీ సీఎంను ప్రశ్నించారు. ఎంపిక చేసిన ఈ చిన్న గ్రామపంచాయతీలలో కూడా అర్హులైన వారందరికీ నాలుగు పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆయన విమర్శించారు. కెసిఆర్ ప్రభుత్వంలో రేషన్ కార్డులు ఇచ్చామని, ఆ రేషన్ కార్డుల పంపిణీలో ఆనాటి మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారని ఆయన గుర్తు చేశారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు, మండల ప్రధాన కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ బంధ శ్రీనివాసరావు, ఆ పార్టీ నాయకులు తన్నీరు పుల్లారావు, జొన్నలగడ్డ ధనమూర్తి, కొనకంచి నాగరాజు, కొమినేని ఉపేందర్, కంచర్ల బాబు తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-వైరాటౌన్

కట్టా దేవిశ్రీ పుట్టిన రోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులు సన్ రైజ్ అభ్యుదయ సేవా సమితి వైరా వారి ఆధ్వర్యంలో వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురం గ్రామంలో వృద్ధులు, వితంతువులకు సుమారు రూ.15000ల విలువ చేసే దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కల్లూరు ఎంపీఓ ఏనుగు సురేష్ బాబు మాట్లాడుతూ ఈ సంస్థ వారు అంగన్వాడీ కేంద్రాల్లో అవసరమైన వస్తువులు పంపిణీ, పాఠశాలల్లో నోటు బుక్స్, పరీక్షా సామగ్రి, నిస్సహాయంగా ఉన్న వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏనుగు సుమన్ బాబు, సంస్థ అధ్యక్షులు మాలతి దాస్, సంస్థ ప్రతినిధులు షేక్ సుభాని యంపీ దాస్, శోభన్, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మంత్రి బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ-తల్లాడ

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ప్రజా యుద్ధ నౌక గద్దర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, యువజన కాంగ్రెస్ నాయకులు కటికి కిరణ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తన తప్పును తెలుసుకొని క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో, తెలంగాణలో తిరగకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు ఎక్కడికక్కడ అడ్డుకుంటారని హెచ్చరించారు.

రజకులపై అగ్రవర్ణ పెత్తందారుల దాడులను ఖండించండి

రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-కొణిజర్ల

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో రైతు చిటికెన ముసలయ్యపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పంట ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. దాడి చేసిన దుర్మార్గులను వెంటనే శిక్షించాలని, లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని రజక వత్తిదారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు సత్తెనపల్లి శ్రీను, అన్నారపు వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పథకాలపై నిబంధనలు సడలించాలి

రైతు సంఘం మండల కార్యదర్శి కోలేటి ఉపేందర్ రావు డిమాండ్

నవతెలంగాణ-ముదిగొండ

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై నిబంధనలను సడలించాలని రైతు సంఘం మండల కార్యదర్శి కోలేటి ఉపేందర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. భూములేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేసేందుకు ఉపాధిహామీ పని చేసి ఉండాలని నిబంధన పెట్టడం సరికాదన్నారు. ఉపాధిహామీ నిబంధనను తొలగించి ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందజేయాలన్నారు. రేషన్ కార్డు మంజూరుకు ట్రాక్టరు, కారు, ఆటో నిబంధనను తొలగించాలన్నారు. ఇంటి స్థలం కొనుక్కోవటానికి స్తోమత లేక చాలామంది రైతు బీమా, పీఎం కిసాన్ చేసుకున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి మంజూరు చేయాలన్నారు. ఈ పథకాలకు ప్రభుత్వం పెట్టిన నిబంధనాలను ఎత్తు వేయకపోతే రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని కోలేటి ఉపేందర్ రావు హెచ్చరించారు.



50వ డివిజన్ సమస్యలపై పరిష్కారానికి మేయర్‌కు వినతి

- సానుకూలంగా స్పందించిన నీరజ

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగర కార్పొరేషన్ పరిధి 50 డివిజన్‌లో పలు ప్రాంతంలో పేరుకుపోయిన నీటి, డ్రయినేజ్, విద్యుత్ సమస్యలపై నగర మేయర్ పూనుకోల్లు నీరజకు డివిజన్ కార్పొరేటర్ రాపర్తి శరత్ నేతృత్వంలో ఆ ప్రాంత ప్రజలు వినతిపత్రం అందజేశారు. వేసవికాలం సమీపిస్తున్న సమయంలో నీటి ఎద్దడిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గత కొంత కాలంగా ప్రాంతంలో పేరుకుపోయిన డ్రయినేజీ, విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన నగర మేయర్ పి.నీరజ సంబంధిత అధికారులతో మాట్లాడి, తక్షణమే నీటి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. వేసవిలో ప్రజలు ఎటువంటి నీటి సమస్యతో బాధపడకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇచ్చిన ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆ ప్రాంత కాంగ్రెస్ నాయకులు బత్తుల తిరుమలరావు ఉన్నారు.

జెడ్పీహెచ్ఎస్ మల్లెమడుగులో స్కూల్ హెల్త్ ప్రొఫైల్ క్యాంప్

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని 60వ డివిజన్ రామన్నపేట కాలనీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్లెమడుగులో డాక్టర్ ఎస్ బాలకృష్ణ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ కళావతి బాయి స్కూల్ హెల్త్ ప్రొఫైల్ క్యాంపును ప్రారంభించారు. ఈ టీం ప్రతిరోజు 50 మంది చొప్పున విద్యార్థులందరికీ సి.బి.పి, బ్లడ్ గ్రూపింగ్, ఆర్‌బిఎస్, ఎల్ఈడి, ఆర్ఎఫ్‌టి, లిపిల్ ప్రొఫైల్, థైరాయిడ్, సిక్స్ సెల్, డెంటల్, స్కిన్ రీనల్, సిఎన్ఎస్, లంగ్స్ సిటిఎస్ మొదలగు పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు హెల్త్ కార్డును అందజేసి ఆన్లైన్లో వారి ప్రొఫైల్ ను ఉంచనున్నట్లు డాక్టర్ చందు నాయక్, బాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.కృష్ణవేణి, హెల్త్ కోఆర్డినేటర్ పిడి బియ్యని కృష్ణయ్య, డిఐఓ డాక్టర్ చందు నాయక్, డాక్టర్ రవీంద్రనాథ్, డాక్టర్ నీలోఫర్ సుల్తానా, హెచ్ఈవో హెచ్ బద్రు,హెచ్ఎస్లు ఎం.రాజు, జి మాణిక్యమ్మ, ఎమ్మెల్ హెచ్‌పి కె.బాబు, ఫార్మసిస్ట్ తిరుమల కుమార్, ఏఎన్ఎం చిలకమ్మ, ఆశా వర్కర్స్ సుజాత మణెమ్మ పాల్గొన్నారు.

మంద కృష్ణకు పద్మశ్రీ అవార్డు పట్ల హర్షం

నవతెలంగాణ- వైరా

మంద కృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డు ఇచ్చినందుకు వైరా పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు మాట్లాడుతూ పాల్గొని మోడీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు . ఈ కార్యక్రమంలో ఫమ్మి తిరుమలరావు, వెంకట్, తిరుమలరావు, రవి, కన్నెగంటి ఉసేను , పూర్ణ కంటి రామారావు , వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన నాయి బ్రాహ్మణులు

- ఫిబ్రవరి మొదటి వారంలో జరిగే ప్రమాణస్వీకారానికి ఆహ్వానం

నవతెలంగాణ-ఖమ్మం



నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర కమిటీ ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, ఎంపీ రఘురాం రెడ్డిని హైదరాబాదులో మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షులు యలమందల జగదీష్ నాయి, కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం దిశగా అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు. ఫిబ్రవరి మొదటి వారంలో నగర కమిటీ ప్రమాణ స్వీకరానికి ముఖ్య అతిథులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపి రఘు రామ్ రెడ్డిలు హాజరవుతున్నారని తెలిపారు.

ఆయిల్ పామ్ పంటను రైతులు సాగు చేయాలి

- పంటలను పరిశీలించిన కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్
- చెరువు శిఖం భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడండి
- రెవెన్యూ అధికారులకు ఆదేశాలు

నవతెలంగాణ-రఘునాథపాలెం

ఖమ్మం జిల్లాలో లాభదాయక ఆయిల్ పామ్ పంటను అధిక సంఖ్యలో రైతులు సాగు చేయాలని, ఆ దిశగా జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రఘునాథపాలెం మండలం చింతగుర్తి గ్రామంలో ఆలస్యం రామారావు పండిస్తున్న ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు. పంటను సాగు చేస్తున్న రైతులతో కలెక్టర్ ముచ్చటించారు. గతంలో ఏ పంటలు సాగు చేశారు, ఎంత విస్తీర్ణంలో పంట వేశారు, అంతర్ పంటల సాగు ఎలా ఉంది, ఆయిల్ పామ్ పంట సంవత్సరానికి ఎంత దిగుబడి వస్తుంది, నీటి వనరులు ఎలా ఉన్నాయి. వంటి వివిధ అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ పంట వేసేందుకు ప్రభుత్వం మొక్కల సబ్సిడీ, డ్రిప్ ఇరిగేషన్ సదుపాయ కల్పనకు సబ్సిడీ, మొదటి నాలుగు సంవత్సరాల వరకు అంతర పంట పెట్టుబడులకు కొంత సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఆయిల్ పామ్ పంట ద్వారా రైతులు బాగు పడతారని, 4 సంవత్సరాల నుంచి ఆయిల్ పామ్ పంట వల్ల ఆదాయం రావడం ప్రారంభమవుతుందని, 7వ సంవత్సరం నుంచి పూర్తిస్థాయి పంట వస్తుందని, రైతులకు అద్భుతంగా ఆదాయం లభిస్తుందని, పరిసరాలలోని ఇతర రైతులు కూడా ఆయిల్ పామ్ పంట సాగు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామంలోని చెరువుల వద్ద శిఖం భూములు ఆక్రమణలకు గురయ్యాయని రైతులు ఫిర్యాదు చేయగా, విచారణ చేసి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. చెరువుల కబ్జా, ఆక్రమణలపై విచారణ చేసి ఫిబ్రవరి 15 లోపు నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్, మండల తహసీల్దార్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పామ్ ఆయిల్ పంట కోత యంత్రాలు సబ్సిడీపై అందించేందుకు చర్యలు చేపడతామని అన్నారు. గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ద్వారా ఆయిల్ పామ్ పంట వెయ్యి ఎకరాలలో క్లస్టర్ ఉంటే రైతులకు లాభం అయ్యే విధంగా లేబర్ సరఫరా చర్యలు చేపడతామని అన్నారు. గ్రామంలో అర ఎకరం వరకు లీజ్‌కు ఇస్తామని నెల రోజుల వ్యవధిలో క్లస్టర్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేసి అత్యాధునిక వ్యవసాయ



పరికరాలు రైతులకు అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు సరఫరా చేసే ప్రతి ఆయిల్ పామ్ మొక్కకు జియో ట్యాగింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామంలో ఉన్న రెవెన్యూ సమస్యలు వివరాలు తెలుసుకున్న కలెక్టర్ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సాదా బైనామా దరఖాస్తులకు ప్రభుత్వం నుంచి వచ్చే పరిష్కారం మేరకు జిల్లాలో చర్యలు చేపడతామని అన్నారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట ఉద్యానవన శాఖ అధికారి జి నగేష్, రఘునాథపాలెం మండల తహసీల్దార్ విల్సన్, గోద్రెజ్ ఆగ్రో వెట్ లిమిటెడ్ మేనేజర్ ఏ.రామకృష్ణ, టిఎస్ఎంఐపీ నాగమణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



బుడేగం కృష్ణమూర్తి ఆశయాలను కొనసాగించాలి

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బుడిగెం కృష్ణమూర్తి ఆశయాలు కొనసాగించాలని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బండారు యాకయ్య కోరారు. స్థానిక ఖమ్మం గాంధీచౌక్‌లో సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజినేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన బుడిగెం కృష్ణమూర్తి 19వ వర్ధంతి నిర్వహించారు. ముందుగా జెండాని పార్టీ సీనియర్ నాయకులు బండారు యాకయ్య ఆవిష్కరించారు. బుడిగం కృష్ణమూర్తి స్తూపానికి బుడిగెం రమేష్, వజ్జినేపల్లి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బండార యాకయ్య మాట్లాడుతూ చాలా నిబద్ధత కలిగిన వ్యక్తిని పార్టీ పట్ల సంఘం పట్ల చాలా నిబద్ధతతో ఉండేవారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నిత్యం పార్టీ కార్యక్రమాలలో పాల్గొనేవాడని కృష్ణమూర్తి లేని లోటు పార్టీకి వ్యాపార వర్గాలకి తీరని లోటు అని ఆయన కొనియాడారు. ఆయన ఆశయాలని నిరంతరం ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యురాలు పత్తిపాక నాగ సులోచన, డివిజన్ కమిటీ సభ్యులు ఎస్‌కే ఇమామ్, యర్రా రంజిత్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం వీరబాబు, త్రీ టౌన్ కమిటీ సభ్యులు ఎస్‌కే సైదులు, సీఐటియు జిల్లా నాయకులు ముదాం శ్రీనివాసరావు, దోనోజు లక్ష్మయ్య, త్రీటౌన్ నాయకులు యర్రా మల్లికార్జున్, సారంగి పాపారావు, వేల్పుల నాగేశ్వరరావు, ఎస్కే కాశం, యర్రా నగేష్, రంగు హనుమంతచారి, బండారు సునీత, వట్నాల బాబు జంగం నగేష్, సోమనబోయిన వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యుపిఎస్‌ని రద్దు చేయాలి

- పిఆర్‌టియు ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట ఉపాధ్యాయుల నిరసన

నవతెలంగాణ-ఎర్రుపాలెం

నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ పద్ధతిని అమలుపరచాలని దేశవ్యాప్త ఉద్యోగులు అనేక సం వత్సరాలుగా డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మదన్ మోహన్ రెడ్డి విమర్శించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర పిలుపులో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ముందు యుపిఎస్‌కి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ మన్నే ఉషాశారదకు మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురునాథరెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించకుండా కంటి తుడుపు చర్యగా సిపిఎస్‌కి బదులుగా యునైటెడ్ పెన్షన్ స్కీమ్‌ను 2025 ఏప్రిల్ ఒకటి నుండి అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న ఈ కొత్త పెన్షన్ విధానంతో ఉద్యోగ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని యుపిఎస్ విధానం చాలా లోప భూయిష్టంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు ప్రధాన కార్యదర్శ బాబు రావు, జిల్లా బాధ్యులు ఎస్.సంగిరెడ్డి, నాగరాజు, ఫిలిప్, చిన్నప్ప, ఎస్‌కే రమేష్, రాఘవ, సుమన, దత్తాత్రేయ, వెంకటనారాయణ, మధుసూదన్ రెడ్డి, అప్పిరెడ్డి, శ్రావణి ,నిహా, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ విజయంతోనే సమస్యలు పరిష్కారం

నవతెలంగాణ-కల్లూరు

పీఆర్‌టీయూ తరపున ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పింగిళి శ్రీపాల్‌రెడ్డి విజయంతోనే ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతాయని మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి, సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పి.వెంకట్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాను సంఘం అధ్యక్షుడిగా, ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు ఉపాధ్యాయులకు బదిలీల్లో కౌన్సెలింగ్ విధానం ప్రవేశపెట్టేలా కృషి చేశానని, ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో అప్రెంటిస్ కాలానికి రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇప్పించానని గుర్తు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావుతో పాటు మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పాకాల రమేష్, షేక్ చాంద్ సాహెబ్, రాష్ట్ర బాధ్యులు యం.డి మౌలాని, పఠాన్ రహీం, జిల్లా బాధ్యులు బోబోలు శ్రీనివాసరావు, బీరవల్లి శ్రీనివాసరావు, మండల భాద్యులు పోట్రు మధుసూదన్ రావు, ఎంవీకే జ్యోతి, సీనియర్ సభ్యులు చిత్తలూరి సోమేశ్వరరావు, ముత్తమాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గుమస్తాలు, ఫీల్డ్ అసిస్టెంట్‌ల నయా దందా..?

మీ పేర్లు మా వల్లే వచ్చయాంటూ పైసా వసూల్..?

నవతెలంగాణ-కొణిజర్ల

మండలంలోని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కొంతమంది పంచాయతీ గుమస్తాలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు నయా దందా మొదలుపెట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పింఛన్లు నుంచి కళ్యాణ లక్ష్మీ షాదీముబారక్ తోపాటు ఉపాధి హామీ పథకంలో పనిచేయకుండా పని ప్రదేశానికి వచ్చి నిలబడి ఫొటో దిగి వెళితే చాలని, అదేవిధంగా గ్రామాల్లో ప్రతి పనికి వందల నుంచి వేల రూపాయలు దండుకోవడం పంచాయతీ గుమస్తాలు ఫీల్డ్ అసిస్టెంట్ లకు అలవాటుగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ఈ నెల 21 నుంచి 23 వరకు గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్ళు, రేషన్ కార్డులు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలకు సంబంధించిన లబ్దిదారులు పేర్లు గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు పెట్టి అధికారులు వివరించడంతో పేర్లు వచ్చిన లబ్దిదారులు సంతోషాన్ని క్యాష్ చేసుకునే పనిలో కొంతమంది గుమస్తాలు, ఫీల్డ్ అసిస్టెంట్ లు ఉన్నట్టు సమాచారం. గత బీఆర్ఎస్ పరిపాలనలో చక్రం తిప్పిన గుమస్తాలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు అదే పలుకుబడితో తాము ఆడిందే ఆట పాడిందే పాటలా ఉంటుందని జాబితాలో పేర్లు వచ్చిన వారితో అంటున్నట్టు వినికిడి. ఇప్పటికే అయా గ్రామాల్లో ఉన్న పంచాయతీ గుమస్తాలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు గ్రామ సభలలో అధికారులు చదివి వినిపించిన పేర్లు రావడం వెనక తమ ప్రమేయం ఉందని డబ్బులు ఇస్తే ఇందిరమ్మ ఇల్లు తోపాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు మీకు వచ్చేలా చేసే బాధ్యత తమదేనని ప్రస్తుతం ఉన్న పంచాయతీ కార్యదర్శులు కొత్తవారు కావడం వాళ్లకి గ్రామాలపై పట్టులేదని పెత్తనం తమదేనని లబ్దిదారులకు చెబుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లు 2023 నుంచి 24 సంవత్సరంలో 20 రోజులు పనిచేసినట్టు ఉంటేనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తిస్తుందని చెప్పడంతో అదే సంవత్సరం పదిహేను రోజులు పనికి పోయిన వారి జాబ్ కార్డు పుస్తకాలలో డబ్బులు తీసుకొని ఇరవై ఐదు రోజులు పనిచేసినట్టుగా జాబ్ కార్డు లలో రాస్తున్నారు. ఈ డబ్బులు దండుకునే నయా దందాలో మల్టీపర్పస్ కార్మికులు ఉంటున్నారని బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిఇలాఉండగా జాబితాలో ఉన్న మీ పేర్లు ఎవరైనా తొలగించాలని గ్రామాల నుంచి అభ్యంతరాలు పెడితే మేము వెంటనే పంచాయతీ కార్యదర్శులకు తెలియకుండా సమాచారం ఇస్తామని ఇందిరమ్మ ఇల్లు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు వచ్చేలా చెబుతుండటం విశేషం.



లబ్దిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం : ఎంపీడీవో రోజారాణి

ఇందిరమ్మ ఇళ్ళు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి జాబితాలో పేర్లు వచ్చిన లబ్దిదారుల నుంచి పంచాయతీ గుమస్తాలు ఫీల్డ్ అసిస్టెంట్ లు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టి కి రాలేదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన పథకాలలో గ్రామ పంచాయతీ సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్ లు వసూలు చేసినట్లు రుజువు అయితే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రోజారాణి నవతెలంగాణతో అన్నారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి రాజకీయాలకుతీతంగా నిజమైన అర్హులను గుర్తించి పారదర్శకంగా సర్వే చేయాలని ఎక్కడ అవకతవకలు జరగకుండా ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

వైరస్‌తో మృతి చెందిన కోళ్లను పరిశీలించిన వెటర్నరీ సెంట్రల్ టీం



నవతెలంగాణ-పెనుబల్లి

వీఎం బంజర్ జంగాల కాలనీలో కోళ్ల ఫారంలో వైరస్ కారణంగా మృతి చెందిన బాయిలర్ కోళ్లను మంగళవారం వెటర్నరీ సెంట్రల్ టీం పరిశీలించింది. కాలనీకి చెందిన కొండపల్లి ఉప్ప స్వామి కొంతకాలంగా కోళ్ల ఫారం లీజుకు తీసుకొని పెంచుతున్నాడు. ఈ క్రమంలో రోజులుగా కోళ్ళ మృతి చెందటంతో పాటు ఆదివారం ఒక్కరోజే 2000 బాయిలర్ కోళ్లు మృతి చెందడంతో పశువైద్యను సంప్రదించాడు. దీంతో స్పందించిన జెడి వెంకట్ నారాయణ సెంట్రల్ టీంను రప్పించి కోళ్ల మృతికి కారణాలను వెలికి తీసేందుకు కోళ్ల కళేబరాన్ని శాంపిల్ కోసం సేకరించారు.

ఈ సందర్భంగా పెనుబల్లి పశువైద్యశాలలో ఏడి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వెటర్నరీ జెడి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల కారణంగా మృతి చెందయ్యా లేక వైరస్ కారణంగా మృతి చెందాయ అనే నిర్ధారణ చేసేందుకు శాంపిల్‌ను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపామన్నారు. నష్టపరిహారంపై బైలర్ పిల్లలు పంపిన యాజమాన్యం దృష్టి సారిస్తుందని ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ టీం సిబ్బంది విజయభాస్కర్ రెడ్డి, అరుణ, శిరీష, వెటర్నరీ వైద్యురాలు వి.సృజన పాల్గొన్నారు.



కూలీల ట్రాక్టర్ పల్టీ... ఆరుగురికి గాయాలు

నవతెలంగాణ -కూసుమంచి

మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలోని సబ్ స్టేషన్ వద్ద మంగళవారం కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ లో ప్రయాణిస్తున్న 13 మంది మహిళ కూలీలు పొలంలో పడిపోయారు. ఇందులో ఆరుగురి మహిళలకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జుజ్జులరావు పేట గ్రామానికి చెందిన కూలీలు నరసింహుల గూడెం గ్రామంలోని ఓ రైతు మిర్చి తోటను వేరేందుకు ట్రాక్టర్‌లో వెళుతుండగా నర్సింహులగూడెం గ్రామ శివారులో సంఘటన జరిగినట్లు తెలియజేశారు.

ఎక్కువమందికి జీవిత బీమా అందించాలనేదే పోస్టల్ శాఖ ఉద్దేశం

నవతెలంగాణ ఖమ్మం కార్పొరేషన్

తపాలా జీవిత బీమా దినోత్సవం ఫిబ్రవరి ఒకటో తారీఖున జరుపుకుంటాం అని తపాల జీవిత బీమా మొదలై 141 సంవత్సరాలు పూర్తయిందని ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో వీలైనంతవరకు ఎక్కువ ప్రజలకి జీవిత బీమా అందించాలనే మంచి ఉద్దేశంతో సిబ్బందికి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఖమ్మం డివిజన్ వీరభద్ర స్వామి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు అధికారులు పాల్గొన్నారు.

వికలాంగుడికి ఆర్థిక సహాయం

- ఘనంగా డాక్టర్ కాపా మురళీకృష్ణ -చంద్రకళ వివాహ వార్షికోత్సవం

నవతెలంగాణ-వైరా

లయన్స్ క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పిఎంజెఎఫ్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, డాక్టర్ చంద్రకళ దంపతుల వివాహ వేడుక మంగళవారం లయన్స్ క్లబ్ సభ్యులు అభిమానులు, బంధు మిత్రుల మధ్య ఆడంబరంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైరాకు చెందిన నిరుపేద వికలాంగుడైన ఎస్కే అబ్రహంకు గ్రేట్ విజన్ క్లబ్ వైరా, లయన్స్ క్లబ్ వైరా, సంయుక్తంగా రూ 5000/లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపమురళీకృష్ణ మాట్లాడుతూ క్లబ్బుల సంయుక్త ఆధ్వర్యంలో మా పెళ్లి రోజు వేడుకలు జరుపుకోవడం మా దంపతులకు ఆనందంగా ఉందని అన్నారు. జీఎస్టీ కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాంబాబు ,వరలక్ష్మి దంపతులు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంత ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందిస్తూ లయన్స్ క్లబ్బుల ద్వారా ఎంతోమందికి అండగా ఉంటూ సేవలందిస్తున్న డాక్టర్స్ దంపతుల సేవలు మరువలేనివని అన్నారు. అనంతరం రెండు క్లబ్బుల అధ్యక్షులు తోటకూర శ్రీకాంత్, చింతలపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేదలు, నిరుపేదలు వికలాంగులను ఆదుకుంటూ పేద విద్యార్థులను పై



చదువులకు ఆర్థికంగా సహాయపడుతూ గత 18 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న డాక్టర్స్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కటింగ్ చేసి మురళీకృష్ణ దంపతులను ఘనంగా సన్మానించారు. క్లబ్ సభ్యులందరూ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ జాయింట్ సెక్రెటరీ లయన్ లగడపాటి ప్రభాకర్ రావు, క్లబ్బు సెక్రెటరీ అబ్బూరి రమేష్, కోశాధికారి మరికంటి రాంగోపాల్, గ్రేట విజన్ క్లబ్ సెక్రటరీ జాల పుల్లారావు, జాల మహాలక్ష్మి, మీల్స్ ఆన్ వీల్స్ కోఆర్డినేటర్ చింతోజు నాగేశ్వరరావు, క్లబ్బుల సభ్యులు రాయపూడి వెంకటేష్, పోలా శ్రీనివాసరావు, గంగవరపు కిషన్, రాయి మురళీకృష్ణ, హాస్పిటల్ సిబ్బంది తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం జనవరి 29, 2025 www.navatelangana.com

మున్సిపల్ కమిషనర్‌గా సుజాత బాధ్యతలు స్వీకరణ



నవతెలంగాణ-అశ్వారావుపేట

మున్సిపాల్టీ కమిషనర్‌గా కే.సుజాతకు మంగళవారం విధుల్లో చేరారు. కాగా ఆమెకు కార్యదర్శి శ్రీరామమూర్తితో సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కాంగ్రెస్ నాయకులు మొగళ్ళపు చెన్నకేశవరావు, జ్యేష్ట సత్యనారాయణ చౌదరి, సత్యవరపు బాలగంగాధర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రమోద్, పుర ప్రముఖులు ఉన్నారు.

తాటికొండ రాజయ్య నోరు అదుపులో పెట్టుకోవాలి

- టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్



నవతెలంగాణ-చర్ల

తాటికొండ రాజయ్య మీ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదని, లేకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని భద్రాచలం నియోజకవర్గం టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం ఉదయం మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య రాష్ట్ర ప్రభుత్వం, మంత్రుల మీద నోటికొచ్చింది మాట్లాడటంపై ఆయన తీవ్రంగా ఖండించారు. మీ ప్రభుత్వం వున్న 10 సంవత్సరాలలో ఎప్పుడైనా ఒక్క తెల్ల రేషన్ కార్డు అయినా ఇచ్చారా, కనీసం గ్రామసభలు నిర్వహించారా, ప్రజల్లో మీపై వస్తున్న వ్యతిరేకతకు తట్టుకోలేక ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి వినయ విధేయుడు అయిన ఉప ముఖ్యమంత్రివర్యులు భట్టి విక్రమార్క, ఆయన సతీమణి పై మీరు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి, లేనిచో మీకు తగిన బుద్ధి చెబుతామన్నారు.

గద్దర్ పై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నాం



నవతెలంగాణ-మణుగూరు

ప్రజా యుద్ధ నౌక గద్దర్ పై కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూరపరెడ్డి తరుణ్ రెడ్డి అన్నారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్ ఆదేశాల మేరకు నియోజకవర్గ అధ్యక్షులు తరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్రమంత్రి బండి సంజయ్ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా తరుణ్ రెడ్డి మాట్లాడుతూ తన గానంతో తెలంగాణ ఉద్యమాన్ని ఉత్తేజపరిచిన ప్రజా యుద్ధనౌక గద్దర్‌ని అమిత్ షా చెప్పులు మోసే బండి సంజయ్ విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాసమల్ల నాగరాజు, నియోజకవర్గ కార్యదర్శి లక్ష్మీ ప్రగతి, మణుగూరు, బూర్గంపాడు మండలాల అధ్యక్షులు సతీష్, హరీష్ యాదవ్ ఉపాధ్యక్షులు కన్నెపలి శివ, లిఖిత్, ప్రవళిక, అశ్వాపురం, పినపాక మండల ఉపాధ్యక్షులు గొల్లపల్లి నరేష్ కుమార్, సింహాద్రి హనుమంతు, కరుణ్ రెడ్డీ, అజిత్, సాదిక్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నవతెలంగాణ-టేకులపల్లి

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలు క్షేత్రస్థాయిలో అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు బి.భరత్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మండలాల్లో, ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థులు ఐటీడీఏ ద్వారా అధిక నిధులు కేటాయించి, విద్యాభివృద్ధికి పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ్, లోకేష్, నవీన్, చందు పాల్గొన్నారు.

తెల్లం పరివార్ సమ్మేళనం విజయవంతం చేయండి

నవతెలంగాణ-చర్ల

ఈ నెల 30, 31 తేదీలలో మండల పరిధిలోని దేవరపల్లిలో నిర్వహించే తెల్లం పరివార్ సమ్మేళనం విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. తెలంగాణ, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో నివసించే తెల్లం కుటుంబీకులు సామూహికంగా జరుపుకునే ఈ మహెూత్సవానికి ప్రతి ఒక్క తెల్లం పరివార్ హాజరవ్వాలని నిర్వాహకులు కోరారు. దేవరపల్లి గ్రామంలో నిర్వహించే ఈ మహెూత్సవంలో అందరూ భాగ్యస్వాములు కావాలని వారు తెలిపారు.

సింగరేణి కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ టీబీజీకేఎస్‌తోనే సాధ్యం



నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి కార్మికులంటే జాతి మేలి రత్నాలని, వారి కష్టాన్ని గుర్తించి, కంటికి రెప్పలా కాపాడి కడుపులో పెట్టుకున్న ఏకైక నాయకుడు కేసీఆర్ మాత్రమే అని ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. పీవీ కాలనీ ఏరియా జయ శంకర్ టీబీజీకేఎస్ కార్యాలయంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ మండల, టౌన్ కన్వీనర్‌లు కుర్రి నాగేశ్వర రావు, కుంట లక్ష్మణ్ హాజరుకాగా టీబీజీకేఎస్ సెంట్రల్, బ్రాంచి, ఫిట్ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున హాజరై జెండా ఆవిష్కరించారు. నేడు సింగరేణిలో కార్మికులు పొందుతున్న ప్రతి సంక్షేమం టీబీజీకేఎస్ హయంలో సాధించిందే అని తెలిపారు. అనంతరం కెక్ కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుర్రి నాగేశ్వర రావు, కుంట లక్ష్మణ్, ఇజ్రాయిల్, రామ చారి, బంగారి పవన్ కుమార్, ముకేశ్ కుమార్, సేవ, మురళీ కృష్ణ, ఇమ్రాన్, రెవన్, ఏడు కొండలు, సమర్పన్, మహేష్, లక్ష్మీనారాయణ, రాజేంద్ర ప్రసాద్, రమేష్ సుధాకర్, శంకరయ్య, బర్ల సురేష్, కె.శంకర్, రామారావు, హాబీబ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కరివేపాకు, మునగ మొక్కలు నాటాలి

మణుగూరు : ప్రతి అంగన్‌వాడీ కేంద్రం నందు కరివేపాకు, మునగ మొక్కలు నాటాలని వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి లక్ష్మణరావు మంగళవారం రైతు వేదిక నందు జరిగిన సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునగాకుతో చాలా ఉపయోగాలు ఉన్నాయని మునగాకు మనం తినే ఆహారం పప్పులో వేసుకోవచ్చని, మునగకాయలు సాంబార్‌కి ఉపయోగపడతాయని, కరివేపాకు తాలింపుకు ఉపయోగపడుతుందని వీటిని వాడటం ద్వారా శరీరం దృఢంగా తయారవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి రాహుల్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి హారిక, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- ఏటీఏ రాష్ట్ర అధ్యక్షులు జయ బాబు

దుమ్ముగూడెం : యూపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్ ఉత్తర్వులు జారీ చేయాలని ఏటీఏ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి జయ బాబు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం మరాయిగూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ నందు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి పూనెం రమేష్ ఆధ్వర్యంలో యూపీఎస్ జీవో ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జయబాబు మాట్లాడుతూ... ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగులపై బలవంతంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే సీపీఎస్ విధానాన్ని తీసుకువచ్చి ఉద్యోగస్తులకు తీవ్రమైన అన్యాయానికి గురి చేశారని అన్నారు. సీపీఎస్ విధానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగస్తులు అందరిని కూడా ఓపీఎస్ ఉద్యోగస్తులుగా ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర కోశాధికారి సోయం హనుమంతరావు, సోడి రాంబాబు, సోడి సత్యప్రసాద్, హిందు లత, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



నవతెలంగాణ-టేకులపల్లి

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య అన్నారు. మంగళవారం టేకులపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా ఎకరాకు రూ.12000 చొప్పున రైతుల అకౌంట్లలో మొదటి విడతగా రూ.6000 జమచేసిన సందర్భంగా ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, రైతు సోదరులందరికీ స్వీట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరం సురేందర్, మండల అధ్యక్షులు దేవా నాయక్, మండల నాయకులు ఇస్లావత్ రెడ్యా నాయక్, ఈది గణేష్, చందర్ సింగ్, పోశాలు, సర్దార్, బానోత్ రవి, భద్రు, ఈశ్వర్, మూడ్ గణేష్, మంగీలాల్, లక్ష్మయ్య, మచ్చా సుధాకర్, బండ్ల రజినీ, సరిత, తదితరులు పాల్గొన్నారు.



రోగులను కంటికి రెప్పలా కాపాడుకునే వైద్యురాలు దుర్గా భవాని

- వైద్య సిబ్బంది మధ్య విభేదాలు డాక్టర్ అమ్మను రోడ్డున పడేశాయా ?
- డాక్టర్ దుర్గ భవానికి సంఘీభావం తెలిపిన యువత, కాంగ్రెస్ పార్టీ పెద్దలు

నవతెలంగాణ-పినపాక

వైద్యో నారాయణో హరి అనే నానుడికి కట్టుబడి పినపాక ప్రాథమిక కేంద్రానికి చెందిన వైద్యుర్యాలు దుర్గాభవాని రోగుల నుండే కాక మండల యువత నుండి మంచి పేరు పొందారని పినపాక యువత, కాంగ్రెస్, సీపీఐ పార్టీ పెద్దలు అన్నారు. హాస్పిటల్స్ సిబ్బంది వైద్యురాలు దుర్గ భవానికి వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సందర్భంగా మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం, సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు మనోహర్, స్థానిక యువత సుమారు 50 మంది పినపాక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంలో ఆ ప్రాథమిక కేంద్రంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న వివాదాలపై ఆరా తీశారు. అనంతరం ఆ ప్రాథమిక కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. కుటుంబం అన్నాక అనేక సమస్యలు ఉంటాయని వాటిని అంతర్గతంగా పరిష్కరించుకోవాలి తప్ప ఇలా వీధికి ఎక్కడం తగదన్నారు. అనంతరం పలువురు గ్రామ యువకులు మాట్లాడుతూ పినపాక ప్రాథమిక కేంద్రం వైద్యురాలు దుర్గా భవాని నిస్వార్థంగా సేవలు అందిస్తూ మండలంలో ఎన్నడూ లేని విధంగా రోగుల మన్ననలు పొందారన్నారు. ఎవరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తిన 24 గంటలు అందుబాటులో ఉంటున్న ప్రజా వైద్యురాలు దుర్గ భవాని అన్నారు. దుర్గ భవాని పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తిస్థాయిలో ఇక్కడ సిబ్బందిపై దర్యాప్తు చేయాలన్నారు. అనంతరం పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన విచారణ అధికారి దృష్టికి పలు విషయాలు తీసుకెళ్లారు. ఇటువంటి డాక్టర్ మండలానికి దూరం చేస్తే ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో పినపాక యువత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశాల రామనాథం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో మాణిక్యం గొంగడి త్రిష..!

- క్రికెట్‌లో సత్తా చాటుతున్న భద్రాచలం వాసి
- సెంచరీతో ప్రపంచ రికార్డు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం పేరు మరోసారి క్రీడా ప్రపంచంలో మారుమోగుతుంది. మన్యం ముద్దుబిడ్డ గొంగడి త్రిష క్రీడా ప్రతిభకు మైదానంలోని ప్రేక్షకుల చప్పట్లతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానుల హర్ష రేక్కలతో మువ్వెంల జెండా రెపరెపలాడింది. భద్రాచలం పట్టణానికి చెందిన జిమ్ ట్రైనర్ గొంగడి రామిరెడ్డి ఏకైక కుమార్తె అయిన త్రిష తన అసమాన ప్రతిభతో ప్రపంచ క్రీడాభిమానుల మనసు దోచుకుని భద్రాచలం మన్యం ప్రతిష్టను ప్రపంచానికి తెలిసే విధంగా తన బ్యాటుతో 53 బంతుల్లోనే 100 పరుగులు చేసి అతివేగంగా సెంచరీ చేసిన మహిళా క్రికెటర్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పి భద్రాచలం కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి తెలిసే విధంగా సత్తా చాటింది. మలేషియాలోని కొలంపూర్ మైదానంలో జరుగుతున్న అండర్-19 మహిళా ప్రపంచ క్రికెట్ పోటీలలో మంగళవారం స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా మొదట బ్యాటింగ్‌కి దిగిన భారత జట్టులో ఓపెనర్‌గా బరిలో దిగిన గొంగడి త్రిష ప్రారంభం నుండే ప్రత్యర్థులపై బౌండరీలతో విరుచుకుపడుతూ కేవలం 53 బంతుల్లోనే 100 పరుగులు చేసి ప్రపంచ రికార్డును నెలకొంది. టీ 20 మహిళా క్రికెట్ చరిత్రలోనే అతివేగంగా సెంచరీ సాధించిన త్రిష 12 ఫోర్లు 4 సిక్సర్లుతో ప్రత్యర్థుల గుండెల్లో పరుగులు భయం పుట్టేలా తన బ్యాటింగ్ విన్యాసాన్ని ప్రదర్శించింది. భారత్ చేసిన 208 పరుగులలో 110 పరుగులు త్రిష సాధించడం విశేషం.

మన్నెంలో పుట్టిన మాణిక్యం త్రిష

ఏజెన్సీ కేంద్రమైన భద్రాచలంలో జన్మించిన త్రిష చిన్ననాటి నుండి క్రికెట్ పై తన తండ్రికి ఉన్న మక్కువని తన లక్ష్యంగా చేసుకొని అంచెలంచెలుగా ఎదుగుతూ భారత జట్టుకి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగింది. భద్రాచలంలోనే ప్రాథమిక విద్యను అభ్యసించిన త్రిష పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలోనే క్రికెట్ వోనమాలు నేర్చుకొని ప్రపంచరికార్డును నెలకొల్పే స్థాయికి ఎదిగింది. త్రిష తన అసమాన ప్రతిభతో క్రీడా లోకాన్ని ఆకర్షించి అతి తక్కువ సమయంలోనే అండర్-19 ప్రపంచ కప్‌లో ఆడే జట్టులో స్థానాన్ని సాధించింది.

తండ్రి కల నెరవేర్చిన తనయ

క్రికెటర్ కావాలని కలలు కన్నా గొంగడి రామిరెడ్డి తన కళ నెరవేరినప్పటికీ భద్రాచలం పట్టణంలో జిమ్ ఏర్పాటు చేయడంతో పాటు ఐటీసీ బిపిఎల్‌కి ఫిట్నెస్ ట్రైనర్‌గా విధులు నిర్వహించారు. తన తండ్రి కలలను నెరవేర్చాలని చిన్న వయసులోనే నిర్ణయించుకున్న త్రిష క్రికెట్ ఏ ప్రపంచంగా పెరుగుతూ చిన్న వయసులోనే క్రికెట్‌లో ప్రతిభ చూపింది. కూతురి క్రీడ ప్రతిభను గుర్తించిన తండ్రి ఎలాగైనా తన కూతుర్ని క్రీడా ప్రపంచంలో ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లాలని లక్ష్యంతో ఐటిసి ఫిట్నెస్ ట్రైనర్ కొలువుకి రాజీనామా చేయడంతో పాటు భద్రాచలంలోని జిమ్ సెంటర్‌ను కూడా అమ్మేసి సికింద్రాబాద్‌కి మకామ్ మార్చి 2013 లోనే సికింద్రాబాద్‌లోని జాన్స్ క్రికెట్ అకాడమీలో చేర్పించి క్రీడాకారిణిగా తయారు చేశారు. 12 ఏళ్ల వయసులోనే అండర్-19 జట్టుకి ఎంపికైన త్రిష లెగ్ స్పిన్‌తో పాటు తన బ్యాటుతో సత్తా చాటుతూ క్రికెట్ ప్రపంచాన్ని ఆకర్షించింది.

త్రిషకు అభినందన ర్యాలీ

స్కాట్లాండ్ పై 53 బంతుల్లోనే 100 పరుగులు చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పిన భద్రాచలం క్రీడా కారిని త్రిషకు అభినందనలు తెలియజేస్తూ నెహ్రూ కప్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేతపట్టి భారత్ మాతాకీ జై నినాదాలతో పాటు భద్రాచలం క్రీడాకారిణి త్రిషకు అభినందనలు తెలియజేస్తూ పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో నెహ్రూ నిర్వాహకులు తోటమల్ల బాలయోగి నేతృత్వం వహించగా పట్టణ పుర ప్రముఖులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. త్రిష ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం త్రిషను క్రీడా ఐకాన్‌గా గుర్తిస్తూ 2023లో జరిగిన ఎన్నికల సందర్భంలో జిల్లా ఎన్నికల ప్రచారకర్తగా పార్లమెంటింగ్ ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రచారకర్తగా నియమించి త్రిషకు గుర్తింపునిచ్చింది. చిన్న వయసులోనే అసమాన ప్రతిభను చూపిస్తూ మన్నెంలో పుట్టి క్రికెట్ ప్రపంచంలో సత్తా చాటుతున్న త్రిష మరెన్నో విజయాలు సాధించాలని భద్రాచల వాసులు ఆకాంక్షిస్తున్నారు.



ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ కార్యాలయాన్ని సందర్శించిన కోదండరాం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

పట్టణంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ ఎదురుగా ఉన్న ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ కమిటీ కార్యాలయమును ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మొదటి తరం తెలంగాణ పోరాట యోధులు తిప్పన సిద్ధులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు ఈ ఇరువురిని సాదరంగా ఆహ్వానం పలికి ప్రొఫెసర్ కోదండరాంకి పుష్పగుచ్ఛమిచ్చి పూలదండలతో శాలువాతో సత్కరించి కార్యాలయమునకు స్థలము ఇప్పించవలసినదిగా కోరారు. నిర్మాణమునకు కూడా ప్రభుత్వం దృష్టికి మా సమస్యని తీసుకొని వెళ్లి భవన నిర్మాణము అయ్యేటట్లుగా చూడవలసినదిగా కోరుతూ మెమోరాండమును అందజేశారు. అలాగే విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ని కూడా ఉచిత రీతిన పుష్పగుచ్ఛమిచ్చి పూలదండ, శాలువాతో సత్కరించారు. అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వారు మా కార్యాలయాన్ని సందర్శించటం చాలా ఆనందదాయకమన్నారు. దాదాపు 850 మంది సభ్యత్వం కలిగిన అతి పెద్ద సంఘంగా ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉందని ఈ కార్యాలయంలో కూర్చోనుటకు, సమావేశాలకు ఈ అద్దె భవనము సరిపోవటం లేదని, దయతో మీరు మా విశ్రాంత ఉద్యోగులకు కూర్చొని మా సమస్యల పరిష్కారానికి, మా సంఘం స్వచ్ఛంద సేవలను చేస్తుందని మా కార్యాలయంలో ప్రతినెల ఉచిత నేత్ర వైద్య శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. అలాగే శ్రీరామనవమి, ముక్కోటి తదితర పట్టణంలో జరిగే అనేక సేవా కార్యక్రమాలను చేపడుతుందని, కావునా మా సమస్య పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ఈ కార్యాలయమును పరిశీలించానని కనీసం 40 మంది కూడా కూర్చునుటకు ఇబ్బందిగా ఉన్నదని గ్రహించామని మీ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎల్.వి.ప్రసాద్, కోశాధికారి డి.కృష్ణమూర్తి, మాదిరెడ్డి రామ్మోహనరావు, ఉపాధ్యక్షుడు సుబ్బయ్య చౌదరి, ఎస్.రాజబాబు, మురళీకృష్ణ, ఐలయ్య, విష్ణు, మొలకల సుబ్రహ్మణ్యం, విష్ణు మొలకల బదరీనాథ్, రమణ రావు, రవన్న, నాగరాజు, నరసింహారావు, నాగేశ్వరరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ తహసీల్దార్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రజలకు అందించిన విశేష సేవలకు గాను రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం అందుకున్న తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్‌ను మంగళవారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆయనకు పూల బొకేలు అందజేసి శాలువాతో సత్కరించారు. దుమ్ముగూడెం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్యను తన సమస్యగా భావించి ప్రజా సేవే పరమావధిగా నిరంతరం ఆయన చేస్తున్న విధులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ తహసీల్దార్‌గా ఎంపిక చేసి ప్రశంసా పత్రం అందజేయడం అభినందనీయమని కొనియాడారు. తహసీల్దార్‌ను సన్మానించిన వారిలో మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు పూదోట సూరిబాబు, సంఘం నాయకులు కనుబుద్ది దేవా, జూలకంటి సుధాకర్, బైరెడ్డి అరవింద్, లంక రమేష్ తదితరులు ఉన్నారు.

విద్యా లక్ష్యాలను విస్మరించిన పాలకులు

- భద్రాచలంలో 4, 5తేదీలలో జరిగే రాష్ట్ర జనరల్ కౌన్సిల్ పోస్టర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

విద్యారంగ బలోపేతం కోసం పాలకులు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఫిబ్రవరి 4, 5 తేదీలలో బత్తుల నగర్ శుభం ఫంక్షన్ హాల్ భద్రాచలం పట్టణంలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ జయప్రదం చేయాలని రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు నామాల ఆజాద్, కాంపాటి పృథ్వీ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నటువంటి విద్యార్థి వ్యతిరేక విధానాలపై జరిగే రాష్ట్ర జనరల్ కౌన్సిల్ లో తీర్మానాలు చేసుకొని తీర్మానాల వెలుగులో భవిష్యత్తు కార్యాచరణ తీసుకొని గత ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్ విద్యార్థులకు ఉద్యమ బలోపేతం కోసం కృషి చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ భద్రాచలం డివిజన్ కార్యదర్శి శివ ప్రశాంత్, నాయకులు నరసింహారావు, సంధ్య, శృతి, అనూష, బాలకృష్ణ, సాయి, వర్ధన్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్తావరం పై పోలీసుల దాడి

నవతెలంగాణ-చంద్రుగొండ

పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను మంగళవారం పట్టుకున్నారు. తిప్పనపల్లి గ్రామ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు దాడులు జరిపారు. రూ.5160 నగదు, 3 సెల్ ఫోన్లు, మూడు బైకులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై శివరామకృష్ణ చెప్పారు. పేకాట, కోడిపందెలు నిర్వహించడం నేరమని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మీడియాకు సమాచారం ఇవ్వడంలో అధికారులు విఫలం

నవతెలంగాణ-అశ్వాపురం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మండలంలో మంగళవారం చేపట్టిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటనకు సంబంధించిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పంచాయతీరాజ్ అధికారులు గాని, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ విషయంలో రెవెన్యూ అధికారులు మీడియాకు సమాచారం ఇవ్వకుండానే కార్యక్రమాలు చేపట్టడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం చేస్తున్న పనులను మీడియా, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రభుత్వానికి మేలు చేకూరేలా వ్యవహరించాల్సిన అధికారులు పత్రికలకు, ఛానళ్లకు సమాచారం ఇవ్వకపోవడంతో ప్రభుత్వం మంచి చేసిన అది ప్రజల్లోకి వెళ్లడం లేదని అనేకమంది అంటున్నారు. సాక్షాత్తు నియోజకవర్గ ఎమ్మెల్యే చేపట్టిన కార్యక్రమాలకే అధికారులు సమాచారం ఇవ్వకుండా ఇష్టాను సారంగా వ్యవరించడంపై పాత్రికేయులు సైతం వార్తా సేకరణ విషయంలో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల పట్ల మీడియాకు సమాచారం అందించి ప్రజలకు తెలిసేలా ప్రచారాలు చేసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు నాలుగు లైన్ల రోడ్డు ఏర్పాటుకు కృషి

- మండలానికి సీతారామ ప్రాజెక్టు నీళ్లు అందించాలి
- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



నవతెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని సారపాక పట్టణం నుండి ఏటూరు నాగారం వరకు ఉన్న రహదారి నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రమాదాలు నివారణకు నాలుగు లైన్ల రహదారి ఏర్పాటుకు ప్రభుత్వ మంత్రులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని టీజేఎస్ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. మంగళవారం సారపాక పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 26 నుండి అమలు చేసిన నాలుగు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు కావాలని ఆయన అన్నారు. అందుకు పూర్తి సహకారం ఇస్తామన్నారు. సాదా బైనామ, అటవీ భూములపై కూడా త్వరలో పట్టాలు అందించాలని సంబంధిత శాఖ మంత్రిని కలిసి వినతి పత్రం అందిస్తామన్నారు. భద్రాచలంలో ఐదు గ్రామపంచాయతీలు కలిపేందుకు పలు మార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడటం జరిగిందని, తిరిగి మళ్లీ ప్రభుత్వంతో చర్చలు జరుపుతామన్నారు. సీతారామ ప్రాజెక్టు నుండి విడుదలయ్యే నీళ్లు బుర్గంపాడు మండలానికి అందించేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు. ఐటీసీ ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో తన మద్దతు ఐఎన్టీయూసీ యూనియన్‌అను కుంటుందన్నారు. పోలవరం ముంపు వలన అటు భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరులోని ప్రాంతాలు ముంపుకు గురి కాకుండా చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వంతో సంప్రదిస్తామన్నారు. గోదారి ముంపు పై శాశ్వత పరిష్కారం చూపించేందుకు తన గొంతును వినిపిస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో పలు సమస్యలను తన మిత్ర బృందంతో నివేదిక తయారు చేయించి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకులు తిప్పన సిద్దులు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు మారం వెంకటేశ్వర రెడ్డి, టీజేఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మూల నాగిరెడ్డి, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటన



నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామంలో గల కస్తూర్బా పాఠశాలలో మంగళవారం జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు జరిగే క్షేత్ర పర్యటనలను జిల్లా సైన్సు అధికారి చలపతి రావు ప్రారంభించి మాట్లాడారు. మూడు రోజులు పాటు జరిగే ప్రత్యేక క్యాంపులో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల విద్యార్థినీలకు క్షేత్ర పర్యటనకు తీసుక వెళ్ళి నేల భూసారం, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. క్షేత్ర పర్యటన కోసం 8, 9 తరగతులకు చెందిన 50 మంది విద్యార్థినీలను ఎంపిక చేశారు. క్షేత్ర పర్యటనలకు వెళ్లే విద్యార్థినులకు ముందుగా గ్రీన్ కార్ప్ కిట్స్ అందజేశారు. అటవీ శాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్న నర్సరీని, దుమ్ముగూడెం హైడల్ ప్రాజెక్టుని స్వీయ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీలకు గ్రీన్ కార్ప్ కిట్స్ అందజేశారు. అనంతరం అటవి శాఖ నర్సరీ సందర్శించారు. ఈ కార్యక్రమంలో జాతీయ గ్రీన్ కార్ప్ రాష్ట్ర కోఆర్డినేటర్ రాజశేఖర్, దుమ్ముగూడెం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.వి.రామారావు, కస్తూర్బా పాఠశాల ఎస్ఓ శోభారాణి, గైడ్ టీచర్స్ తోటమళ్ళ సురేష్ బాబు, ఏ.జే.ప్రభాకర్, బి.శ్రీనివాస్, టి.శ్రీనివాస్, డి.సుజాత, ఎస్.దుర్గ ఆయా పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థినీలు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల కోసం ముఖాముఖి

నవతెలంగాణ-ఇల్లందు

జీఎం వి.కృష్ణయ్య ఆదేశాల మేరకు కారుణ్య నియామకాల కోసం మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు కార్యాలయంలో మంగళవారం ముఖాముఖీ (ఇంటర్వ్యూ) నిర్వహించారు. ఈ సందర్భంగా యస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇల్లందు సెక్యూరిటీ, సివిల్ డిపార్టుమెంటుల నుండి కారుణ్య నియామకాల కోసం మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు వారి కుటుంబ సభ్యుల, సాక్షుల సమక్షంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించి అన్నివివరాలు నమోదు చేయడమైనదని, ఇంటర్వ్యూలు పూర్తి అయిన తరువాత అందరిని వైద్యపరీక్షల కోసం పంపించి తరువాత నియామక ఉత్తర్వులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) జి.వి.మోహన్ రావు, డీజీఎం (సివిల్) రవి కుమార్, ఏరియా సెక్యూరిటీ అధికారి అంజి రెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్, సాయి స్వరూప్, క్లార్క్ రామకృష్ణ, అపర్ణ, సింధు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
8
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | జనవరి 29, 2025 | www.navatelangana.com

రాష్ట్ర కమిటీ సభ్యులుగా తిరిగి ఎన్నికైన మచ్చ, కనకయ్య, ఏజేలు

- పలువురి అభినందనలు



నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లాలో ఈ నెల 25 నుండి 28వ తేదీ వరకు జరిగిన సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలలో మన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి రాష్ట్ర కమిటీ కమిటీ సభ్యులుగా పలువురు నాయకులు ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా తిరిగి ఎన్నికైన మచ్చ వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, ఏజె రమేష్‌లు మరోమారు ఎన్నికైన వారికి పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నేతలు అభినందనలు తెలిపారు.

వరల్డ్ రికార్డ్ సృష్టించిన తెలుగమ్మాయి గొంగడి త్రిష

- అభినందనలు తెలిపిన సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆదివాసీ ముద్దుబిడ్డ గొంగడి త్రిష మహిళ క్రికెట్ రంగంలో అరుదైన రికార్డు సాధించడం పట్ల సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. మలేషియా రాజధాని కౌలాలంపూర్లో జరుగుతున్న అండర్-19 మహిళల టీ20 వరల్డ్ కప్‌లో చరిత్రలోనే తొలి సెంచరీ సాధించిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించడం గర్వకారణమన్నారు. తెలంగాణలోని భద్రాచలంకు చెందిన తెలుగమ్మాయి గొంగడి త్రిష. మొత్తం 59 బంతులు ఎదుర్కొని 13 ఫోర్లు, 4 సిక్సులతో అజేయంగా నిలిచి, 110- పరుగులు సాధించడం జిల్లా ప్రజలకు ఎంతో గర్వకారణమన్నారు. త్రిష క్రీడారంగంలో మరన్ని విజయాలు సాధించాలని పార్టీ జిల్లా కమిటీ తరుపున ఆకాంక్షించారు.



కన్నుల పండుగగా నవభారత్ పాఠశాల వార్షికోత్సవం

నవతెలంగాణ-పాల్వంచ

పట్టణ పరిధిలోని నవభారత్ పాఠశాల 45వ వార్షికోత్సవ వేడుకలు స్థానిక నవనగర్‌లోని నవకళా భారతిలో సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ నవ కళోత్సవ్‌కు డైరెక్టర్, రీసెర్చ్ డెవలప్మెంట్ సెల్ జేఎన్‌టీయూ ప్రొఫెసర్, వి.కామాక్షి ప్రసాద్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తదుపరి పాఠశాల కరెస్పాండంట్ ఎం.జీ.ఎం.ప్రసాద్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. ప్రిన్సిపల్ యం.వి శ్రీనివాస్ రెడ్డి పాఠశాల వార్షిక నివేదికను సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ భద్రాచలం రాముడు పుణ్య క్షేత్రంకి సమీపంలో ఉన్న ఈ పాఠశాల ఈ జిల్లా కే పరిమితం కాకుండా ఈ పాఠశాల విద్యార్థుల ప్రతిభ పాటవలు జాతీయ స్థాయికి పరిచయం చేశారని, ముఖ్యంగా విద్యార్థి పాఠశాల వయసులో విద్యతో పాటు నైతిక విలువలు, స్వీయ క్రమశిక్షణ ముఖ్యం అన్నారు. 1800 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాల విద్యార్థులను ప్రపంచానికి ధీటుగా తయారు చేస్తున్న నవభరత్ పాఠశాల ఉపాధ్యాయ బృందంని ప్రశంసించారు. తదుపరి చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా భూమాత ధరవాహిక, దేశభక్తి నృత్యం, సీనియర్ బాలికలు ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్దులను చేశాయి. బోర్డు పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నవభారత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.జ్యోతి పాల్గొన్నారు. పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ఎ.శ్రీదేవి సమన్వయకర్తగా వ్యవహరించారు.

హెల్త్ కార్డు తీసుకోని మాజీ ఉద్యోగులకు మరో సదావకాశం



నవతెలంగాణ-ఇల్లందు

పనిచేసి పదవి విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు సీపీఆర్ఎంఎస్ (హెల్త్ కార్డు) ఇంకా తీసుకోని మాజీ ఉద్యోగులకు సింగరేణి సంస్థ చివరి అవకాశం కల్పించిందని జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్య తెలిపారు. కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం 10వ వేజ్ బోర్డు లేదా అంతకముందు వేజ్ బోర్డులలో పదవి విరమణ పొందిన ఉద్యోగులకు కూడా ఈ అవకాశం పొందడానికి అర్హులని తెలిపారు. కావునా సీపీఆర్ఎంఎస్ అభ్యర్థిత్వం పొందుట కోసం రూ.60,000 చెల్లించి, సీపీఆర్ఎంఎస్ (హెల్త్ కార్డు) కోసం ధరఖాస్తు చేసుకోవాలని, ఏదైనా కారణాల వలన ధరఖాస్తు చేసుకొనని వారికి సింగరేణి యాజమాన్యం మరొక చివరి అవకాశం కల్పించిదని తెలిపారు. ఈ నెల 31 లోపు ఉపయోగించుకొనగలరని తెలిపారు.



తోర్తి జాన్‌కు సన్మానం

నవతెలంగాణ-ఇల్లందు

76వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్గా కలెక్టర్ జితిల్ వి.పాటిల్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్న తోర్తి జాన్ దంపతులను అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అందరూ కలిసి పుష్పగుచ్చాలు, పట్టు వస్త్రాలు, శాలువాతో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామలింగేశ్వర మాట్లాడుతూ 2018లో రొంపేడులోను, చర్చి రొంపేడులోను, 2019 హనుమంతలపాడులోనూ సుదిమళ్ళలోను, 2020 మోదుగుల గుడిలోనూ బొజ్జయిగూడెంలోని ప్రత్యేక శీతాకాల శిబిరం ద్వారా చేసినటువంటి ఎయిడ్స్ ర్యాలీలు, ఇంకుడు గుత్తల నిర్మాణం, హరితహారం ప్రోగ్రాం, టాయిలెట్స్ లేని వృద్ధులకు వారి పాత ఇటుకలతో అప్పటి ఎంపీడీవో సూచనల మేరకు మర్రిగూడెంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సహకారంతో టాయిలెట్స్ నిర్మించినట్టు తెలిపారు. తదితర కార్యక్రమాలను నిర్వహించి ఎన్ఎస్ఎస్ అంటేనే జాను జాను ఎన్ఎస్ఎస్ అని రీతిలో సేవ చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నీరజ, భాను ప్రసాద్ సోమేశ్వరరావు, ఉమా శంకర్, జగదీశ్వర్, వీరభద్రం రఘు, శైలజ, జగన్, వేణుగోపాల్, విలియం ప్రసాద్, రజిని, వెంకట్, ఉమామహేశ్వరి కవిత, సత్యనారాయణ, చైతన్య, మంజుల, పరిమిత బాలాజీ, భూపాల్, తదితరులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-పాల్వంచ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచలో ఖాళీగా ఉన్నటువంటి జువాలజీ, ఎకనామిక్స్ సబ్జెక్టులకు అతిథి అధ్యాపకుల ఎంపిక కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.పద్మ ఒక ప్రకటనలో తెలియజేశారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ పాస్ అయి ఉండాలి, తప్పనిసరిగా నెట్, సెట్ లేదా పీహెచ్డీ గాని కలిగి ఉంటే వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలియజేశారు. ఈ నెల 31వ తేదీన జరిగేటువంటి ఇంటర్వ్యూలకు నేరుగా బయోడేటాతో హాజరు కాగలరు మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ : 92478 64403 సంప్రదించగలరని తెలిపారు.

అశ్వారావుపేట మున్సిపాల్టీకి ముగ్గురు అధికారులు నియామకం

నవతెలంగాణ-అశ్వారావుపేట

అశ్వారావుపేట మున్సిపాల్టీకి కమిషనర్‌తో పాటు పరిపాలనా విభాగానికి మరో ముగ్గురు అధికారులను నియమించారు. కమిషనర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నవీన్ కుమార్, ఏఈ రాము, జేఏఓ కిరణ్ కుమార్‌లు విధుల్లో చేరారు. దీంతో అశ్వారావుపేటలో మున్సిపాల్టీ పరిపాలన ప్రారంభం అయింది.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- చదువులో వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలి
- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్



నవతెలంగాణ-పినపాక

మెనూ ప్రకార భోజనం అందించాలని, చదువులో వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ అన్నారు. మంగళవారం మండలంలోని మినీ గురుకులంను ఆయన సందర్శించారు. చిన్నారుల విద్యా బోధన నైపుణ్యాలను ఆయన ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గిరిజన పిల్లల విద్యాభ్యాసం మెరుగుపడి వారి భవిష్యత్తు బాగుపడాలంటే తప్పనిసరిగా మినీ గురుకులం ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీలు, ప్రత్యేక దృష్టి సారించి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించేలా శ్రద్ధ చూపాలన్నారు. చదువులో వెనుక పడ్డ పిల్లలను గుర్తించి వారికి సపరేట్‌గా ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీలు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, సంక్రాంతి పండుగకు ఇండ్లకు వెళ్లిన పిల్లలందరినీ పాఠశాలలకు వచ్చేలా ప్రిన్సిపాల్ చొరవ చూపాలన్నారు. రాష్ట్రంలోని వివిధ సంక్షేమ వసతి గృహాలలో ఫుడ్ పాయిజన్ అవుతుందని అనేక కథనాలు వస్తున్నందున మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ, ప్రజా ప్రతినిధులు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నందున నాణ్యతగా ఉన్న సామన్లు, తాజా కూరగాయలు మాత్రమే తీసువాలన్నారు. పిల్లలకు వంట చేసిన ఆహార పదార్థాలను ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రిన్సిపల్, డిప్యూటీ ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీలు ఇద్దరు చొప్పున భోజనాలు చేసిన తర్వాతనే విద్యార్థులకు పెట్టాలన్నారు. ప్రతిరోజు వంటగది, పరిసరాలు శుభ్రంగా ఉండాలని, వంట సామన్లు జిడ్డు లేకుండా సిబ్బందితో కడిగించాలన్నారు. ఎవరైనా అస్వస్థతకు గురి అయితే వెంటనే వైద్య పరీక్షలు చేయించాలని, ఎవరైనా సీరియస్‌గా ఉంటే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకొని రావాలన్నారు. ఏఎస్ఎం 24 గంటలు తప్పనిసరిగా సంబంధిత ఇన్స్టిట్యూషన్లలో అందుబాటులో ఉండాలన్నారు. సాయంత్రం స్టడీ అవర్స్‌కు తప్పనిసరిగా ముగ్గురు ఫ్యాకల్టీలు చదివిస్తూ పిల్లలు చదువుతున్నది, లేనిది గమనిస్తూ ఉండి పిల్లలకు చదివించాలని అన్నారు. అలాగే 15 రోజులకు ఒకసారి మంచినీటి ట్యాంకులు శుభ్రంగా ఉండేలా చూడాలని, పిల్లలకు ఎప్పటికప్పుడు వేడివేడి ఆహారాన్ని వడ్డించాలని, నిల్వ ఉన్న ఆహారాన్ని పిల్లల దరికి చేరకుండా చూడాలన్నారు. అనంతరం ప్రత్యేక అధికారి స్టోర్ రూమ్ వంటగది పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్, ప్రత్యేక అధికారి డేవిడ్ రాజ్, మినీ గురుకులం కళాశాల ప్రిన్సిపాల్ శకుంతల, ఫ్యాకల్టీలు తదితరులు పాల్గొన్నారు.





ఎస్పీ చేతుల మీదుగా బెస్ట్ రైటర్ అవార్డు అందుకున్న హెడ్ కానిస్టేబుల్

నవతెలంగాణ-పినపాక

పినపాక మండలం ఈ బయ్యారం పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గద్దల లక్ష్మీనారాయణ ఉత్తమ రైటర్‌గా ఎస్పీ చేతుల మీదుగా అవార్డు, ప్రశంస పత్రం అందుకున్నారు. గతంలో మణుగూరులో విధులు నిర్వహిస్తున్నప్పుడు సైతం ప్రజలందరికీ ఫ్రెండ్లీ పోలీస్‌గా ఉంటూ తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. పినపాకలో సైతం అదే పేరు కొనసాగిస్తూ జిల్లా ఎస్పీ చేతుల మీదుగా బెస్ట్ రైటర్ అవార్డు అందుకున్నారు. లక్ష్మీనారాయణను స్టేషన్ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యాంకులు సరైన భద్రతను ఏర్పాటు చేసుకోవాలి

- అధికారులతో ఎస్పీ సమావేశం



నవతెలంగాణ-కొత్తగూడెం

జిల్లాలోని అన్ని బ్యాంకులు సరైన భద్రతను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. మంగళవారం జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులతో ఎస్పీ సమావేశమయ్యారు. ఇటీవల వరంగల్, బీదర్ ప్రాంతాలలో బ్యాంకులలో జరిగిన దొంగతనాలను ఉద్దేశించి, అలాంటి సంఘటనలు జిల్లాలో జరగకుండా బ్యాంకు అధికారులు తమ తమ బ్యాంకులకు సంబంధించి పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్యాంకుల లోపల, వెలుపల అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్యాంకులలో ఉండే సెక్యూరిటీ అలారం ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏటీఎంలలో నగదును లోడ్ చేసేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని సూచించారు. సామాజిక బాధ్యతలో భాగంగా సైబర్ క్రైమ్స్‌పై బ్యాంకుల తరపునుండి కూడా జిల్లా ప్రజలకు నిత్యం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందులో భాగంగా కరపత్రాలను, పోస్టర్లను తయారుచేసి ముఖ్యమైన ప్రదేశాల్లో అతికించాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడి నగదును కోల్పోయిన బాధితులకు నేరగాళ్ల అకౌంట్లలో ఫ్రీజ్ చేయబడిన నగదును త్వరితగతిన వారికి అందేలా పోలీస్ శాఖతో సమన్వయం పాటిస్తూ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఇన్సూరెన్స్ స్కీములకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించి వారు జీవిత బీమాలు చేసుకునే విధంగా ప్రచారం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్, ఇల్లందు డీఎస్పీ చంద్రభాను, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఎస్బి ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సైబర్ క్రైమ్స్ ఇన్‌స్పెక్టర్ జితేందర్, జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యతతో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి

- వర్షాకాలానికి ముందే ప్రజలకు వాడుకలోకి తేవాలి
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-అశ్వాపురం

ఇసుక వాగు పై నిర్మాణం చేపడుతున్న బ్రిడ్జి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన బ్రిడ్జి పనులు జరుగుతున్న వద్దకు వెళ్లి నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ వర్షాకాలానికి ముందే నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు వాడుకలోకి తీసుకువచ్చేలా అధికారులు, కాంట్రాక్టర్ పనులలో మరింత వేగం పెంచాలన్నారు. అనంతరం అక్కడి నుండి గొంది గూడెం గ్రామంలో ఎన్ఆర్ ఈజీఎస్ ద్వారా మంజూరైన రెండు సిమెంటు రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా ఇటీవల నిర్మాణం చేపట్టిన మరో రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు.

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల పక్షాన ఉంటూ వారి సంక్షేమం కోసం అనేక పథకాలు తీసుకొచ్చి అర్హులకు ఇచ్చేందుకే పని చేస్తోందని ఎమ్మెల్యే పాయం అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు మంజూరైన రూ.లక్ష 116 చొప్పున 34 మందికి చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన సహాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాలలో తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో వరప్రసాద్, ఎంపీఓ ముత్యాలరావు, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్ రెడ్డి, పంచాయతీరాజ్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత, గాదే కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, బుర్రెడ్డి వెంకటరెడ్డి, ఎస్కే ఖదీర్, కమటం నరేష్, ఆవుల రవి పాల్గొన్నారు.



ఐఎన్‌టీయూసీ గెలుపుతోనే కార్మికులకు న్యాయం

- ఎమ్మెల్సీ, తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ-బూర్గంపాడు

జాతీయస్థాయిలో బలమైన కార్మిక సంఘంగా ఉన్న ఐఎన్‌టీయూసీ ఐటీసీలు గుర్తింపు కార్మిక సంఘంగా గెలిపిస్తే కార్మికులకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందని శాసన మండలి సభ్యులు, తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నా రు. మంగళవారం రాత్రి మండలంలోని సారపాక ఐటీసీ ప్రధాన గేటు ఎదురుగా ఐఎన్‌టీయూసీ, మిత్రపక్షాల జనరల్ బాడీ బహిరంగ సభ అధ్యక్ష, కార్యదర్శులు యారం పిచ్చిరెడ్డి, గోనె రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో కోదండరాం మాట్లాడారు. ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే మార్పు కావాలి...ఐఎన్టియుసీ రావాలని ఆయన అన్నారు. ఐటీసీ కర్మాగారంలో కార్మికులకు సంక్షేమం, భద్రత, వేతనం ఐఎన్టియుసితోనే సాధ్యం అవుతుందని ఆయన అన్నారు.

అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఐఎన్టియుసి గెలుపుతోనే కార్మికులకు మేలు కలుగు తుందన్నారు. మంచి వేతన ఒప్పందం కార్మికులకు ఉద్యోగ భద్రత, కార్మిక సంక్షేమం జరగా లంటే ఈనెల 31 జరిగే ఎన్నికల్లో తప్పకుండా భారీ మెజార్టీతో ఐఎన్టియుసి మిత్రపక్షాల యూనియన్ గెలిపించాలని ఆయన అన్నారు. కార్మికుల అనేక సమస్యల పరిష్క రించేందుకు తాను ఎమ్మెల్యేగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐఎన్టీయుసీ, మిత్రపక్షాల మేనిఫె స్టోను కోదండరాం, ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయుసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మారం వెంకటేశ్వర రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి ఛైర్మెన్ జనక్ ప్రసాద్, చిన్న తరహాల పరిశ్రమల సీఐఐ మాజీ చైర్మన్ ఉడుముల లక్ష్మీనారాయణ రెడ్డి, ఐటీసీ ఐఎన్టియుసి అధ్యక్ష, కార్యదర్శులు యారం పిచ్చిరెడ్డి, గోనే రామా రావు, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బర్ల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

గిరి బిడ్డలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- టీజేఎస్ వ్యవస్థాపకులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గిరి బిడ్డలు చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఆకాంక్షించారు. మంగళవారం భద్రాచలం విచ్చేసిన ఆయన గిరిజన బీఈడీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మమేకమై మాట్లాడుతూ... దేశంలోనే ఏకైక గిరిజన బీఈడీ కళాశాల భద్రాచలంలో ఉండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. చదువు ప్రాముఖ్యతను ఆయన విద్యార్థినీ, విద్యార్థులకు చక్కగా వివరించారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న మన దేశానికి చెందిన సుమారు 7 లక్షల మందిని వెనక్కి పంపించేందుకు అమెరికా ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. తక్కువ జీతంతో పని చేస్తున్న మన వారిని వెనక్కి పంపి అక్కడ యువతకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో ఆ ప్రభుత్వం ఇటువంటి నిర్ణయం తీసుకుందన్నారు. చదువుతూనే మన సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చదువుతూనే సంఘంలో గౌరవం పెరుగుతుందన్నారు. మీరు మీ గ్రామాలకు వెళ్లినప్పుడు ఖాళీ సమయంలో చుట్టుపక్కల ఉన్న విద్యార్థులకు చదువు నేర్పాలని కోరారు. అనంతరం విద్యార్థులు కళాశాలలో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన వెంటనే వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీరు నాయక్, ఉపాధ్యాయులు నవీన్, కిషోర్, బోధ నేతర సిబ్బంది, తెలంగాణ జన సమితి నాయకులు తిప్పన సిద్ధులు, రేపాక రామారావు గుప్తా, పూణేం ప్రదీప్ కుమార్, బి.దేవదానం, ఎం.నాగిరెడ్డి, కరుణాకర్ రెడ్డి, నబి సాహెబ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రావుల



నవతెలంగాణ-కరకగూడెం

మోసపూరిత పథకాలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో ప్రజలను మోసం చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రావుల సోమయ్య అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో రావుల సోమయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు పథకాలతో మండలంలోని ఒక గ్రామమును ఎంచుకొని కేవలం అర్హులైన రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వడాన్ని తీవ్రంగా విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎంతోమంది గిరిజన గిరిజనేతరులు, రైతులు పోడు భూములు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అలాంటి అర్హులైన రైతులకు రైతు భరోసా ఇవ్వకపోవడం ఇదెక్కడి న్యాయమని తెలిపారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి రైతుకు రైతుబంధుతో పాటు రైతు చనిపోతే రైతు బీమా ఇచ్చిందని అన్నారు. గిరిజనుల సమస్యలు చెప్పుకుందాం అనుకుంటే కనీసం గిరిజన శాఖ మంత్రి కూడా లేరని సూచించారు. అసలు గిరిజన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉండి ఏం చేస్తున్నారని మండిపడ్డారు. పంట పండించే ప్రతి ఒక్కరికి రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఆరు గ్యారంటీల తోపాటు 420 హామీలు ఇస్తామని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో పోగు వెంకటేశ్వర్లు, బుడగం రాము, ఊకె రామనాథం, బైరిశెట్టి చిరంజీవి, రావుల కనకయ్య, ఎస్డీ ఫజల్, గుడ్ల రంజిత్, చిట్టి మల్ల ప్రవీణ్, దాసరి సాంబయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ పై చర్యలు తీసుకోవాలి

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణ కోసం అలుపెరగని పోరాటం చేసిన ప్రజయుద్ధ నౌక గద్దర్‌పై వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ వెంటనే వెనక్కి తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. బీజేపీ భావజాలం ఉన్న వ్యక్తులకే కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇస్తుందన్నట్లుగా బండి సంజయ్ వ్యాఖ్యలు వున్నాయని, ఇది రాష్ట్రపతిని, ప్రధానమంత్రిని అవమానించడమే అన్నారు. కేంద్ర మంత్రి స్థాయిని మరిచి గద్దర్‌పై వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుండి రాష్ట్ర ప్రతి తొలగించాలని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

దమ్మపేట : ప్రజా గాయకుడు గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఆయన గద్దర్ కుటుంభ సభ్యులకు, వారి అభిమానులకు క్షమాపణలు చెప్పాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాక రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తక్షణమే తెలంగాణ ప్రజాకవి గద్దర్ పై చేసిన అనుచిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని తెలిపారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల పీవో ఆకస్మిక తనిఖీ

- పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : రాహుల్

నవతెలంగాణ-కరకగూడెం

మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సోమవారం ఐటీడీఏ పీవో రాహుల్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఉపాధ్యాయులతో పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు హాజర్ శాతాన్ని, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 లక్షల రూపాయలతో డైనింగ్ హాల్ నిర్మాణం చేపడతామని, ఐదు లక్షల అంచనా వ్యయంతో మరుగుదొడ్లు టాయిలెట్ల నిర్మాణం చేపడతామని అయినా అన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆయన కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సరళమైన పద్ధతిలో ఐటీడీఏ వారి అందించే పుస్తకాలను అర్థమయ్యే విధంగా చెప్పాలని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు స్థానికంగా ఉండాలని సబ్జెక్టు ఉపాధ్యాయులు స్టడీ అవర్స్ కు ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని లేనియెడల వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సబ్జెక్టు ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. తెలుగు సోషల్ పరీక్ష పత్రాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల మార్కులను పరిశీలించి సగం మంది ఉత్తీర్ణత సాధించలేదని వారి పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావును ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆరేం వారి గుంపు ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులతో ముచ్చటించి వారికి పాఠాలు బోధించారు. విద్యార్థులను బోర్డుపై ఆంగ్లము తెలుగు గణితానికి సంబంధించి విద్యార్థులతో రాయించి విద్యార్థులను అభినందించారు. మూడో తరగతి విద్యార్థులు ఐదో తరగతి విద్యార్థులు పిఓ అడిగినా ప్రతి ప్రశ్నకు జవాబులు చెబుతూ ఆయన మనసు గెలుచుకున్నారు. విద్యార్థులతో కలిసి ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజు, ఎంఈఓ గడ్డం మంజుల, ఎంపీడీవో దేవ వర కుమార్, కార్యదర్శులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బియ్యం వితరణ

నవతెలంగాణ-అశ్వాపురం

మండల పరిధిలోని మంచి కంటి నగర్ గ్రామ సమీపంలో గల ఆరిఫా రోష్ని వృద్ధాశ్రమానికి మంగళవారం మణుగూరులోని సింగరేణి ఉద్యోగి కంది వెంకటేశ్వర్లు 50 కేజీల బియ్యంతో పాటు కూరగాయలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన భార్య విజయలక్ష్మి జ్ఞాపకార్థం ఆశ్రమానికి ఈ వితరణను అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బత్తుల కృష్ణ, ఎస్‌డి నాజర్ పాషా, ఆంగోత్ మంగీలాల్ ఆశ్రమ నిర్వాహకులు మెహరాజ్ పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్, బీజేపీ, విశ్వహిందూ పరిషత్ దాడులను ఖండించాలి

సీపీఐ(ఎం) పార్టీ మహాసభల తీర్మానంలో బలపరిచిన నబి

నవతెలంగాణ-ఇల్లందు



మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు, మైనారిటీలపై ఆర్ఎస్ఎస్, బీజేపీ, విశ్వహిందూ పరిషత్ దాడులను ఖండించాలని సంగారెడ్డిలో జరుగుతున్న సీపీఎం పార్టీ రాష్ట్ర 4వ మహాసభలో అబ్బాస్ పెట్టిన తీర్మానాన్ని సీపీఎం పార్టీ రాష్ట్ర 4వ మహాసభలో నబి బలపరచారు. కాంగ్రెస్ హామీ మైనారిటీ డిక్లరేషన్ ను వెంటనే అమలు చేయాలని, పార్లమెంట్‌లో బీజేపీ వక్ఫ్ ఆస్తులపై కొత్త చట్టం తెచ్చే కుట్రలో భాగంగా పార్లమెంట్ కమిటీ వేసింది. అందులోని 10మంది ప్రతిపక్ష సభ్యులను తొలగించడాన్ని ఖండించారు. మైనారిటీలను ఓటు బ్యాంకుగా నే వాడుకుంటున్నారని తీర్మానంలో అన్నారు.

సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తాం

- రాష్ట్ర మహాసభలో వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల

నవతెలంగాణ-ఇల్లందు



పోడు భూములు, నిర్వాసితులు, ఇండ్ల స్థలాలు, భూ సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలో జరుగుతున్న సిపిఎం 4వ రాష్ట్ర మహాసభలో పాల్గొని మాట్లాడారు.

31న డైమండ్ జూబ్లీ ఉత్సవాలు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

స్థానిక ఖమ్మం నగరం మౌంట్ ఫోర్ట్ హైస్కూల్ లో డైమండ్ జూబ్లీ ఉత్సవాలను 31 జనవరి 2025న జరుగుతున్న సందర్భంగా మంగళవారం రక్తదాన శిబిరాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు తమ స్కూలుకి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా గొప్ప విషయమని సమాజ సేవకు కృషి చేస్తున్న అందరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఆర్.జె.సి కృష్ణ ప్రధాన కార్యదర్శి వంజాకు లక్ష్మీనారాయణ రావు, కోశాధికారి పి.రమేష్ బాబు, రిటైర్డ్ డిఎంఓ అయ్యేదేవర రాంబాబు, పసుమర్తి ప్రవీణ్, టీచర్స్ రాధిక, ఖలీల్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు

కేంద్ర ప్రభుత్వ విధానాలతో స్టీల్ ప్లాంట్ నిర్వీర్యం

నవతెలంగాణ-కారేపల్లి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో విశాఖ స్టీల్ ప్లాంట్ దాని అనుబంధ డోలమైట్ మైన్స్‌లు నిర్వీర్యం అయ్యే దశకు చేరుకున్నాయని టీయుసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.రామయ్య విమర్శించారు. వందలాది మందికి ఉపాధి చూపిన స్టీల్ ప్లాంట్ మోడీ అనుసరిస్తున్న తీరుతో రోడ్డున పడుతున్నారన్నారు. స్టీల్ ప్లాంట్‌ను నమ్ముకొని పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. దేశ ఉత్పత్తి రంగంలో కీలకమైన కార్మికుల చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తు శ్రమదోపిడి గురవుతున్నారన్నారు. కార్మికుల సమస్యలపై టీయుసీఐ ఆధ్వర్యంలో కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున్న ఉద్యమించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో టీయుసీఐ ఉపాధ్యక్షులు కే.శ్రీనివాస్, ఎస్‌కె.పాషా, బాదావత్ వీరు, నరాటి వెంకటేశ్వర్లు, జోగా నాగేశ్వరరావు, సంపత్, రవి, ఏఐకేయూఎస్ డివిజన్ అధ్యక్షులు తేజానాయక్, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసగించిన కాంగ్రెస్

నవతెలంగాణ-కారేపల్లి

మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అధికారం చేపట్టి రైతులను మోసగిస్తుందని బీఆర్ఎస్ జిల్లా నాయకులు మాజీ దిశా కమిటీ సభ్యులు లకావత్ లక్ష్మణ్ విమర్శించారు. మంగళవారం కారేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పథకాల పేరుతో మభ్యపుచ్చటమే తప్ప ఏడాదికాలంలో ఒరగబెట్టింది ఏమి లేదన్నారు. రైతు రుణమాఫీ మధ్యలోనే ఆపివేశారని, రైతు భరోసాను ఎగవేయటానికి ఎత్తులు వేస్తున్నారని ఆరోపించారు. రైతులు రైతు భరోసా ఇవ్వటం చాతకాని ప్రభుత్వం రైతు కూలీలకు ఆత్మీయ భరోసా రూ.12 వేలు అంటూ మోసపూరిత పథకాన్ని వల్లెవేస్తున్నారన్నారు. గ్రామసభలలో ప్రజలు ప్రభుత్వంపై తిరగబడ్డారన్నారు. రుణమాఫీ అవుతుందని రైతులు బ్యాంకులలో రెన్యూవల్ చేసుకోక మిత్తీమీద మిత్తి పేరుకపోతుందని బ్యాంకర్లు రుణాలు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వంపై తిరగబడి రోజులు దగ్గర పడ్డాయన్నారు.

కామ్రేడ్ యూత్ కబడ్డీ విజేత కారేపల్లి

నవతెలంగాణ-కారేపల్లి

కామ్రేడ్ యూత్ ఆధ్వర్యంలో మూడు మండలాల కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో కారేపల్లి జట్టు, గార్ల మండలం సీతంపేట జట్టుపై విజయం సాధించి విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌ను కారేపల్లి ఎస్సై ఎన్.రాజారాం ప్రారంభించారు. విజేతలకు ఎస్సై ఎన్.రాజారాం, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లెల నాగేశ్వరరావు, తొగర శ్రీను, కామ్రేడ్ యూత్ కమిటీ సభ్యులు వినయ్, అనిల్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనారిటీ నేత షఫీని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లికి చెందిన మైనారిటీ నాయకులు షేక్ షఫీ ఇటీవల హైదరాబాద్‌లో గుండె ఆపరేషన్ జరిగింది. విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ హైదరాబాద్‌లోని కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న షఫీని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుకున్నారు. వైద్యులతో మాట్లాడి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. షఫీ కుటుంబానికి ధైర్యం చెప్పి కొంత ఆర్థికసాయం అందించారు. షఫీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మేదరి వీరప్రతాప్(టోనీ), మైనార్టీ నాయకులు తాజుద్దీన్, ఎండీ.హనీఫ్, మజీద్‌పాషా తదితరులు ఉన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీలో ఖమ్మానికి పెద్దపీట

- కార్యదర్శివర్గ సభ్యులుగా పోతినేని, నున్నా
- కమిటీ సభ్యులుగా భారతి, శ్రీకాంత్, బండి రమేష్
- ఆహ్వానితులుగా సరళ, కళ్యాణం వెంకటేశ్వరరావు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీలో ఖమ్మం జిల్లాకు పెద్ద పీట వేశారు. సంగారెడ్డిలో 25–28వ తేదీ వరకు నిర్వహించిన పార్టీ రాష్ట్ర 4వ మహాసభల్లో ఖమ్మం జిల్లాకు చెందిన తమ్మినేని వీరభద్రం వయసు రిత్యా రాష్ట్ర కార్యదర్శి స్థానం నుంచి తప్పుకోగా ఆ బాధ్యతలను మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన జాన్‌వెస్లీకి ఇచ్చారు. ఇక రాష్ట్ర కమిటీలో జిల్లా నుంచి ఐదుగురికి చోటు దక్కగా ఆహ్వానితులుగా మరో ఇద్దరిని తీసుకున్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గంలో జిల్లాకు చెందిన పోతినేని సుదర్శన్‌రావుతో పాటు జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావుకు కొత్తగా చోటు కల్పించారు. గత కమిటీలోనూ జిల్లా నుంచి ఇద్దరు రాష్ట్ర కార్యదర్శివర్గంలో ఉన్నారు. వీరిలో తమ్మినేని రాష్ట్ర కార్యదర్శి హోదాలో పనిచేశారు. ఇప్పుడు ఆయన రిలీవ్ కావడంతో నున్నా నాగేశ్వరరావుకు చోటు కల్పించారు.

రాష్ట్ర కమిటీలోకి తొలిసారి 'బండి'

జిల్లా కార్యదర్శివర్గ సభ్యులైన మాచర్ల భారతి, యర్రా శ్రీకాంత్ గతంలోనే రాష్ట్ర కమిటీ సభ్యులు కాగా కొత్తగా పాలేరు డివిజన్ కార్యదర్శి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్‌ను రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నారు. గతంలో రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఉన్న పొన్నం వెంకటేశ్వర్లు వయసు రిత్యా రిలీవ్ కావడంతో ఆయన స్థానాన్ని రమేష్‌తో భర్తీ చేశారు. తద్వారా రాష్ట్ర కమిటీలో నేరుగా జిల్లా నుంచి ఐదుగురికి స్థానం లభించినట్లయింది.

ఆహ్వానితులుగా బుగ్గవీటి, కళ్యాణం



సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆహ్వానితులుగా బుగ్గవీటి సరళ, కళ్యాణం వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ప్రస్తుతం కళ్యాణం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఐద్వా రాష్ట్ర నాయకురాలైన సరళ కూడా డిసెంబర్‌లో సత్తుపల్లిలో జరిగిన ఖమ్మం జిల్లా సీపీఐ(ఎం) మహాసభల్లో జిల్లా కార్యదర్శివర్గం నుంచి రిలీవ్ అయ్యారు. ఆమెను రాష్ట్ర కమిటీ ఆహ్వానితులుగా ఎన్నుకున్నారు. వీరిద్దరినీ కూడా కలిపితే జిల్లా నుంచి మొత్తమ్మీద ఏడుగురికి రాష్ట్ర కమిటీలో స్థానం లభించినట్లయింది.



ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కొణిజర్ల

రాష్ట్ర సచివాలయంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం కలిశారు. ఎమ్మెల్యేతో పాటు కొణిజర్ల మండల సీనియర్ నాయకుడు సూరంపల్లి రామారావు కూడా వెళ్ళారు. కొణిజర్ల మెయిన్ రోడ్డు సుమారు 15 కోట్ల నిధులతో డివైడర్‌తో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, మండల కేంద్రం నుండి రామనరసయ్య నగర్ వరకు మరమ్మతులు, కొణిజర్ల నుంచి తనికెళ్ల వరకు బిటి రోడ్, దుద్దెపూడి నుండి చిన్న మునగాల వరకు రోడ్డులు మంజూరు చేయాలని మండల అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడంతో ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సూరంపల్లి రామారావులు కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ కార్డులో చేర్పులకు దరఖాస్తుల స్వీకరణ : తహసీల్దార్

ముదిగొండ: రేషన్‌కార్డులలో కుటుంబసభ్యుల పేర్లు లేని, కార్డుదారులు కుటుంబసభ్యుల పేర్లను చేర్చుకునే అవకాశం ఉందని తహశీసిల్దార్ కె సునీత ఎలిజిబెత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డులో కుటుంబసభ్యులను చేర్చుకునేందుకు సమీపంలోని మీసేవ కేంద్రాలను సంప్రదించి ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రేషన్‌కార్డు నుంచి కుటుంబసభ్యులను తొలగించుకునేందుకు దరఖాస్తుతో నేరుగా తాహశీసిల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

మార్క్సిస్టు మహాసభలలో

ఉద్యమాల గడ్డకు సముచిత స్థానం

- రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడిగా బండారు రవికుమార్
- రాష్ట్ర కార్యవర్గంలోకి తిరిగి ఎన్నికైన మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

మూడు రోజులపాటు సంగారెడ్డిలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు రాష్ట్ర మహాసభలలో పోరాటాల పురిటి గడ్డ భద్రాచలం మన్యానికి సముచిత స్థానం దక్కింది. ఈ ప్రాంత ప్రజల కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా విడిచిన బండారు చంద్రరావు కుమారుడు అనేక పోరాటాల రథసారథిగా నిలిచిన బండారు రవికుమార్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడిగా భద్రాచలం డివిజన్లో ఉద్యమ ప్రస్తావని ప్రారంభించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు ఉన్న మచ్చ వెంకటేశ్వరరావు ఈ ప్రాంతం నుండే విద్యార్థి దశ నుండి పోరాటాల ప్రస్తావని ప్రారంభించి సీఐటియు జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న ఏజే రమేష్ పార్టీ కార్యవర్గంలోకి తిరిగి ఎన్నికయ్యారు.

మన్యం నుండి మహానగరం వరకు రవికుమార్ ఉద్యమ ప్రస్థానం

1985 సంవత్సరంలో ఆదివాసీ బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పోరాటాలు నిర్వహిస్తున్న బండారు చంద్రరావుని నరహంతకు నక్సలైట్లు అతి కిరాతకంగా హత్య చేసి ఉద్యమాన్ని అణచాలని చూసిన విషయం తెలిసిందే. ఒక వీరుడు మరణిస్తే వందలాది మంది పోరాట యోధులు పుట్టుకొస్తారనటంలో ఏ మాత్రం సందేహం లేదని నిరూపిస్తూ ఆయన కుమారుడైన బండారు రవికుమార్ తండ్రి మరణంతో ఏమాత్రం అధైర్య పడకుండా ఉద్యమ బాటలో పనిస్తూ మార్క్సిస్టు పార్టీ విద్యార్థి రంగా బాధ్యతలను 1986లో తీసుకొని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శిగా అనంతరం యువజన రంగమైన డీవైఎఫ్ఐ భద్రాచలం డివిజన్ కార్యదర్శిగా విద్యార్థి యువజన సంఘాల రాష్ట్ర కమిటీ సభ్యుడిగా సుదీర్ఘకాలం అనేక పోరాటాలు నిర్వహించారు. అనంతరం ప్రజాసంఘాల ప్రధాన బాధ్యత నుండి పార్టీ అవసరాలరీత్యా భద్రాచలం పార్టీ పట్టణ కన్వీనర్ గా పనిచేసిన బండారు రవి కుమార్ అతి తక్కువ కాలంలోనే అతిపెద్ద భద్రాచలం ఉమ్మడి డివిజన్ మార్క్సిస్టు పార్టీ డివిజన్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. భద్రాచలం డివిజన్ లోని చింతూరు, వీఆర్ పురం, కూనవరం, భద్రాచలం రూరల్ ఆదివాసీ మండలాలలో తునికాకు, పోడుభూమి తదితర ఆదివాసీ పోరాటాలకు నాయకత్వం వహించి ఈ ప్రాంత ఆదివాసీ గుండెల్లో చెరగని ముద్ర బండారు రవికుమార్ వేసారని చెప్పాలి. భద్రాచలం ఏజెన్సీని జల సమాధి చేసే పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాటాన్ని రూపొందించడమే కాకుండా ఆ ఉద్యమానికి నాయకత్వం వహించి పోలీసు నిర్బంధాలను ఎదుర్కొంటూ పోలీస్ లు మోపిన కేసులలో ఎ1 గా 23 రోజుల పాటు జైలు జీవితాన్ని గడిపి 16 సంవత్సరాల పాటు కోర్టు చుట్టూ తిరిగిన బండారు రవికుమార్ ఈ ప్రాంత ప్రజల తరపున అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. పార్టీ అవసరాలు రీత్యా ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రానికి తరలి వెళ్లిన బండారు రవికుమార్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడిగా సుదీర్ఘకాలం పనిచేశారు. పార్టీ అవసరం మేరకు రాష్ట్ర కేంద్రానికి తరలి వెళ్లిన బండారు రవికుమార్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా అదిలాబాద్, ములుగు జిల్లాలకు పార్టీ పర్యవేక్షుడిగా బాధ్యత నిర్వహిస్తూనే ఆదివాసీ గిరిజన సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. ఆదివాసీ ఉద్యమాల పట్ల అత్యంత మక్కువ చూపించే బండారు కుమార్ కార్యకర్తలను తయారుచేయటంలో దిట్టా అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కుంజా బుజ్జి మూడు పర్యాయాలు పోటీ చేసి గెలిచిన సందర్భంలో గాను సున్నం రాజయ్య శాసనసభ్యులుగా మిడియం బాబురావు పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేసిన సమయంలో గాని బండారు రవి కుమార్ వేసిన ఎన్నికలు ఎత్తుగడలు సత్ఫలితాలను ఇచ్చాయని ఆనాటి విజయాలే ప్రత్యక్ష ఉదాహరణంగా చెప్పాలి. బండారు చంద్రరావు పోరాట వారసుడిగా మన్యంలో ఉద్యమ ప్రస్తావని ప్రారంభించిన బండారు రవి కుమార్ సంగారెడ్డిలో జరిగిన రాష్ట్ర నాలుగవ మహాసభలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడిగా ఎన్నికవ్వటం పట్ల అభివృద్ధి అభ్యుదయ వాదులు వామపక్షవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర కమిటీ సభ్యులుగా మచ్చ, ఏజే

భద్రాచలం డివిజన్ చర్ల మండలంలో కూలి పోరాటాలతో ఉద్యమ ప్రస్తావని ప్రారంభించిన మచ్చ వెంకటేశ్వర్లు వ్యవసాయ కార్మిక సంఘం యువజన సంఘం రంగాలలో ప్రధాన బాధ్యతలను నిర్వహిస్తూ అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన మచ్చ వెంకటేశ్వర్లు గత నెలలో జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహాసభలలో జిల్లా కార్యదర్శిగా ఎన్నికైనారు. జిల్లా కార్యదర్శిగా ఉన్న మచ్చ వెంకటేశ్వర్లు పార్టీ కార్యవర్గ సభ్యుడిగా తిరిగి ఎన్నికవ్వటంతో పాటు సీఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడిగా పనిచేస్తున్న ఏజే రమేష్ సైతం భద్రాచలం డివిజన్ ఉద్యమ వారసుడు కాగా ఈ ప్రాంతంలోనే అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి అంచెలంచెలుగా ఎదుగుతూ పార్టీ రాష్ట్ర కార్యవర్గంలోకి మరోసారి ఎన్నికయ్యారు. ఉద్యమాల గడ్డైన భద్రాచలం నుండి బండారు రవికుమార్, మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్‌లు రాష్ట్ర మహాసభలలో ఉన్నత కమిటీలకు ఎన్నికవ్వటం పట్ల పోరాటాల గడ్డకు మార్క్సిస్టు మహాసభలలో సముచిత స్థానం దక్కిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



గొంగడి త్రిషను అభినందించిన నవభారత్ డిగ్రీ కళాశాల

నవతెలంగాణ-సత్తుపల్లి

మలేషియాలో జరుగుతున్న అండర్–19 ఉమెన్స్ వరల్డ్ కప్ క్రికెట్ పోటీల్లో సూపర్–6 మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై భారత క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రపంచంలోనే సెంచరీ చేసిన గొంగడి త్రిషకు సత్తుపల్లి నవభారత్ డిగ్రీ కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా ఆ కళాశాల చైర్మెన్ గాదె నరసింహారెడ్డి మాట్లాడుతూ 59 బంతుల్లో 110 పరుగులతో నాటౌట్‌గా నిలిచి ప్రపంచ రికార్డు సృష్టించి త్రిష తల్లి మాధవి మా కళాశాల పూర్వ విద్యార్థిని అని గాదె తెలిపారు. త్రిష తల్లి మాధవి సత్తుపల్లి మండలం తాళ్లమడకు చెందిన వారన్నారు. 1999–2002లో మాధవి మా కళాశాల నవభారత్ డిగ్రీ కళాశాలలో బీకాం (కంప్యూటర్) విద్యను పూర్తి చేసిందన్నారు. త్రిషను ఆదర్శంగా తీసుకొని వివిధ రంగాల్లో విద్యార్థినులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని నరసింహారెడ్డి కోరారు. కళాశాల కరస్పాండెంట్ కరస్పాండెంట్ జీవీ లింగారెడ్డి, ప్రిన్సిపాల్ ఎల్ఎస్ రెడ్డి, అధ్యాపకులు, నాన్–టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు త్రిషకు, ఆమె తల్లి మాధవికి అభినందనలు తెలిపారు.

రెండు ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

అసైన్మెంట్ భూమిని కొనుగోలు చేసి గత 30 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న రెండు ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని తీర్దాల రెవిన్యూ పరిధిలోని పోలిశెట్టిగూడెం గ్రామానికి చెందిన అసైన్డ్ భూమికి పట్టాలు సృష్టించి 30 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న ఓ రైతు దగ్గర నుంచి రెవిన్యూ అధికారులు భూమి స్వాధీనం చేసుకున్నారు. సర్వేనెంబర్ 772లో గల అసైన్డ్ భూమిని ఓ నాయకుడు కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నాడు. దీంతో గ్రామానికి చెందిన యువకులు ఫిర్యాదు చేయడంతో సర్వే చేసి ఆ భూమికి రైతుకు ఎటువంటి సంబంధం లేదని తేలడంతో స్వాధీనం చేసుకున్నారు. ఇంకా గ్రామంలో అసైన్డ్ భూమి 42 ఎకరాలు ఉన్నదని, అట్టి భూమిని కొంతమంది తక్కువ ధరకు కొనుగోలు చేసి దొంగ పట్టాలు సృష్టించారని, దాన్ని కూడా స్వాధీనం చేసుకోవాలని రెవిన్యూ అధికారులకు గ్రామ యువకులు తెలిపారు. సర్వే చేసి భూమిని స్వాధీనం చేసుకుంటామని రెవిన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సతీష్ రెడ్డి, ఆర్ఐ క్రాంతి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములు జోలికి రావద్దు : తహశీల్దార్

అసైన్డ్ భూములను అమ్మడం, కొనుగోలు చేయడం లాంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ రాంప్రసాద్ అన్నారు. భూమిని స్వాధీనం చేసుకొని,వారిపై క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందన్నారు.

87 కళ్యాణలక్ష్మి చెక్కులు మంజూరు

నవతెలంగాణ-ముదిగొండ

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు 87 చెక్కులను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆ చెక్కులను బుధవారం తహసిల్దార్ కార్యాలయంలో ఆర్డిఓ గరిడి నరసింహారావు లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తహశీల్దార్ కె.సునీతఎలిజిబెత్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. కళ్యాణలక్ష్మి లబ్ధిదారులు సకాలంలో తహశీల్దార్ కార్యాలయముకు హాజరై చెక్కులను తీసుకోవాలని ఆమె కోరారు.

జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా బోడేపూడి పురంధర్

నవతెలంగాణ-ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ బోడేపూడి పురంధర్‌ను డిప్యుటేషన్‌పై ఖమ్మం జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా ప్రభుత్వం నియమించారు మంగళవారం డాక్టర్ బోడేపూడి పురంధర్ ఖమ్మం జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా బాధ్యతల స్వీకరణ అనంతరం మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ని కలిశారు.

పీఆర్‌టీయూ విజయంతోనే సమస్యల పరిష్కారం

నవతెలంగాణ-కల్లూరు

పీఆర్‌టీయూ తరఫున ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పింగిళి శ్రీపాల్‌రెడ్డి విజయంతోనే ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతాయని మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి, సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పి.వెంకట్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావుతో పాటు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాకాల రమేష్, షేక్ చాంద్ సాహెబ్, రాష్ట్ర బాధ్యులు యం.డి మౌలాని, పఠాన్ రహీం, జిల్లా బాధ్యులు బోబోలు శ్రీనివాసరావు, బీరవల్లి శ్రీనివాసరావు, మండల బాధ్యులు పోట్రు మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై కళాజాత

నవతెలంగాణ-సత్తుపల్లి

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై పోలూరి రాము కళాజాత బృందంచే సత్తుపల్లి మండలం గంగారం పీహెచ్‌సీ పరిధిలోని రామగోవిందాపురం, కిష్టాపురం గ్రామాల్లో మంగళవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాజాత బృందం ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను జానపద గీతాలతో ప్రజలను అలరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ అవినాశ్ మాట్లాడుతూ గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షలు, పౌష్టికాహారం, టీకాలపై ఆయా గ్రామాల ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఈ వేణుగోపాల్, హెచ్ఈవో వెంకటేశ్వరరావు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, తులం బంగారం ఏమాయే..

- హామీల అమలులో కొర్రీలు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ డంకా మోగిస్తాం..
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

నవతెలంగాణ-చండ్రుగొండ



హామీల అమలులో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి డబ్బులు, తులం బంగారం ఇవ్వలేక చతికిల పడ్డదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు విమర్శించారు. మంగళవారం దామరచర్లలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో అశ్వరావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, రేగ కాంతారావు ముఖ్యఅతిదులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు పథకాలు అమలు చేశామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారిని గుర్తించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. హామీల అమలులో కొర్రీలు పెట్టడం, ప్రజలు గమనిస్తున్నారని, మోసపూరిత హామీలపై నమ్మకాన్ని కోల్పోయారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు కాంగ్రెస్ రౌడీయిజానికి అద్దం పడుతున్నాయన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తే దాడులు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ప్రజలను గందరగోళానికి గురిచేసి లబ్ది పొందిన కాంగ్రెస్ పార్టీ అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్, బిజెపి రెండు పార్టీలు కలిసి నాటకాలు ఆడుతున్నాయని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమకు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, గులాబీ జెండా విజయ డంకా మోగిస్తుందని దీమా వ్యక్తం చేశారు. అనంతరం బెండలపాడు ఘర్షణలో గాయపడిన రవి, మేడ మోహన్ రావు లను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట నియోజకవర్గ నాయకురాలు, ఒగ్గేలా పూజ, జిల్లా అధికార ప్రతినిధి యుఎస్ ప్రకాష్ రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారా వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి,నరకుళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నవ్వించే 'బద్మాషులు'

మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ లీడ్ రోల్స్‌లో ఓ హిలేరియస్ ఎంటర్టైనర్ రూపొందుతోంది. తార స్టోరీ టెల్లర్స్ బ్యానర్ పై బి. బాలకృష్ణ, సి.రామ శంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శంకర్ చేగూరి దర్శకుడు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ ఎంటర్‌టైనర్‌కి 'బద్మాషులు' అనే క్రేజీ టైటిల్‌ని మేకర్స్ ఖరారు చేశారు.

మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ కనిపించిన ఫస్ట్ లుక్ పోస్టర్ చాలా ఇంట్రస్టింగ్‌గా ఉందిద. టైటిల్ డిజైన్ చాలా క్రియేటివ్‌గా ఉండి ఎట్రాక్ట్ చేస్తోంది. గ్రామీణ నేపథ్యంలో జరిగే హాస్య భరిత చిత్రమిది. ప్రతి సన్నివేశంలో కడుపుబ్బా నవ్వుకుని, ఆ అనుభూతిని నలుగురు పంచుకునే చిత్రం. ఈ చిత్రంలోని ప్రతి పాత్ర మీ నిజ జీవితంలో, మీ ఊరిలోని మీరు కలిసిన వారిలాగే ఉంటూ నవ్విస్తుంటాయి. కథనం పరంగా నవ్విస్తూనే గొప్ప సందేశాన్ని ఇస్తుంది అని చిత్ర బృందం తెలిపింది.

బలగం సుధాకర్ రెడ్డి, కవిత శ్రీరంగం, దీక్ష కోటేశ్వర్, అన్షుమన్, అంజి తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి దర్శకత్వం-శంకర్ చేగూరి, సంగీత దర్శకులు- తేజ కూనూరు, సినిమాటోగ్రాఫర్- వినీత్ పబ్బతి, ఎడిటర్- గజ్జల రక్షిత్ కుమార్.

నవచిత్రం

ప్రేమికుల రోజు కానుకగా రిలీజ్



అమ్మ రాజశేఖర్ దర్శకత్వంలో ఆయన తనయుడు అమ్మ రాజ్ హీరోగా రూపొందిన చిత్రం 'తల'. అంకిత నాన్సర్ హీరోయిన్. మంగళవారం ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా హీరో అమ్మ రాజ్ మాట్లాడుతూ,'ఈ సినిమా ఫిబ్రవరి 14న విడుదల అవుతుంది. వాలంటైన్స్ డేకి వస్తున్న ఈ చిత్రం అందర్నీ అలస్తుంది. ఈ సినిమా మిమ్మల్ని ఎక్కడికో తీసుకెళుతుంది. యాక్షన్, సాంగ్స్ అన్నీ కంటెంట్‌లో భాగంగా ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటాయి' అని అన్నారు.

హీరోయిన్ అంకిత మాట్లాడుతూ,'నేను బెంగాలీ. ఇదినా ఫస్ట్ సినిమా. ఈ అవకాశం ఇచ్చినందుకు అమ్మ రాజశేఖర్‌కి థ్యాంక్స్. ప్రతి ఒక్కరూ సినిమా చూసి మమ్మల్ని సపోర్ట్ చేయండి' అని తెలిపారు.

'ఇండస్ట్రీలో అంతా అమ్మ రాజశేఖర్ ఫినిష్ అని చెప్పారు. ఇప్పుడు ఈ సినిమాతో వస్తున్నాను. నా కొడుకుతో సినిమా చేయాలనేది చిన్నప్పటి నుంచి నా కోరిక. శ్రీనివాస్ గౌడ్ నా దేవుడు. నా కుటుంబం మొత్తం రుణపడి ఉంటుంది. ఈ మూవీ కొని తెలుగు, తమిళ్‌లో గ్రాండ్‌గా రిలీస్ చేస్తున్నారంటే గట్స్ కావాలి' అని దర్శకుడు అమ్మ రాజశేఖర్ అన్నారు.

ఈ చిత్రానికి డీఓపీ: శ్యామ్ కె నాయుడు, సాంగ్: థమన్ ఎస్ఎస్, మ్యూజిక్ డైరెక్టర్: ధర్మ తేజ, అస్లాం కేఈ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాధ రాజశేఖర్, ఆర్ట్ డైరెక్టర్: రామకృష్ణ, లిరిసిస్ట్: ధర్మతేజ, ఎడిటర్ : శివ సామి.

వరుణ్ మ్యాజిక్

రాజ్‌కోట్‌లో ఐదు వికెట్ల మాయజాలం
రాణించిన బెన్ డకెట్, లివింగ్‌స్టోన్





వరుణ్ చక్రవర్తి (5/24) మాయ కొనసాగుతుంది. ఈడెన్‌లో ఇంగ్లాండ్‌ను వణికించిన వరుణ్.. రాజ్‌కోట్‌లో ఐదు వికెట్ల ప్రదర్శనతో అదే మాయ పునరావృతం చేశాడు. బెన్ డకెట్ (51), లివింగ్‌స్టోన్ (43) రాణించటంతో భారత్‌తో మూడో టీ20లో తొలుత ఇంగ్లాండ్ 171/9 పరుగులు చేసింది.

నవతెలంగాణ-రాజ్‌కోట్

వరుణ్ చక్రవర్తి (5/24) మాయజాలంతో మరోసారి ఇంగ్లాండ్‌ను విలవిల్లాడించాడు. ఓపెనర్ బెన్ డకెట్ (51, 28 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోశ్ బట్లర్ (24, 22 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), లివింగ్‌స్టోన్ (43, 24 బంతుల్లో 1 ఫోర్, 5 సిక్స్‌లు) రాణించటంతో ఇంగ్లాండ్ భారీ స్కోరు దిశగా సాగింది. వరుణ్ చక్రవర్తి మాయజాలంతో ఇంగ్లాండ్ మిడిల్ ఆర్డర్ కుప్పకూలింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 171 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్య (2/33), రవి బిష్ణోయ్ (1/46), అక్షర్ పటేల్ (1/19) రాణించారు.

డకెట్ అర్థ సెంచరీ :

మంచు ప్రభావం ఎక్కువగా ఉండే పరిస్థితుల్లో టాస్ నెగ్గిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అర్షదీప్ సింగ్‌కు విశ్రాంతి దక్కగా.. సీనియర్ పేసర్ మహ్మద్ షమి తుది జట్టులో నిలిచాడు. షమితో కొత్త బంతిని పంచుకున్న హార్దిక్ పాండ్య.. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (5) వికెట్‌తో బ్రేక్ అందించాడు. మరో ఓపెనర్ బెన్ డకెట్ (51), జోశ్ బట్లర్ (24) రెండో వికెట్‌కు 45 బంతుల్లో 76 పరుగులు జోడించారు. ఇంగ్లాండ్‌ను భారీ స్కోరు దిశగా నడిపించారు. ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 26 బంతుల్లోనే అర్థ సెంచరీ బాదిన బెన్ డకెట్.. ఆ తర్వాత మాయలో పడ్డాడు. ఓ ఫోర్, సిక్సర్‌తో ప్రమాదకరంగా మారుతున్న బట్లర్‌ను వరుణ్ చక్రవర్తి సాగనంపగా.. డకెట్‌ను అక్షర్ పటేల్ అవుట్ చేశాడు. హ్యారీ బ్రూక్ (8), స్మిత్ (6), ఓవర్టన్ (0), బ్రైడన్ (3), ఆర్చర్ (0)లు స్వల్ప స్కోర్లకే నిష్క్రమించారు. కానీ లియాం లివింగ్‌స్టోన్ (43) ధనాధన్ మెరుపులతో దంచికొట్టాడు. రవి బిష్ణోయ్ ఓవర్లో ఏకంగా మూడు సిక్సర్లు కొట్టాడు. కానీ హార్దిక్ పాండ్య అతడి కథను ముగించాడు. దీంతో 20 ఓవర్లలో 9 వికెట్లకు ఇంగ్లాండ్ 171 పరుగులు చేసింది.

మెప్పించే 'రాజా మార్కండేయ'

శ్రీ జగన్మాత రేణుకా క్రియేషన్స్, ఫోర్ ఫౌండర్స్ పతాకాలపై బన్నీ అశ్వంత్ దర్శకత్వంలో సామా శ్రీధర్, పంజాల వెంకట్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'రాజా మార్కండేయ'. వేట మొదలైంది అనేది ఉప శీర్షిక.

యస్‌కె మీరావలి, రాయారావు విశ్వేశ్వరరావు, సత్యదీప్ సంగీతాన్ని అందించారు. తాజాగా ఈ చిత్ర ఆడియో ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హీరో సుమన్, ప్రతాని రామకృష్ణ గౌడ్, హీరో తేజస్ వీరమాచినేని, హీరోయిన్స్ రోమి, దేవిక, ప్రత్యూష, దర్శకుడు బన్నీ అశ్వంత్, నిర్మాతలు సామా శ్రీధర్, పంజల వెంకట్ గౌడ్, సహ నిర్మాతలు గౌరిశెట్టి శ్రీనివాస్, మాజీ టూరిజం ఛైర్మెన్ శ్రీనివాస్ గుప్తా, హైకోర్ట్ అడ్వకేట్ రాపోలు భాస్కర్, హాస్యబ్రహ్మ శంకర్ నారాయణ, సామాజికవేత్త - ప్రొడ్యూసర్ డాక్టర్ మూసా అలీ ఖాన్, కటకం శ్రీనివాస్ గుప్తా, ఇన్నాఫేమ్ కవిరాజ్ దంపతులు, సామాజికవేత్త గంగాపురం పద్మా గౌడ్ తదితరులు పాల్గొన్నారు. విచ్చేసిన అతిథులు చిత్రంలోని ఒక్కో పాటను ఆవిష్కరించగా, టీజర్‌ను రాపోలు భాస్కర్ విడుదల చేశారు. సినిమా ట్రైలర్‌ను హీరో సుమన్ రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు బన్నీ ఆశ్వంత్ మాట్లాడుతూ,'ఈనాటి



కలియుగంలో శివుడి భక్తుడైన మార్కండేయ జీవితంలో ఎలాంటి కష్టాలు ఎదురయ్యాయి?, వాటిని శివుడి అనుగ్రహంతో ఎలా అధిగమించాడు? అనేది కాన్సెప్ట్. మీరావలి మంచి సంగీతాన్ని అందించారు' అని అన్నారు.

'మా బన్నీ ఆశ్వంత్ వల్లే ఈ సినిమాని నిర్మించగలిగాం. కథని నమ్మి తీసిన సినిమా ఇది. సినిమా బాగా వచ్చింది. ఆడియెన్స్‌కి ఈ చిత్రం కచ్చితంగా నచ్చుతుంది' అని నిర్మాతల్లో ఒకరైన సామా శ్రీధర్ చెప్పారు.

మహబూబ్ నగర్, ఆదిలాబాద్ జోరు

టీడీసీఏ టీ20 క్రికెట్ టోర్నమెంట్



హైదరాబాద్ : తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) నిర్వహిస్తున్న అండర్-17 టీ20 టోర్నమెంట్‌లో మహబూబ్ నగర్, ఆదిలాబాద్ జట్లు ముందంజ వేశాయి. మంగళవారం దోమలగూడలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ గ్రౌండ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో మెదక్‌పై మహబూబ్ నగర్ 33 పరుగుల తేడాతో గెలుపొందింది. రవితేజ (82 నాటౌట్) అర్థ సెంచరీతో మహబూబ్ నగర్ తొలుత 20 ఓవర్లలో 178/8 పరుగులు చేసింది. ఛేదనలో మెదక్ 20 ఓవర్లలో 145/9 పరుగులే చేసింది. రెండో మ్యాచ్‌లో నిజామాబాద్ (127/10)పై టీడీసీఏ (169/8) ఎలెవన్ 42 పరుగుల తేడాతో విజయం సాధించింది. 18 ఓవర్ల మ్యాచ్‌లో ఆదిలాబాద్ 117/8 పరుగులు చేయగా.. వరంగల్ 15.4 ఓవర్లలో 84 పరుగులకే చేతులెత్తేసింది. 33 పరుగుల తేడాతో ఆదిలాబాద్ ఘన విజయం సాధించింది. రెండో రోజు పోటీలను టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి టాస్ వేసి ప్రారంభించారు.

త్రిష ధనాధన్ సెంచరీ

స్కాట్లాండ్‌పై భారత్ ఘన విజయం



కౌలాలంపూర్ : ఐసీసీ మహిళల అండర్-19 ప్రపంచకప్‌లో తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష సరికొత్త రికార్డు సాధించింది. ఈ టోర్నమెంట్‌లో సెంచరీ సాధించిన తొలి క్రికెటర్‌గా త్రిష నిలిచింది. సూపర్ సిక్స్‌లో స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో గొంగడి త్రిష (110 నాటౌట్, 59 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లు) శివమెత్తింది. ఓపెనర్ కమలిని (51, 42 బంతుల్లో 9 ఫోర్లు) అర్ధ సెంచరీతో మెరవగా తొలి వికెట్‌కు 147 పరుగులు జోడించారు. త్రిష 53 బంతుల్లోనే సెంచరీ బాదటంతో తొలుత భారత్ 20 ఓవర్లలో 208/1 పరుగుల భారీ స్కోరు సాధించింది. రికార్డు ఛేదనలో స్కాట్లాండ్ 14 ఓవర్లలో 58 పరుగులకు కుప్పకూలింది. ఆయుశి శుక్లా (4/8), గొంగడి త్రిష (3/6), వైష్ణవి శర్మ (3/5) కలిసి పది వికెట్లు పడగొట్టారు.

హైదరాబాద్‌లో రెండు కొత్త ఐటీ పార్కులు

- పరిశ్రమలకు భూకేటాయింపులపై ప్రత్యేక పాలసీ :

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ నగర శివార్లలో కొత్తగా రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన "డ్యూ' సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులతో మంగళవారం సచివాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'ఐటీ రంగంలో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్నది. ప్రముఖ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. అందుకే హైటెక్ సిటీ తరహాలోనే కొత్తగా మరో రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. వీటిని ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలి. ఏయే ప్రాంతాలు ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయో సంబంధిత యంత్రాంగం అధ్యయనం చేస్తుంది' అని మంత్రి తెలిపారు. 'పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పరిశ్రమలకు భూకేటాయింపులపై ఇప్పటి వరకు ప్రత్యేక పాలసీ అంటూ లేదు. దీని వల్ల పారిశ్రామికవేత్తలు ఇబ్బంది పడుతున్నారు. అందుకే ప్రత్యేక పాలసీని రూపొందించాలని నిర్ణయించాం. పెట్టుబడి, కల్పించే ఉద్యోగాల సంఖ్య ఆధారంగా భూమిని కేటాయిస్తాం' అని శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన డ్యూ సాఫ్ట్‌వేర్ కంపెనీకి ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా సహకరిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ డా.విష్ణువర్ధన్‌రెడ్డి, టీజీఐఐసీ సీఈవో మధుసూదన్, "డ్యూ" వెంచర్స్ ప్రెసిడెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్ఐ, కానిస్టేబుల్

- కేసు నుంచి తప్పించదానికి రూ.3 లక్షల డిమాండ్
- రూ.లక్షా 30 వేలకు సెటిల్‌మెంట్



నవతెలంగాణ-తిరుమలగిరి

పీడీఎస్ బియ్యం కేసు నుంచి తప్పించడానికి రూ.3 లక్షలు డిమాండ్ చేసి రూ.లక్ష లంచం తీసుకుంటూ ఎస్ఐ, కానిస్టేబుల్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటన మంగళవారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల పోలీస్ స్టేషన్లో జరిగింది. వివరాల్లోకెళితే..

తిరుమలగిరి మండలం వడ్డేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌పై నమోదైన పీడీఎస్ బియ్యం కేసును తప్పించడానికి తిరుమలగిరి ఎస్ఐ సురేష్ రూ.3లక్షలు డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేనని చంద్రశేఖర్ రూ.లక్షా 30వేలకు సెటిల్‌మెంట్ చేసుకున్నాడు. అందులో భాగంగా ఈనెల 25న సూర్యాపేటలోని శ్రీసాయి ఫిల్లింగ్ స్టేషన్ ఖాతాకు ఫోన్‌పే ద్వారా రూ.30వేలు, 28న కానిస్టేబుల్ నాగరాజుకు రూ.30వేలు వేయించుకున్నాడు. అరెస్టు నుంచి తప్పించడానికి మిగతా డబ్బులు ఇవ్వాలన్నారు. దాంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఎస్ఐ సురేష్ సమక్షంలో కానిస్టేబుల్ నాగరాజు రూ.70వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అంతకుముందు, 25న కానిస్టేబుల్ నాగరాజు కూడా ఫోన్‌పే ద్వారా మరో రూ.10వేలు లంచం తీసుకున్నాడు. మొత్తం రూ.1.40లక్షల(ఎస్ఐకి లక్ష, కానిస్టేబుల్‌కు రూ.40వేలు)ను సీజ్ చేశారు. వారిద్దరిని అరెస్టు చేసి నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరు పరుచనున్నామని అధికారులు తెలిపారు. తన తమ్ముడు రత్నాకర్‌పై నమోదైన కేసులో తనను కూడా కావాలని ఇరికించారని బాధితుడు చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిలో ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్, సీఐ వెంకట్రావు, రామారావు, స్టాఫ్ శ్రీధర్, నరేష్ సంపత్‌తోపాటు మొత్తం 17 మంది పాల్గొన్నారు.

నా సర్వీస్‌లో ఇలాంటి కేసు చూడలేదు

మీర్‌పేట హత్య కేసులో నిందితుని అరెస్ట్

- ఇంట్లో గొడవల కారణంగా భార్య హత్య
- నిందితుడిలో కనపడని పశ్చాత్తాపం
- ఇంత క్రూరంగా మనిషిని చంపుతారా.. : రాచకొండ సీపీ సుధీర్‌బాబు ప్రెస్‌మీట్



నవతెలంగాణ-హయత్ నగర్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మీర్‌పేట హత్యకేసులో నిందితుడు గురుమూర్తిని పోలీసులు మంగళవారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఒక మనిషిని ఇంత క్రూరంగా చంపుతారా.. మేమే నివ్వెరపోయామని సీపీ అన్నారు. భార్యను ఇంత దారణంగా చంపిన గురుమూర్తిలో ఎలాంటి పశ్చాత్తాపమూ కనిపించలేదన్నారు. మీర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును ఛేదించిన తీరును రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు మంగళవారం ఎల్‌బీ నగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

బాలాపూర్ మండలంలోని జిల్లెలగూడలో పుట్ట వెంకటమాధవి, గురుమూర్తి దంపతులు నివాసమున్నారు. వారికి ఇద్దరు సంతానం. మాధవి స్వస్థలం ప్రకాశం జిల్లా, రాచర్ల మండలం, జెల్లీవారి పుల్లెల చెరువు గ్రామం. గురుమూర్తి ఆర్మీలో 15 సంవత్సరాలు జవాన్‌గా పనిచేసి రిటైర్ అయ్యాడు. ప్రస్తుతం ప్రయివేటు సెక్యురిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 15న సంక్రాంతికి బాలాపూర్ మండల పరిధిలో ఉండే మాధవి బంధువుల ఇంటికి పిల్లలను తీసుకుని వెళ్లారు. పిల్లలను అక్కడే వదిలేసిన భార్యాభర్తలు ఇంటికి వచ్చారు. 16న ఉదయం భార్యతో గురుమూర్తి అకారణంగా గొడవకు దిగాడు. ఈ క్రమంలో మాధవి తలను గోడకేసి బాదడంతో ఆమె కింద పడిపోయింది. ఆ తర్వాత గొంతు నులిమి చంపేశాడు. అనంతరం ఇంట్లో ఉన్న కత్తితో మృతదేహాన్ని ముక్కలు చేసి వాటర్ హీటర్‌తో నీళ్లు మరిగించి శరీర భాగాలను అందులో ఉడకబెట్టాడు. ఆ తర్వాత గ్యాస్ పొయ్యిపై పెట్టి కాల్చాడు. మరలా రోకలితో పొడి చేశాడు. ఈ ప్రక్రియ అంతా ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పూర్తి చేశాడు. పోలీసులకు ఎలాంటి ఆధారాలూ లభించకుండా ఆ పొడిని బకెట్‌లో వేసుకుని తీసుకెళ్లి జిల్లేలగూడ పెద్ద చెరువులో పడేశాడు.

సీసీ కెమెరాల ద్వారా చిక్కాడు

పండుగ కావడం వల్ల హత్య సమయంలో ఆ ఇంట్లో ఎవరూ లేరు. దాంతో నిందితుడు చేసిందంతా ఎవరికీ తెలియలేదని సీపీ చెప్పారు. భార్యను హత్య చేశాక ఇల్లంతా శుభ్రం చేసి, పిల్లలను ఇంటికి తీసుకొచ్చాడని తెలిపారు. అమ్మ ఎక్కడ అని అడగ్గా.. బయటకు వెళ్లిందని పిల్లలకు గురుమూర్తి చెప్పాడు. రెండ్రోజుల తర్వాత మృతురాలి తల్లిదండ్రులు వచ్చి అడిగితే మిస్సింగ్ అయిందని మీర్‌పేటలో అత్తతో వెళ్లి ఫిర్యాదు చేశాడు. అయితే, విచారణలో భాగంగా సీసీ కెమెరాలను పరిశీలిస్తే కొన్ని అనుమానాలు వచ్చాయని, దాంతో సీన్ రీ కన్‌స్ట్రక్షన్‌లో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించామని వివరించారు. పోలీసులను కూడా తప్పుదోవ పట్టించాడని, నిందితుడి మేనమామకు అన్ని విషయాలూ తెలిపాడని అన్నారు. ఆధారాల కోసం పోలీసులు తీవ్రంగా శ్రమించారని, సాంకేతిక పరిజ్ఞానంతో కొన్ని ప్రాథమిక ఆధారాలను సేకరించి, గురుమూర్తిని మంగళవారం అరెస్టు చేసినట్టు సీపీ తెలిపారు. ఇంట్లో కత్తి, రోలర్, బకెట్, వాటర్ హీటర్, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇది క్షణికావేశంలో చేసిన హత్యకాదు.. పథకం ప్రకారమే చేసినట్టు గుర్తించామని సీపీ తెలిపారు. భార్యను ఇంత దారుణంగా హత్యచేసిన నిందితుడిలో ఎలాంటి పశ్చాత్తాపమూ కనిపించడం లేదన్నారు. ఈ సమావేశంలో ఎల్‌బి నగర్ జోన్ డీసీపీ ప్రవీణ్ కుమార్, అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అబ్కారీ శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీని నాంపల్లిలోని అబ్కారీ భవన్‌లో మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతులపై త్వరలోనే ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించి, అన్ని అంశాలపై చర్చిస్తానని భరోసానిచ్చారు.



మనపై మనకు నమ్మకం ఉండాలి

అక్షలి షా... భారతదేశ పాడి పరిశ్రమను ఆధునీకరించేందుకు సిద్ధమయ్యారు. తండ్రి ప్రోత్సాహంతో ప్రపంచ పాల ఉత్పత్తులను అధ్యయనం చేశారు. మంచార్‌లోని తమ భాగ్యలక్ష్మి డైరీ ఫామ్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా ప్రవేశించిన నాటి నుండి అనేక అంశాల గురించి విస్తృతంగా అధ్యయనం చేశారు. అటు రైతులకు, ఇటు వినియోగదారులకు మేలు జరిగేలా తన సంస్థను ఆధునీకరించి మంచి వ్యాపార వేత్తగా గుర్తింపు తెచ్చుకున్నారు. దేశంలోనే పాల ఉత్పత్తుల తయారీలో తన సంస్థకు ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. వ్యాపారంలోకి ప్రవేశించాలంటే మహిళలు ముందు తమలోని సామర్థ్యాలను తాము విశ్వసించాలని చెబుతున్న ఆమె పరిచయం...

పూణే సమీపంలోని చిన్న పట్టణమైనా మంచార్‌లో పుట్టి పెరిగిన అక్షలి షా చిన్నతనం గ్రామీణ జీవితంతో ముడిపడి వుంది. పరాగ్ మిల్క్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భాగ్యలక్ష్మి డైరీ ఫామ్‌లో పెరిగిన ఆమె ప్రకృతిని గమనిస్తూ ఉండేది. డైరీలోని ఆవులను, సేంద్రీయ వ్యవసాయాన్ని చూస్తూ అమూల్యమైన పాఠాలను నేర్చుకున్నారు. 'ఆవు దూడలు, రైతులతో ఎక్కువ సమయం గడపడం వల్ల నమ్మకం, స్థిరత్వం, సమాజ శక్తి గురించి తెలుసుకునే అవకాశం దక్కింది' అని షా ఓ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు.

పాడిపరిశ్రమపై అభిమానంతో...

పాడి పరిశ్రమలో అవగాహన పెంచుకోవాలనే ఉద్దేశంతో షా తన పాఠశాల విద్యను పూణేలో కొనసాగించి, ఎస్పీ జైన్ గ్లోబల్ నుండి ఎంబీఏ పూర్తి చేశారు. పదమూడేండ్ల కిందట మేనేజ్‌మెంట్ ట్రైనీగా పరాగ్ మిల్క్ ఫుడ్స్‌లోకి ప్రవేశించింది. వ్యాపారంలోని ప్రతి విషయంపై అవగాహన పెంచుకునేందుకు కృషి చేశారు. 'నేను కుటుంబ వ్యాపారంలో చేరాలని మొదట్లోనే నిర్ణయించుకున్నాను' అని ఆమె చెప్పారు. సంస్థ వారసత్వాన్ని కాపాడుకుంటూ వ్యాపారాన్ని ఆధునీకరించాలనే తపనతో ఆమె తన ప్రయాణం ప్రారంభించారు. గ్రౌండ్ లెవల్ నుండి తన పని మొదలుపెట్టారు. కంపెనీ కార్య కలాపాలపై సూక్ష్మ అవగాహనను పెంచుకున్నారు. తాజా ఆలోచనలను వ్యాపారంలో మిళితం చేసుకునేందుకు కృషి చేశారు. దీనికోసం ఆమె చురుకైన నాయకత్వ పాత్రను పోషించారు.

ఆమె నాయకత్వంలో...

పరాగ్ మిల్క్ ఫుడ్స్ ప్రధానంగా అమ్మకాలపై ఆధారపడ్డ సంస్థ. ప్రారంభం నుండి ఆమె లక్ష్యం, దాన్ని బలమైన మార్కెటింగ్ పవర్‌హౌస్‌గా మార్చడం. 'సంస్థను వినూత్న ఆలోచనలతో నింపాలని, బలమైన బ్రాండ్ ఉనికిని సృష్టించాలని నేను కోరుకున్నాను' అని ఆమె చెప్పారు. ఆమె నాయకత్వంలో పరాగ్ మిల్క్ ఫుడ్స్ భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ డెయిరీ ఫీవీజ+ కంపెనీలలో ఒకటిగా ఎదిగింది. ఇప్పుడు ఇది 20 కంటే ఎక్కువ దేశాలలో తన ఉనికిని నిలబెట్టుకుంది. అలాగే విభిన్న బ్రాండ్‌ల పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. వీటిలో గోవర్ధన్, గో చీజ్, ప్రైడ్ ఆఫ్ కౌస్, అవ్వాటర్ ఉన్నాయి. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, హర్యానాలోని కంపెనీ అత్యాధునిక సౌకర్యాలు, నాణ్యత, ఆవిష్కరణల కోసం షా ఎంతో నిబద్ధతతో పని చేశారు.



సవాళ్లను తెచ్చిపెట్టింది

షా వ్యవస్థాపక దృష్టి పాల ప్రాథమిక అంశాలకు మించి విస్తరించింది. అధిక-ప్రోటీన్ ఆహారాలు, ఆరోగ్య-కేంద్రీకృత ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను గుర్తించి ఆమె పరాగ్ మిల్క్ ఫుడ్స్‌ను అవ్వాటర్ వెయ్ ప్రోటీన్‌తో ఆరోగ్యం, పోషకాహార రంగంలోకి నడిపించింది. 'స్పెక్ట్రం అంతటా వినూత్న ప్రోటీన్ పరిష్కారాలను అందించే అవకాశాన్ని మేము చూశాము' అని ఆమె చెప్పింది. ఈ వ్యూహాత్మక వైవిధ్యీకరణ పరాగ్ మిల్క్ ఫుడ్స్‌ను ఆరోగ్యం, పోషకాహార సంస్థగా పరిణామం చెందింది. ఇది సాంప్రదాయ, ఆధునిక వినియోగదారులకు సేవలు అందిస్తుంది. పురుషాధిక్య పరిశ్రమలోకి ప్రవేశించడం షాకు కొన్ని సవాళ్లను తెచ్చి పెట్టింది. 'మహిళా నాయకురాలిగా నమ్మకం, విశ్వసనీయతను సంపాదించడం అంత సులభం కాదు' అని ఆమె పంచుకుంటుంది.



నాణ్యత పట్ల నిబద్ధత

అమ్మకాల నుండి మార్కెటింగ్‌కు కంపెనీ దృష్టిని మార్చేటప్పుడు ఆమె ప్రతిఘటనను కూడా ఎదుర్కొంది. సంస్థలో గణనీయమైన మార్పు అవసరం. ఆవిష్కరణను నడిపిస్తూ ఉత్పత్తి స్థిరత్వాన్ని కొనసాగించడం మరొక అడ్డంకి. 'పాడి పరిశ్రమలో, నమ్మకం, సంప్రదాయం చాలా ముఖ్యమైనవి' అని ఆమె చెప్పారు. అనుకూలత, నాణ్యత పట్ల నిబద్ధత ఈ సంక్లిష్టతలను అధిగమించడంలో ఆమెకు సహాయపడ్డాయని అన్నారు. షా నాయకత్వంలో, పరాగ్ మిల్క్ ఫుడ్స్ ఆదాయం 2021-22లో రూ.20,256 మిలియన్ల నుండి 2023-24లో రూ.30,898 మిలియన్లకు పెరిగింది. ఈ వృద్ధిలో ఎక్కువ భాగం స్థిరమైన, వినియోగదారు -కేంద్రీకృత వ్యూహాలు, వినూత్న ఉత్పత్తికి ఆమె రుణపడి ఉందని చెప్పాలి.

రైతులపై సానుకూలత

'మా బలమైన మౌలిక సదుపాయాలు, అధునాతన ఆహార సాంకేతికత, విశ్వసనీయ రైతు నెట్‌వర్క్, విస్తృత పంపిణీ మార్గాల బలం మాకు పునాదిగా ఉన్నాయి. ఇది పరిశ్రమలో మాకు ఒక ముద్ర వేయడానికి సహాయపడుతుంది' అని ఆమె పంచుకున్నారు. ఆర్థిక విజయాలకు మించి వినియోగదారులు, రైతులపై ఆమె చేసిన కృషి సానుకూల ప్రభావాన్ని చూడటంలో తాను గొప్ప సంతృప్తిని పొందానని షా చెప్పారు. 'మేము చేసిన వినూత్న ప్రయత్నాల వల్ల రైతులు కూడా ప్రయోజనాలు పొందుతున్నారు. అలాగే మా ఉత్పత్తులను విశ్వసించే వినియోగదారులు కూడా మా బలోపేతానికి కారణమయ్యారు' అంటూ ఆమె జతచేశారు.

ఇదే మంచి అవకాశం

వ్యవస్థాపక రంగంలో మహిళలకు ఇది సరైన సమయం అని ఆమె విశ్వసిస్తున్నారు. 'వనరులు, సహాయక విధానాలకు పెరుగుతున్న ప్రాధాన్యతతో మహిళలు కొత్త ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధిని నడిపించడానికి మంచి స్థితిలో ఉన్నారు' అని ఆమె నొక్కి చెబుతున్నారు. నిజానికి ఆమె పాత్ర తన కంపెనీకి మించి విస్తరించింది - మహిళా వ్యవస్థాపకులకు మద్దతు ఇచ్చేందుకు, లింగ అంతరాన్ని తగ్గించేందుకు అన్ని విధాల సహాయసహకారాలు అందించేందుకు, అందుకు తగ్గ వాతావరణం సృష్టించేందుకు ఆమె ఎప్పుడూ సిద్ధంగా ఉన్నారు. 'వ్యవస్థాపక ప్రపంచంలోకి ప్రవేశించాలనుకునే మహిళలు తమ సామర్థ్యాలను విశ్వసించాలి, ఆత్మవిశ్వాసంతో ప్రయాణాన్ని స్వీకరించాలి. ప్రతి అడ్డంకి ఆవిష్కరణలు, అభివృద్ధికి ఒక అవకాశం' అని ఆమె చెబుతున్నారు. 'మహిళలు తమ పరిసరాల నుండి ప్రేరణ పొందాలి, అడ్డంకులను అధిగమించాలి, నిబంధనలను పునర్నిర్వచించాలని నేను కోరుతున్నాను' అని ఆమె తన మాటలు ముగించారు.

- పాలపర్తి సంధ్యారాణి

సూర్యోదయానికి ముందే..



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది రాత్రి లేటుగా నిద్రపోవడం, ఉదయం లేటుగానే నిద్రలేవడం జరుగుతుంది. దీనివల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. సమయానికి తినడం, నిద్రపోవడం వంటి క్రమశిక్షణతో కూడిన జీవితానికి చాలామంది ఇప్పుడు దూరమవుతున్నారనడంలో ఆశ్చర్యం లేదు. సూర్యోదయానికి ముందు ఒక గంట నిద్ర లేవడం వల్ల ఆరోజు చేయాల్సిన పనులను త్వరగా చేసుకోవడంతోపాటు, ఆరోగ్య ప్రయోజనాలు మెండుగా ఉన్నాయి అవేంటో తెలుసుకుందామా..!

- సూర్యోదయానికి ఒక గంట ముందు నిద్రలేచి.. కళ్లు మూసుకుని, కాసేపు నిటారుగా కూర్చుంటే.. ప్రేగు కదలికలు జరిగి శరీరంలోని వ్యర్థాలు తొలగిపోతాయి అని వైద్యులు చెబుతున్నారు. శరీరంలో వ్యర్థాలు తొలగిపోవడం వల్ల ఆరోగ్యానికి మంచిది.
- బ్యాక్టీరియా కానీ, ఆల్కహాల్, అరుగుదల కోసం వేసుకునే మందులు, మృతకణాలు కానీ ఇలా ఏవైనా.. శరీరం నుంచి తొలగిపోవడం వల్ల ఆరోగ్యానికి మంచిది.

ప్రతిరోజూ ఉదయాన్నే ఇలా చేయడం వల్ల రక్తంలో చక్కెరస్థాయిలు అదుపులో ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ■

ఆగుతూ.. సాగుతూ..!

(మొదటిపేజీ తరువాయి)

నిర్మితమయ్యే ఎంసీహెచ్‌సీ బ్లాక్‌కు 2023 మార్చి 27న అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. మొదట్లో పనులు సజావుగానే సాగినా కొద్ది రోజులుగా ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా మారాయి. భవన నిర్మాణంలో అంచనాలు కూడా తారుమారయ్యాయి. జీ-7 భవన సముదాయం కాస్త జీ-2కే పరిమితమైంది. దీంతో రూ.55 కోట్ల నిర్మాణ వ్యయంతో పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు కూడా కొంత కాలంగా ముందుకే సాగని పరిస్థితి.

నత్తనడకన సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పనులు

ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో నిర్మిస్తున్న సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ భవన నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. పనులు ప్రారంభించి దాదాపు రెండేండ్లు కావస్తున్నా అసంపూర్తిగానే ఉన్నాయి. ఫ్లస్ వన్ పద్ధతిన రూ.20 కోట్లతో భవన నిర్మాణ పనులను చేపట్టినా.. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు దాదాపు రూ.3 కోట్లు మాత్రమే మంజూరైనట్టు తెలుస్తోంది.

ఫీవర్ ఆస్పత్రి నూతన భవనం అంతంతే..

నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో రోగుల తాకిడి ఎక్కువ. ఇక్కడ కార్పొరేట్ తరహాలో వైద్యం అందించడానికి రూ.115 కోట్లతో నిర్మిస్తున్న నూతన ఓపీ భవన నిర్మాణ పనుల్లోనూ జాప్యం జరుగుతోంది. మూడంతస్తుల భవనం పనులు ప్రారంభించి దాదాపు రెండేండ్లు గడిచినా ఇంకా పూర్తి కాలేదు. మొదటి అంతస్తు పూర్తయి రెండో అంతస్తులో పిల్లర వరకు పూర్తయ్యాయి. గతేడాది మే లోనే పూర్తి కావాల్సి ఉండగా నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలో నిలిపివేసినట్టు సమాచారం.

రూపాయి దిగాలు..

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో 86.53 వద్ద తెరుచుకున్న రూపాయి విలువ.. ఇంట్రాడేలో ఏకంగా 86.57 కనిష్ట స్థాయిని తాకింది. ఇంతక్రితం సెషన్‌లోనూ రూపాయి విలువ 11 పైసలు పతనమయ్యింది. గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు బ్యారెల్ ధర 0.52 శాతం పెరిగి 77.48 డాలర్లకు చేరింది. సోమవారం సెషన్‌లో రూ.5,015 కోట్ల ఎఫ్ఐఐలు తరలిపోయాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం, స్టాక్ మార్కెట్ల పతనం, ఇతర దేశీయ బలహీన సూక్ష్మ ఆర్థికాంశాలు రూపాయి విలువను ఒత్తిడికి గురి చేస్తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

ఇసుక మాఫియాపై ఉక్కుపాదం

ఇందిరమ్మ ఇండ్లకు సరఫరాపై అధ్యయనం : ముఖ్యమంత్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనావాసరెడ్డితో కలిసి గనుల శాఖపై మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఏటేటా నిర్మాణాలు పెరుగుతున్నా ఇసుక నుంచి ప్రభుత్వానికి ఆదాయం ఆశించినంత ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక దక్కేలా చూడాలనీ, అదే సమయంలో ప్రభుత్వానికి ఆదాయం పెంచే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మేజర్, మైనర్ ఖనిజాల గనులకు వేసిన జరిమానాలు వసూలు కాకపోవడంపైనా అధికారులను ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరాపై అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, టీజీ ఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్‌కుమార్ సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. వారంలోపు తమ అధ్యయనాన్ని పూర్తి చేసి సమగ్ర విధివిధానాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభించనున్న నేపథ్యంలో లబ్ధిదారులకు ఇసుక సరఫరాపై సమగ్రంగా అధ్యయనం చేయాలని వారికి సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్ పాల్గొన్నారు.

కేసీఆర్ ఆనవాళ్లు చెరిపే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. కాంగ్రెస్ వస్తే రైతుబంధు ఆగిపోద్ది అన్నాం.. అన్నట్టే జరిగిందని అన్నారు. రేవంత్‌రెడ్డికి రైతుల యోగక్షేమాలు ముఖ్యం కాదు.. ప్రతిదీ రాజకీయం చేయడమే ఆయన లక్ష్యమని తెలిపారు. రుణమాఫీ 40శాతం మందికి మాత్రమే అయిందని చెప్పారు. ప్రజా పాలన గ్రామ సభల్లో ప్రజలు, రైతులు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ఎక్కడికెళ్లినా దుమ్ము దులుపుతున్నారని అన్నారు. సంక్షేమ పథకాల కోసం పదే పదే దరఖాస్తులు అడుగుతూ..ప్రజలపై ఆర్థిక భారం వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి ధాన్యానికి బోనస్ ఇస్తామన్నారు.. అది లేదు.. తీరా సన్న ధాన్యం అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని విమర్శించారు. అన్ని రకాలుగా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ వాళ్లను నిలదీయాలని పిలుపునిచ్చారు. అది నల్లగొండ నుంచే మొదలవ్వాలని, కాంగ్రెస్‌ను చీల్చి చెండాడాలని అన్నారు. కాంగ్రెస్ పాలనపై పోరాటం మొదలైందన్నారు. తెలంగాణ అంతా సర్వ నాశనం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులను ఎక్కడికక్కడా నిలదీయాలన్నారు.

నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఓవర్ యాక్షన్ చేస్తుండు.. చాలా వల్గర్‌గా మాట్లాడుతున్నారు.. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి.. కాంగ్రెస్ చేసిన దానిపై నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్లో చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. కోమటిరెడ్డికి దమ్ముంటే ఉమ్మడి నల్లగొండ జిల్లాను ఏం అభివృద్ధి చేశారో, రైతులకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ హయాంలో నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో మెడికల్ కళాశాలను నిర్మించామని, యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేశామని, థర్మల్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌ది అని వివరించారు. ప్రజా పాలనలో స్వేచ్ఛ లేదని, రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పాలనపై నల్లగొండలో ధర్నా చేస్తామంటే కాంగ్రెస్ వాళ్ల లాగులు తడిశాయని విమర్శించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం సరైనదని ధర్నాకు రాష్ట్ర అత్యున్నత కోర్టు అనుమతించిందని, హైకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తల కంటే ఎక్కువగా అధికారులు ఓవరాక్షన్ చేశారని, అధికారుల్లారా జాగ్రత్త.. 'మళ్లీ మేమే వస్తాం.. అన్నీ చూసుకుంటాం.. అసలుకు వడ్డీతో సహా చెల్లిస్తాం' అని హెచ్చరించారు.

ఈ ధర్నాలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, మధుసూదనాచారి, ఎండీ మహమూద్ అలీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, గాదరి కిషోర్, భాస్కర్‌రావు, గొంగిడి సునీత, నోముల భగత్, ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నల్లగొండ జెడ్పీ మాజీ చైర్మెన్ బండా నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మెన్ మందడి సైదిరెడ్డి పాల్గొన్నారు.

అమెరికాకు హాని కలిగిస్తే చర్యలే

వాషింగ్టన్ : అమెరికా ప్రయోజనాలకు హాని కలిగించే దేశాలపై పన్నులు విధిస్తానని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. "అమెరికాకు హానికరంగా పరిణమించిన బయటి దేశాలపై, బయటి ప్రజలపై టారిఫ్‌లు విధించాల్సి వుంది. మౌలికంగా వారు వారి దేశానికి ప్రయోజనాలు చేకూర్చుకోవాలని భావిస్తున్నారు." అని ట్రంప్ వ్యాఖ్యానించారు. గత వారంలో రెండోసారి అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటిసారిగా సోమవారం ప్రతినిధుల సభలో ట్రంప్ మాట్లాడారు.

"వారేం చేస్తున్నారో చూడండి. చైనా, భారత్, బ్రెజిల్ ఇంకా చాలా దేశాలు అధికంగా సుంకాలు విధిస్తున్నాయి. కాబట్టి మనం అలా జరగడాన్ని ఇక ఎంత మాత్రమూ అనుమతించరాదు. అమెరికాను ప్రథమ స్థానంలో మనం నిలపాల్సి వుంది. మన ఖజానాలోకి డబ్బు వచ్చి పడే వ్యవస్థను మనం నెలకొల్పాలి. మరోసారి అమెరికా సుసంపన్నమైన దేశంగా నిలవాలి. అతి త్వరలోనే అది జరుగుతుంది." అని ట్రంప్ చెప్పారు. అమెరికాను మరింత సంపన్నమైన, శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దాలని, అటువంటి వ్యవస్థకు అమెరికా మళ్ళీ మళ్లాలని ట్రంప్ నొక్కి చెప్పారు. "విదేశాలను సుసంపన్నం చేసేందుకు మన పౌరులపై పన్నులు విధించే బదులు మన ప్రజలను సుసంపన్నులు చేసేందుకు విదేశాలపై పన్నులు విధించాలి." అని ట్రంప్ పేర్కొన్నారు.

"అమెరికా మొదటి ఆర్థిక నమూనా ప్రకారం, ఇతర దేశాలపై విధించే సుంకాలు పెరగాలి. అమెరికన్ కార్మికులపై, వ్యాపారాలపై విధించే పన్నులు తగ్గాలి. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు, ఫ్యాక్టరీలు స్వదేశానికి రావాలి." అని ట్రంప్ పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాలపై వంద శాతమూ టారిఫ్‌లు విధించాలని ట్రంప్ గతంలో వ్యాఖ్యానించారు. టారిఫ్‌లను నివారించాలని భావించినట్లైతే అమెరికాకు వచ్చి తయారీ యూనిట్లు పెట్టాల్సిందిగా ట్రంప్ కంపెనీలను కోరారు. "పన్నుల లేదా టారిఫ్‌లు చెల్లించరాదని మీరు భావించినట్లైతే, అమెరికాలో మీరు ప్లాంట్ పెట్టుకోవాల్సి వుంటుంది.

అది కూడా రికార్డు స్థాయిలో జరగాలి. ఇంతవరకు ఎవరూ ఊహించని రీతిలో చాలా తక్కువ వ్యవధిలోనే ఎక్కువ ఫ్యాక్టరీలు పెట్టబోతున్నాం. ఎందుకంటే వారికి ఎలాంటి టారిఫ్‌లు లేకపోగా ప్రోత్సాహకాలు వుంటాయి." అని ట్రంప్ పేర్కొన్నారు. ఫార్మాస్యూటికల్స్, సెమీ కండక్టర్లు, ఉక్కు వంటి రంగాల్లో కంపెనీలు పెట్టేందుకు అమెరికా మద్దతునిస్తుందన్నారు. అమెరికా మిలటరీకి అవసరమైన ఉక్కు, అల్యూమినియం, రాగి, ఇతర ఖనిజాలపై టారిఫ్‌లు విధించనున్నట్లు చెప్పారు. మళ్ళీ మన దేశానికి ఉత్పత్తిని తీసుకురావాల్సి వుందన్నారు. గతంలో రోజుకు ఒక ఓడ తయారుచేసిన రోజులు వున్నాయి, కానీ ఈనాడు మనం ఓడను నిర్మించలేకపోతున్నాం, ఏం జరుగుతోందో నాకు అర్థం కావడం లేదు. అన్నీ ఇతర ప్రాంతాలకు, దేశాలకు వెళ్ళిపోతున్నాయని ట్రంప్ వ్యాఖ్యానించారు.

పెట్టుబడులన్నీ పారదర్శకమే..

(మొదటిపేజీ తరువాయి)

రాలేదనీ, ప్రధానిగా పీవీ నర్సింహారావు తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలు, మన్మోహన్‌సింగ్ హయాంలో వాటి కొనసాగింపులో భాగంగానే వచ్చాయని విశ్లేషించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం నిరంతర ప్రక్రియ అనీ, రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నా, రాష్ట్రాభివృద్ధిలో అందరూ కలిసిరావాలని కోరారు. వచ్చిన పెట్టుబడులకు సంబంధించి భూకేటాయింపులు, అనుమతుల మంజూరు ప్రక్రియను వేగవంతంగా చేస్తామన్నారు. నైపుణ్య శిక్షణ కోసం సింగపూర్‌లోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ (ఐటీఈఎస్) సంస్థతో ఇక్కడి యంగ్ ఇండియా యూనివర్సిటీ ఒప్పందం చేసుకుందని తెలిపారు. ఆ దేశంలో పదవ తరగతి పూర్తికాగానే విద్యార్థులకు సాంకేతిక శిక్షణ ఇస్తారనీ, దాన్నే ఇక్కడ కూడా అమల్లోకి తెస్తామన్నారు. దానితో పాటు ఆదేశ విద్యార్థులు ఇక్కడి యంగ్ ఇండియా యూనివర్సిటీలో విద్యను అభ్యసించేలా, ఇక్కడి విద్యార్థులు సింగపూర్‌లోని ఐటీఈఎస్‌లో శిక్షణ తీసుకొనేలా ఒప్పందం చేసుకున్నామని వివరించారు. గత ఏడాది దావోస్ నుంచి రూ.40వేల కోట్ల పెట్టుబడులు 28 కంపెనీలతో చేసుకున్నామనీ, దానిలో 15 కంపెనీలు యాక్టివ్‌లో ఉండగా, మరో పది ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయనీ, మరికొన్ని ఎర్లీ స్టేజ్‌లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడుల్ని జీర్ణించుకోలేని కొందరు వ్యక్తుల మాటల్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన పెట్టుబడులు, తమ ప్రభుత్వ హయాంలో వచ్చిన పెట్టుబడులపై 2028లో కాంపారిటెల్ టేబుల్ (పోలుస్తూ) తెస్తామన్నారు. అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో తమ కార్యాలయాలను ఏర్పాటు చేసినా, వాటిని విస్తరిస్తామంటూ ఒప్పందాలు చేసుకుంటే తప్పు ఏంటని ప్రశ్నించారు. ఈ ఏడాది దావోస్, సింగపూర్ పర్యటనలో 49,550 ఒప్పందాల ద్వారా రూ.1,82,950 కోట్ల పెట్టుబడులు వచ్చాయనీ, దీనివల్ల రాష్ట్రంలోని నిరుద్యోగులకు 51,400 ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగానే తమ ప్రభుత్వ విధాన నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు. దానిలో భాగంగానే క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ తెచ్చామన్నారు. ప్రపంచ దేశాలు చైనాకు వ్యతిరేక ఆర్థిక వ్యవస్థల కోసం అన్వేషిస్తున్నాయనీ, వారికి ప్రత్యామ్నాయంగా భారతదేశం కనిపిస్తున్నదనీ, అందులో తెలంగాణకు తొలి ప్రాధాన్యత ఉందని విశ్లేషించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి, విదేశాల్లో పెట్టుబడులు పెట్టారనీ, కానీ తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చామని చెప్పారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫార్ములా ఈరేస్‌పై సీఎంకు వ్యతిరేకంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడాన్ని విలేకరులు ప్రస్తావించగా, ఆయన బానిస సంకెళ్లు తెంచుకోవాలని తాను కోరుకుంటున్నాననీ, ఏడాది క్రితం అయన ఏం మాట్లాడాడో అందరికి తెలుసని సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు.

30న అఖిలపక్ష సమావేశం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఈనెల 30న(గురువారం) అఖిల పక్ష సమావేశం జరగనున్నది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ప్రారంభం కానున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అఖిల పక్ష సమావేశం నిర్వహించనున్నది. తొలిరోజు శుక్రవారం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. పార్లమెంట్ సమావేశాలు రెండు విడుతల్లో జరగనున్నాయి. తొలి విడత సమావేశాలు 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరుగుతాయి. ఇక రెండో విడుత సమావేశాలు మార్చి 10న మొదలై.. ఏప్రిల్ 4 వరకు జరుగుతాయి. ఈ మేరకు పార్లమెంటరీ బులిటెన్ విడుదలైంది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న లోక్‌సభలో కేంద్ర బడ్జెట్-2025ను ప్రవేశపెడుతారు. అదే రోజు ఎకనామిక్ సర్వేను ప్రవేశపెడతారు. పార్లమెంట్ సమావేశాలకు ముందురోజు జనవరి 30న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. రాబోయే సమావేశాల్లో సభను సజావుగా నిర్వహించేందుకు అన్ని పార్టీలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గతంలో సమావేశాలు జరిగిన తీరును ప్రస్తావించారు. రెండు సెషన్లలో పార్లమెంట్ సమావేశాల్లో గందరగోళం నెలకొంది. దాంతో పార్లమెంట్ ప్రతిష్ట దెబ్బతిన్నదనీ, ఈ సమావేశాల్లోనైనా ప్రతిపక్ష నాయకులు, ఇతర ఎంపీలు చర్చల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షం సహకరిస్తేనే పార్లమెంట్ పని చేయడంతో పాటు చర్చలు జరుగుతాయన్నారు. ఈ సారి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సమతుల్య బడ్జెట్‌ను ప్రవేశపెడుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

బీజేపీ ఆదాయం 'ఫుల్లు'

(మొదటిపేజీ తరువాయి)

రూ.3,967 కోట్లు. ఇందులో ఎన్నికల బాండ్ల ద్వారా రూ.1,685.6 కోట్లు, ఆజీవాన్ సహయోగ్ నిధి ద్వారా రూ.236.3 కోట్లు, ఇతర విరాళాల ద్వారా రూ.2,042.7 కోట్లు సమకూరాయి. ఆ పార్టీకి వ్యక్తిగత దాతలు రూ.240 కోట్లు, కార్పొరేట్లు రూ.1,890 కోట్లు, సంస్థలు-సంక్షేమ సంఘాలు రూ.101.2 కోట్లు, ఇతరులు రూ.50 కోట్లు అందజేశారు. గత సంవత్సరం మార్చి 31 నాటికి బీజేపీకి చేతిలో రూ.109.2 కోట్లు, బ్యాంకుల్లో రూ.1,627.2 కోట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో 5.,377.3 కోట్లు ఉన్నాయి.

నాగోబాకు మహాజలాభిషేకం

(మొదటిపేజీ తరువాయి)

వాయిస్తూ.. కాగడాలను వెలిగిస్తూ పూజలు చేశారు. ఈ పూజలకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, ఎస్పీ గౌస్ అలం, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ తదితరులు హాజరయ్యారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 2 వరకు జాతర అధికారికంగా కొనసాగనుంది. 31న జాతరలో గిరిజన దర్బార్ నిర్వహించనున్నారు. దీనికి మంత్రి, జిల్లా ఇన్‌చార్జి సీతక్కతో పాటు ఇతర మంత్రులు హాజరు కానున్నారు. జాతరకు ప్రభుత్వం తరపున ఏర్పాట్లు చేశారు.

నాగోబా జాతర భక్తులకు శుభాకాంక్షలు

టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాగోబా జాతరకు విచ్చేస్తున్న భక్తులకు టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదిశేషుని నాగోబా జాతర దేశంలోనే రెండో అతిపెద్ద గిరిజన జాతర అనీ, అత్యంత నియమ నిష్టలతో ఆదివాసీలందరూ నిర్వహించుకునే వేడుక అని తెలిపారు. ఆ జాతర గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతుందనీ, మెస్రం వంశస్థుల ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు వైభవంగా జాతర జరుగుతుందని చెప్పారు. తెలంగాణ సంస్కృతి ఉట్టి పడేలా జాతరకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ

15 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం / 60 మందితో రాష్ట్ర కమిటీ / కొత్తగా ఏడుగురికి చోటు

(మొదటిపేజీ తరువాయి)

పట్టణంలో గత నాలుగు రోజులుగా కొనసాగిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలు అత్యంత జయప్రదంగా ముగిశాయి. చివరి రోజైన మంగళవారం కార్యదర్శి, నూతన రాష్ట్ర కమిటీ ఎన్నికతో మహాసభల ప్రక్రియ దిగ్విజయంగా ముగిసింది. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యదర్శి, కార్యదర్శివర్గ సభ్యులను, రాష్ట్ర కమిటీ సభ్యులను పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్, బీవీ రాఘవులు, ఇప్పటివరకూ కార్యదర్శిగా పనిచేసి రిలీవ్ అయిన తమ్మినేని వీరభద్రం, తదితర నేతలు అభినందించారు. రాష్ట్రంలో సీపీఐ(ఎం)కు పూర్వవైభవాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆ కృషిలో నూతన రాష్ట్ర కమిటీ సఫలీకృతం కావాలన్నారు. అందుకు తమవైపు నుంచి సంపూర్ణ సహాయ సహకారాలు ఉంటాయని మహాసభ ప్రతినిధుల సాక్షిగా హామీనిచ్చారు. అనంతరం 'ఆకలిమంటలు.. మలమలమాడే అనాథలందరూ లేవండోయ్'..అనే అంతర్జాతీయ గీతంతో ప్రతినిధులు అత్యంత స్ఫూర్తిదాయకంగా తమతమ కార్యక్షేత్రాలకు బయలుదేరి వెళ్లారు.

సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలకు 28 మంది ప్రతినిధులు

ఏప్రిల్ మాసంలో తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో జరిగే సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలకు హాజరయ్యే 28 మంది ప్రతినిధులతో పాటు ఏడుగురు ప్రత్యామ్నాయ ప్రతినిధులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది.



సీపీఐ(ఎం) రాష్ట్ర నూతన కార్యదర్శిగా ఎన్నికై మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరే..

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా 15 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అందులో జాన్‌వెస్లీ, జి.నాగయ్య ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, చుక్క రాములు, టి.జ్యోతి, టి.సాగర్, ఎమ్‌డీ. అబ్బాస్, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, పి.ప్రభాకర్, బండారు రవికుమార్, నున్నా నాగేశ్వర్‌రావు, ఎమ్‌డీ.జహంగీర్ ఉన్నారు. ఇప్పటిదాకా కార్యదర్శివర్గ సభ్యులుగా ఉన్న తమ్మినేని వీరభద్రం, చెరుపల్లి సీతారాములు, డీజీ.నర్సింహారావు రిలీవ్ అయ్యారు. వారిస్థానంలో కొత్తగా బండారు రవికుమార్, నున్నా నాగేశ్వర్‌రావు, ఎమ్‌డీ.జహంగీర్ ఎన్నికయ్యారు.

ప్రతినిధుల బృందంలో ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, చుక్కరాములు, టి.జ్యోతి, జాన్‌వెస్లీ, టి.సాగర్, ఎమ్‌డీ.అబ్బాస్, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, పి.ప్రభాకర్, బండారు రవికుమార్, నున్నా నాగేశ్వర్‌రావు, ఎమ్‌డీ.జహంగీర్, డీజీ.నర్సింహారావు, వై.కిరణ్‌చంద్ర, రవి, ఆర్.వెంకట్రాములు, ఎర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, ఎం.సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, మచ్చా వెంకటేశ్వర్లు, మల్లు నాగార్జునరెడ్డి, సాదుల శ్రీనివాస్, పగడాల యాదయ్య, ఎం.కనకారెడ్డి, ఎ.మల్లారెడ్డి ఉన్నారు. ప్రత్యామ్నాయ ప్రతినిధులుగా అన్నవరపు కనకయ్య, ఆనగంటి వెంకటేశ్, బి.సాంబశివ, ఎమ్‌డీ.నూర్జహాన్, ఎస్.రమ, కొండమడుగు నర్సింహ్మా, రాంపల్లి రమేశ్ ఉన్నారు.

రాష్ట్ర కమిటీ సభ్యులు వీరే

జె.వెంకటేశ్, ఎస్.రమ, భూపాల్, జయలక్ష్మి, రాంపల్లి రమేశ్, ఎ.నర్సిరెడ్డి, రవి, కె.హిమబిందు, ఎమ్‌వీ.రమణ, పి.ఆశయ్య, ఆర్.వెంకట్రాములు, బుర్రి ప్రసాద్, ఆర్.శ్రీరాంనాయక్, స్కైలాబ్‌బాబు, ఆర్.అరుణజ్యోతి, జె.బాబూరావు, పి.సచిన్, వై.శ్రీకాంత్, ఎం.భారతి, బండి రమేశ్, ఎం.సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, నారి అయిలయ్య, డబ్బీకార్ మల్లేశం, ఎం.నాగార్జునరెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కె.యాదగిరిరావు, కొండమడుగు నర్సింహ్మా, బి.అనురాధ, ఎ.కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే.రమేశ్, సాదుల శ్రీనివాస్, ఎం.కనకారెడ్డి, పగడాల యాదయ్య, ఏ.మల్లారెడ్డి, బి.సాంబశివ, జి.ప్రభాకర్‌రెడ్డి, బందు సాయిలు, వి.పర్వతాలు, సీహెచ్.రంగయ్య, పి.సత్యం, ఎం.వెంకటేశ్, పుట్ట ఆంజనేయులు, జి.జయరాజు

ఆహ్వానితులు

నూర్జహాన్, ఆనందాచారి, ప్రవీణ్, అడివయ్య, లెల్లెల బాలకృష్ణ, ఉడుత రవీందర్, కళ్యాణం వెంకటేశ్వర్లు.

ప్రత్యేక ఆహ్వానితులు

చెరుపల్లి సీతారాములు, నంద్యాల నర్సింహారెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి, ఆర్.సుధాభాస్కర్, బుగ్గవీటి సరళ

కంట్రోల్ కమిషన్ ఇదే..

కంట్రోల్ కమిషన్‌ను ఐదుగురు సభ్యులతో వేశారు. దానికి డీజీ నర్సింహారావు చైర్మెన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా వంగూరు రాములు, కె.నరసమ్మ, మాటూరి బాలరాజుగౌడ్, ఎం.వాసుదేవరెడ్డి ఉండనున్నారు.

ఇదీ ప్రస్థానం..

పేరు	:	జాన్‌వెస్లీ
జననం	:	13 జనవరి 1964
తల్లిదండ్రులు	:	మోశన్న, బేతమ్మ
భార్య	:	భారతి
కుమారుడు	:	జై అంకుశ్
విద్యాభ్యాసం	:	డిగ్రీ
సొంతూరు	:	వనపర్తి జిల్లా అమరచింత



ఉద్యమ నేపథ్యం

- 1978లో వామపక్ష విద్యార్థి ఉద్యమాల వైపు ఆకర్షితులు
- 1996లో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శిగా నియామకం
- 1998లో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక
- 1997లో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీకి ఎన్నిక
- ప్రస్తుతం కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల్లో ఉన్నారు.
- రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లో 2022లో జరిగిన పార్టీ రాష్ట్ర మూడో మహాసభలో కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నిక
- కుల వివక్షకు వ్యతిరేకంగా, దళితుల హక్కుల కోసం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులుతో కలిసి సైకిల్ యాత్ర చేపట్టారు.
- వెస్లీ నేతృత్వంలో కేవీపీఎస్ పోరాటాల ఫలితంగా రాష్ట్రంలో జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పాటు
- కేవీపీఎస్ పదేండ్ల పోరాటం ఫలితంగా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు. దేశంలోనే తెలంగాణలో తొలిసారి అమలు.
- రాష్ట్రంలో సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర బృందంలో సభ్యులు.

కమ్యూనిస్టులకు విశ్రాంతి లేదు

- రాష్ట్రంలో ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యం
- నిరంతర పోరాటాల ద్వారా బీజేపీని వెనక్కి నెడదాం : సీపీఐ(ఎం) శ్రేణులకు తమ్మినేని పిలుపు

సంగారెడ్డి నుంచి అచ్చిన ప్రశాంత్

కమ్యూనిస్టులకు రిలీవ్ అనేది ఉండదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల నుంచి రిలీవ్ అయిన తమ్మినేని వీరభద్రం వ్యాఖ్యానించారు. మూడుసార్లు కార్యదర్శిగా పనిచేసిన తాను నిబంధనల ప్రకారం ఆ బాధ్యతల నుంచి మాత్రమే రిలీవ్ అయ్యాయని తెలిపారు. తెలంగాణలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకుపోవడం, బలోపేతం చేయడమే తమ లక్ష్యమని నొక్కి చెప్పారు. సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల సందర్భంగా



ప్రతినిధుల సభలో ఆయన కార్యదర్శి హోదాలో ముగింపు ఉపన్యాసం చేశారు. తెలంగాణలో రాబోయే రోజుల్లో కమ్యూనిస్టు పార్టీ సత్తా చూపిస్తామన్నారు. అయితే, అందుకోసం కార్యకర్తలందరూ కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో క్షేత్రస్థాయి ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై అధ్యయనం చేయాలనీ, తద్వారా పోరాటాలకు రూపకల్పన చేయాలని సూచించారు. ప్రస్తుత పాలకులు అనుసరిస్తున్న ఆర్థిక విధానాల లోగుట్టును బట్టబయలు చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లపై విస్తృత చర్చలు నిర్వహించడం ద్వారా ఆయా ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు, వాటి అమలు కోసం కేటాయించిన నిధుల లెక్కలు తేల్చాలని విశదీకరించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇప్పటికే వామపక్షాలతో పని చేస్తున్నామనీ, రానున్న రోజుల్లో ఆ దిశగా మరింత కృషి జరగాలని సూచించారు. మతోన్మాదం, ఆర్థిక విధానాలు, కులవివక్ష, సామాజిక అణిచివేతపై ఎప్పటికప్పుడు పోరాటాలు నిర్వహించడం ద్వారా పార్టీని ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. మొత్తంగా తెలంగాణలో బీజేపీని వెనక్కి కొట్టడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలంటూ మార్గదర్శనం చేశారు.

దేశాన్ని కాపాడేది ఎర్రజెండానే

- తెలంగాణలో పార్టీకి పూర్వవైభవం తీసుకొద్దాం
- సీనియర్ల సలహాలు, సూచనలతో ముందుకెళ్తా: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడేది ఎర్రజెండా మాత్రమేనని సీపీఐ(ఎం) రాష్ట్ర నూతన కార్యదర్శి జాన్‌వెస్లీ నొక్కి చెప్పారు. ఈ క్రమంలో భారతదేశానికి కమ్యూనిస్టుల అవసరం ఎంతో ఉందని వ్యాఖ్యానించారు. సంగారెడ్డిలోని సీతారాం ఏచూరి నగర్‌లోని మల్లు స్వరాజ్యం ప్రాంగణంలో మంగళవారం ముగిసిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన అనంతరం ఆయన ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉమ్మడి రాష్ట్రంలో పార్టీకి సారథ్యం వహించిన బీవీ.రాఘవులు, తెలంగాణలో ఇప్పటివరకూ కార్యదర్శిగా సేవలందించిన తమ్మినేని వీరభద్రంతో పోలిస్తే తాను వారి దరిదాపుల్లో కూడా ఉండబోనని చెప్పారు. అయితే, వారు నడిచిన బాటలో నడవడం ద్వారా పార్టీకి రాష్ట్రంలో పూర్వవైభవం తీసుకొచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ప్రతినబూనారు. వర్గసమస్యలు, సామాజిక పోరాటాలకు రూపకల్పన చేయడం ద్వారా మతోన్మాదానికి అడ్డుకట్ట వేస్తామని హెచ్చరించారు.



మహాసభలో రిలీవ్ అయిన తమ్మినేని, కార్యదర్శివర్గ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు తనకు దిశానిర్దేశం చేస్తూ ముందుకు నడిపించాలని కోరారు.



రిలీవైన నాయకులు







మహాసభ ప్రతినిధుల్లో 140 మంది యువత

- జైలు జీవితం గడిపినవారు 281 మంది
- 70ఏండ్ల పైబడినవారు 18మంది
- మహిళా ప్రతినిధులు 111 మంది

సంగారెడ్డి నుంచి అచ్చిన ప్రశాంత్

సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభకు మొత్తం 635 మంది హాజరుకాగా..అందులో ప్రతినిధులు 476 మంది, పరిశీలకులు 118 మంది, వెటరన్స్ 10 మంది, పీసీఎమ్స్ 31 మంది ఉన్నారు. ప్రతినిధులు, పరిశీలకుల్లో మహిళలు 111 మంది, పురుషులు 521 మంది, ఇతరులు ముగ్గురున్నారు. రాష్ట్ర కేంద్రం నుంచి 178 మంది ప్రతినిధులు హాజరుకాగా.. నల్లగొండ జిల్లా నుంచి అత్యధికంగా 51 మంది ప్రతినిధులు వచ్చారు. సూర్యాపేట నుంచి 41, యాదాద్రి భువనగిరి నుంచి 38, ఖమ్మం నుంచి 36, భద్రాద్రి కొత్తగూడెం నుంచి 34, సిద్దిపేట నుంచి 31 మంది చొప్పున హాజరయ్యారు. అతి తక్కువగా జగిత్యాల నుంచి ఒక్కరే హాజరయ్యారు. వికారాబాద్, కామారెడ్డి నుంచి ముగ్గురు చొప్పున హాజరయ్యారు. జోగులాంబ గద్వాల, మెదక్, నారాయణపేట, ఆదిలాబాద్, సిరిసిల్ల జిల్లాల నుంచి నలుగురు చొప్పున వచ్చారు. నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ఐదుగురు చొప్పున ప్రతినిధులు హాజరయ్యారు.

మొత్తం సభ్యుల్లో పీజీ, ఆపైన ఉన్నతవిద్య అభ్యసించినవారు 111మంది, ప్రొఫెషనల్ విద్యను అభ్యసించినవారు 21 మంది, డిగ్రీ చదివినవారు 226 మంది, టెక్నికల్ విద్య చదివినవారు 16 మంది, ఇంటర్ చదివినవారు 127 మంది ఉన్నారు. పదో తరగతిలోపు చదివిన వారు 129 మంది కాగా...నిరక్షరాస్యులు ఐదుగురున్నారు. ఇండ్ల కోసం చేసిన పోరాటం, మతోన్మాద వ్యతిరేక ప్రచారం, పోడు భూముల పోరాటాల్లో 566 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

1970కి ముందు పార్టీలో చేరిన ప్రతినిధులు ఐదుగురున్నారు. మహాసభకు వచ్చిన ప్రతినిధుల్లో 1971-1980 మధ్యలో చేరినవారు 40 మంది, 1981-1990 మధ్యలో చేరినవారు 125 మంది, 1991-2000 మధ్యలో చేరినవారు 207 మంది, 2001-2010 మధ్యలో చేరినవారు 168 మంది, 2011-2021 మధ్యలో వచ్చినవారు 52 మంది, 2021-నుంచి ఇప్పటివరకూ 13 మంది చేరిన వారు ఉన్నారు.

మహాసభలో పాల్గొన్న ప్రతినిధుల్లో బీసీలు 216 మంది, ఎస్సీలు 159 మంది, ఎస్టీలు 40, మైనార్టీలు 64 మంది, ఇతరులు 156 మంది ఉన్నారు.

మహాసభ ప్రతినిధుల్లో హెూల్‌టైమర్లు 394 మంది కాగా, రైతులు 34 మంది, వ్యవసాయ కార్మికులు 33మంది, కార్మికులు 21మంది, ఉద్యోగులు 58 మంది, విద్యార్థులు ముగ్గురు, నిరుద్యోగులు ముగ్గురు, వృత్తిదారులు పది మంది, ఇతరులు 79 మంది ఉన్నారు. ఏడాదిలోపు జైలు జీవితం గడిపిన వారు 279 మంది, రెండేండ్లు గడిపినవాళ్లు ఇద్దరున్నారు. ఏడేండ్లు, ఆపైగా అజ్ఞాన జీవితం గడిపినవారు ఒక్కరుకాగా..రెండేండ్ల నుంచి ఆరేండ్ల వరకు గడిపినవారు ఎనిమిది మంది, 15 రోజుల నుంచి ఏడాది వరకు అజ్ఞాన జీవితం గడిపినవారు 43 మంది ఉన్నారు.

మొత్తం ప్రతినిధుల్లో 21 నుంచి 30 ఏండ్లలోపు ఉన్నవారు 23 మంది, 31 నుంచి 40 ఏండ్లలోపు 117 మంది, 41 నుంచి 50 ఏండ్లలోపు 206 మంది, 51 నుంచి 60 ఏండ్లలోపు వాళ్లు 198 మంది, 61 నుంచి 70 ఏండ్లలోపు వారు 69 మంది, 71 నుంచి 80 ఏండ్లలోపు వారు 14 మంది, 81 నుంచి 90 మధ్య వయస్సు గలవారు నలుగురు ప్రతినిధులున్నారు.

ప్రతినిధుల సభకు హాజరైన వారిలో 1970కి ముందు నుంచి హెూల్‌టైమర్లుగా ఉన్నవారు ఇద్దరు, 1971-1980 మధ్యలో 11మంది, 1981-1990 మధ్యలో 33 మంది, 1991-2000 మధ్యలో 134 మంది, 2001-2010 మధ్యలో 155 మంది, 2011-2020 మధ్యలో 71 మంది, 2021 తర్వాత 25 మంది ఉన్నారు. ప్రతినిధుల సభకు హాజరైన వారిలో 98 మంది సాధారణ సభ్యులు కాగా..28 మంది శాఖ కార్యదర్శులు, మండల, పట్టణ కమిటీల నుంచి 33 మంది, జిల్లా కమిటీల నుంచి 388 మంది, రాష్ట్ర కేంద్రం నుంచి 70 మంది, కేంద్ర కమిటీ నుంచి ముగ్గురు ఉన్నారు.

ట్రేడ్ యూనియన్ నుంచి

మహాసభ ప్రతినిధుల్లో ట్రేడ్ యూనియన్ నుంచి 166 మంది, వ్యవసాయ కార్మిక సంఘం నుంచి 79మంది, రైతు సంఘం నుంచి 77 మంది, మహిళా సంఘం నుంచి 68 మంది, యువజన సంఘం నుంచి 9 మంది, విద్యార్థి సంఘం నుంచి 12 మంది, చేతివృత్తుల నుంచి 29 మంది, గిరిజన సంఘం నుంచి 20 మంది, కేవీపీఎస్ నుంచి 22 మంది, మైనార్టీ రంగం నుంచి ఏడుగురు, కళారంగం నుంచి తొమ్మిది మంది, ఉపాధ్యాయ రంగం నుంచి 20 మంది, పత్రికారంగం నుంచి 32 మంది, వికలాంగ రంగం నుంచి ఐదుగురు, మధ్యతరగతి నుంచి 9 మంది, పార్టీ నుంచి 16 మంది ఉన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886